In Public domain. Digitization Muthulakshmi Research Academy

కాళిదాస విరచిత

మేఘ సందేశం



డా॥. పి. శశిరేఖ

In Public domain. Digitization Muthulakshmi Research Academy

In Public domain. Digitization Muthulakshmi Research Academy

కాళిదాస విరచిత

మేఘసందేశం

డా॥ పి. శశిరేఖ
Professor of Sanskrit (Retd.)
ఉస్మానియా విశ్వవిద్యాలయము

2019

In Public domain. Digitization Muthulakshmi Research Academy

కాళిదాస విరచిత

మేఘసందేశం

© Author

రచయిత : డా॥ పి. శశిరేఖ
Professor of Sanskrit (Retd.)
ఉస్మానియా విశ్వవిద్యాలయము

ప్రథమ ముద్రణ : 2019

ప్రతులకు : Dr. P. Shashirekha
106, Indra Estates, Ramnagar,
Hyderabad - 500020. Cell: 09346664116

వెల : రూ. 60/-
$ 5

ముఖచిత్రం : Dream Snap Studio, Hyderabad

డి.టి.పి. : ధరణి గ్రాఫిక్స్,
రాంనగర్, హైదరాబాద్.

ముద్రణ : తిరుమల గ్రాఫిక్స్
చిక్కడపల్లి, హైదరాబాద్.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

హృదయాంజలి...

తెలుగువారికి సంస్కృత సంస్కృతీ సౌరభాలను అందించి, సారస్వత చంద్రికలను ప్రసరింపజేసి, కావ్యసుధాధారలను వర్షించి తరింపజేసిన మా ఆచార్యులు మహామహోపాధ్యాయ శ్రీ శ్రీరామచంద్రుడు గారి చరణారవిందాలకు నా యీ భక్తిపూర్వక హృదయాంజలి.

– శశిరేఖ

In Public domain. Digitization Muthulakshmi Research Academy

స్వగతం...

కాళిదాస కావ్య రసాస్వాదన కోసమే సంస్కృతం నేర్చుకున్న నాకు నా మనోభీష్టం సిద్ధించింది. గంధర్వగానంలా, పీయూషపానంలా పరవశింపజేసే కాళిదాస కవితామాధురీఝరిని రసజ్ఞులకు అందివ్వాలని యీ చిన్న ప్రయత్నం. వాఙ్మయానికి దూరమై, హృదయ సౌకుమార్యానికి నోచుకోని వారికి ఇది ఒక చిరుకానుక. ఉత్తర భారతంలో సంస్కృతానికి గల ఆదరం దక్షిణ భారతంలో కొరవడిందనటంలో సందేహం లేదు. ప్రాంతీయ భాషలకు, సంస్కృతానికి అడ్డుగోడ నిర్మించి అమాయకులను తప్పుత్రోవపట్టిస్తున్నారు. ప్రాంతీయ భాషలకు 'సంస్కృతం' ఆత్మ అనే ఆత్మీయ భావన భారతీయ పురోగతికి సోపానమౌతుంది. "సంస్కృత వాఙ్మయ సంపద"ను ప్రాచీన కవులు ఆయా భాషలలోకి అనువదించి అందించారు. అట్టి ప్రయత్నాన్ని యీ తరం వారు కూడా చేపట్టాలని ఆశిస్తూ...

– శశిరేఖ

21.11.2019

In Public domain. Digitization Muthulakshmi Research Academy

విషయసూచిక

- మేఘసందేశం: కవి పరిచయము - కావ్యపరిచయము 1
- మేఘసన్దేశమ్ 9
- యక్షుడు మేఘాన్ని చూడటం, సందేశానికై ప్రార్థించటం 15
- పర్వతం పైనుండి కదిలే మేఘవర్ణనం 29

ప్ర.అ. = ప్రతి పద అర్థము

తా. = తాత్పర్యము

వి. = వివరణ

In Public domain. Digitization Muthulakshmi Research Academy

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మేఘసందేశం

కవి పరిచయము - కావ్యపరిచయము

"కాలిదాసగిరాం సారం కాలిదాసః సరస్వతీ,
చతుర్ముఖోஉథవా సాక్షాత్ విదుర్నాన్యేతు మానవాః"

వ్యాఖ్యాతసార్వభౌముడైన మల్లినాథసూరి సూక్తి ఇది. "కాళిదాసు వాక్కుల సారం (అంతరార్థం) అతనికే తెలియాలి, లేదా వాగ్దేవి ఐన సరస్వతికీ, చతుర్ముఖుడైన బ్రహ్మకు తెలియాలి. ఈ ముగ్గురూ తప్ప ఏ మానవ మాత్రుడూ ఆ కవి కావ్యసారాన్ని తెలుసుకోలేడు."

కాళిదాస కావ్యాలకి ప్రాణప్రదమైన "సంజీవిని" వ్యాఖ్య వ్రాసిన సహృదయ శిరోమణియే ఇలా అంటే ఇక సామాన్యుల మాట చెప్పటానికేముంది? ఒకవేళ ఎవరైనా ఆ కవికుల గురువును గూర్చి చెప్పాలనుకుంటే చెప్పవచ్చు కాని మొత్తంగా కాళిదాస మహాకవి అంతరంగాన్ని గ్రహించగలిగామని అనుకుంటే మాత్రం పొరపాటే.

కాళిదాసకవికి సంస్కృతవాఙ్మయంలో గల స్థానం అద్వితీయం. ఈ విషయాన్ని ఒక కవి తనమాటల్లో ఇలా చెప్పాడు-

"పురా కవీనాం గణనా ప్రసంగే కనిష్ఠికాధిష్ఠిత కాలిదాసా,
అద్యాపి తత్తుల్యకవేరభావాత్ అనామికా సార్థవతీ బభూవ"

"పూర్వం ఒకనాడు కవులెందరున్నారు?" అని లెక్కవేయనారంభించారట కొందరు సహృదయులు. మొదట చిటికెన వ్రేలు పట్టుకొని 'కాళిదాసు' అని లెక్కించి తరువాత ఎవరా అని ఎంత ఆలోచించినా ఆ కవి తరువాత అంతటివాడు ఈనాటి వరకూ లభించలేదు. అందువల్ల చిటికెన వ్రేలి తరువాత ఉన్న ఉంగరపు వ్రేలు 'అనామిక', పేరులేనిదిగా మిగిలిపోయింది, ఉంగరపు వ్రేలికి అనామిక అనిపేరు.

In Public domain: Digitization Muthulakshmi Research Academy

దానిని కవి ఈ విధంగా చమత్కరించారు.

ఇక గద్యచక్రవర్తిగా పేరుగాంచిన బాణుడు హర్షచరితారంభంలో పూర్వకవులను ప్రశంసిస్తూ కాళిదాసును గూర్చి పలికిన పలుకులు తేనెల సోనలు. ఆ కవి మాటల్లో కాళిదాసు తీయని పలుకులు మధువును నింపుకున్న పూలగుత్తులే.

"నిర్గతాసు న వా కస్య కాలిదాసస్య సూక్తిషు,
ప్రీతిర్మధురసాంద్రాసు మంజరీష్వివ జాయతే"

"నిండుగా తేనెను నింపుకున్న పుష్పగుచ్ఛాల్లా ఉండే కాళిదాసు సూక్తులు అంటే ఎవరికి ప్రీతి కలుగదు"?

ఉత్తమ కావ్యం అంటే ఎలా ఉండాలో, మహాకవులు అంటే ఎవరో సోదాహరణంగా విడమర్చి చెప్పి, కావ్యప్రపంచానికి ఒక క్రొత్త వెలుగును 'ధ్వన్యాలోకాన్ని' అందించిన ఆనందవర్ధనుడు ఈ ప్రపంచంలో కవులలో మహాకవులు కాళిదాసు వంటివారు ఇద్దరో ముగ్గురో లేదా ఐదుగురో ఆరుగురో మాత్రమే ఉంటారు అంటూ ఒక్క కాళిదాసు పేరుమాత్రమే పేర్కొంటాడు.

"యేనాస్మిన్నతి విచిత్ర కవిపరంపరా వాహిని సంసారే కాలిదాసప్రభృతయో ద్విత్రాః పంచషా వా మహాకవయ ఇతి గణ్యన్తే".

"అతివిచిత్రమైన కవిపరంపరకలిగిన యీ సంసారంలో కాళిదాసు మొదలైన ఇద్దురు ముగ్గురు లేదా ఐదారుగురు మాత్రమే మహాకవులుగా పరిగణించబడతారు."

అంతేకాదు వాల్మీకి, వ్యాసుల సరసన కాళిదాసును నిలిపాడు ఆనందవర్ధనాచార్యుడు.

కేవలం భారతీయ విద్వాంసుల హృదయాలనే కాదు పాశ్చాత్యపండితుల మనస్సులను కూడా తనవశం చేసుకొన్నది కాళిదాసకావ్యకన్యక.

"సర్ విలియమ్ జోన్స్" అనే యూరోపియన్ విద్వాంసుడు సంస్కృతాన్ని అధ్యయనం చేయటమే గాక కాళిదాస శాకుంతలాన్ని ఆంగ్లంలోనికి అనువదించాడు. ఆ తరువాత అది జర్మనుభాషలోకి అనువదించబడింది. ఆ జర్మను భాషలో రచించబడిన 'శాకుంతలం' గెథే అనునతడు చదివి ఆనందంతో నర్తించాడట. అతని మాటల్లో–

In Public domain. Digitization Muthulakshmi Research Academy

"ఓ ప్రియమిత్రమా! వసంత ఋతువులో లభించే పుష్పాన్నీ గ్రీష్మ ఋతువులో లభించే ఫలాన్నీ ఒకే సమయంలో చూడాలని నీవనుకుంటే, మనసుకు తృప్తినీ, మోహాన్నీ కలిగించే రసాయనం ఏదైనా కావాలనుకుంటే, లేదా స్వర్గ–మర్త్య లోకాల సౌందర్యాతిశయాన్నంతా ఒక్కచోటే చూడాలనుకుంటే, శాకుంతలాన్ని సేవించు".

ఈ మధురమైన భావాన్ని సంస్కృతభాషలో పొదిగి మరింత అందం చేకూర్చారు ఒక కవి. ఆ శ్లోకం ఇలా ఉంది–

"వాసన్తం కుసుమం ఫలం చ యుగపత్ గ్రీష్మస్య సర్వం చ యత్
యచ్చాన్యన్మనసో రసాయనమతః సంతర్పణం మోహనమ్,
ఏకీభూతమభూతపూర్వమథవా స్వర్లోకభూలోకయోః
ఐశ్వర్యం యది వాఞ్ఛసి ప్రియసఖే! శాకుంతలం పఠ్యతామ్".

ఈ మహాశయుని పుణ్యమా అంటూ 'కాళిదాస శాకుంతలం' విశ్వవిహారిణి ఐంది. ఐతే భారతీయ కవులందరిలాగే ఇతని దేశ, కాలాలను గూర్చి కూడా వివాదాలు ఉన్నాయి. భారతదేశంలో పూర్వకాలంలో కవులు కీర్తికాంక్షించలేదు కానీ ఆర్జించారు. వారు సమాజానికి కాంతాసమ్మితమైన సందేశాన్ని అందిచడంలోనే నిమగ్నులైనారు. కానీ తమ వంశావళిని గూర్చి పుంఖానుపుంఖాలుగా వ్రాసుకోలేదు. దాని పర్యవసానం మహాకవులను అందరూ 'మావాడంటే మావాడ' న్నారు. అదీ ఒకందుకు మంచిదే. ఇదే జాతీయతా భావాన్ని పదిలపరిచింది. కాళిదాస కవి విషయంలో వివిధ విద్వాంసుల మతాలు ఇలా ఉన్నాయి.

'జ్యోతిర్విదాభరణం' లోని ఒక శ్లోకం కాళిదాసు విక్రమార్కుడి ఆస్థానంలో ఉందేవాడని చెప్తుంది.

"ధన్వంతరిక్షపణకామరసింహ శంకు
వేతాలభట్ట ఘటకర్పర కాలిదాసాః,
ఖ్యాతో వరాహమిహిరో నృపతేః సభాయాం
రత్నాని వై వరరుచిర్నవ విక్రమస్య."

"ధన్వంతరి, క్షపణకుడు, అమరసింహుడు, శంకుడు, వేతాలభట్టు, ఘటకర్పరుడు, కాళిదాసు, వరాహమిహిరుడు, వరరుచి – ఈ నవరత్నాలు (రత్నాల్లాంటి కవులు) విక్రముని ఆస్థానాన్ని అలంకరించారు."

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వీరు విక్రమునికి చెందిన వారైనా కావచ్చు, వేరొకరికి చెందిన వారైనా కావచ్చు. భారతభారతి విద్యాస్థానంలో 'నవరత్నాలు' అని చెప్పటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

పైన చెప్పబడిన 'విక్రమార్కుని' విషయంలో ఇతడు 'ఏ విక్రమార్కుడు' అని సందేహ పరంపర ఉంది. కొందరు గుప్తవంశానికి చెందిన ద్వితీయచంద్రగుప్తునికి విక్రమార్కుడనే బిరుదు ఉండటం చేత కాళిదాసు ఆతని ఆస్థానానికి చెందినవాడై ఉంటాడని అభిప్రాయం వెలిబుచ్చారు. దీని ప్రకారం కాళిదాసు క్రీ.శ. 3-5 శతాబ్దుల మధ్యకాలంలో ఉండి ఉండవచ్చు.

'మాళవికాగ్నిమిత్ర' నాయకుడైన అగ్నిమిత్రుని (శుంగవంశీయుడు) సమకాలీనుడు కాళిదాసు. అందుచేత క్రీ.పూ. 150 సంవత్సరానికి చెందినవాడు అని కొందరి మతం.

క్రీ.పూ 56వ సంవత్సరంలో విక్రమసంవత్తును ప్రారంభించిన 'విక్రమాదిత్యుని' ఆస్థానంలో కాళిదాసు ఉండేవాడని చాలామంది భారతీయ పండితుల అభిప్రాయం. ఈ విక్రమాదిత్యుడు ఉజ్జయినీ నగరాన్ని పరిపాలించాడు.

అలాగే క్రీ.పూ. 11వ శతాబ్దానికి చెందిన భోజరాజుకూ, కాళిదాసుకూ సమకాలీనత్వాన్ని అంటగట్టడమే కాదు 'భోజ కాళిదాసుల' ను గూర్చి చమత్కారపూర్ణమైన కథలు రచించబడి చాలా ప్రాచుర్యంలోనికి వచ్చాయి. సంస్కృతంలో రచించబడిన "భోజప్రబంధం" మహాకవులందర్నీ భోజరాజు ఆస్థానకవులుగా వర్ణిస్తుంది.

ఇలా అతని కాలాన్ని గూర్చేగాక అతడు ఏ ప్రాంతానికి చెందినవాడనే విషయంలోనూ భిన్నాభిప్రాయాలున్నాయి. క్రీ.శ. 634వ సంవత్సరమునకు సంబంధించిన 'ఐహొూల' శాసనమునందు కాళిదాసు ప్రసక్తి కనుపించటం చేత ఈ మహాకవి అంతకు ముందు వాడని చెప్పటానికి ఆధారం లభించింది. క్రీ.పూ మొదటి శతాబ్దానికి చెందిన వాడనేదే చాలామంది విద్వాంసుల అభిప్రాయం

ఈ విషయంలో మహామహోపాధ్యాయ ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు గారి పలుకులు అమృతపుగుళికలు. అవి ఇలా ఉన్నాయి.

“కాళిదాసు ఎక్కడివాడైనా, ఎప్పటివాడైనా అతని కవితావైభవం మాత్రం దేశకాలాతీతమైనది. తద్ద్వారా ఈతడు కూడా దేశకాలాతీతుడే అనే విషయంలో మాత్రం ఎవరికీ విప్రతిపత్తి (మతభేదం) ఉండడానికి అవకాశం లేదు”. ఇలా చెపుతూ వారు రచించిన ఒక అందమైన శ్లోకం–

In Public domain. Digitization Muthulakshmi Research Academy

“త్వాం కాశ్మీరలలాట దివ్య తిలకం కేచిజ్జనా జానతే
కేచి ద్వఙ్గ వరోత్తమాఙ్గముకుటాలంకార హీరాఙ్కురమ్,
కే చిచ్చోజ్జయినీ ఘనీకృత యశః కన్దం సమాచక్షతే
త్వేతే విశ్వజనీనకావ్య మహితం మన్యామహేభారతమ్”.

(కాళిదాస కవితా విలాసం : పుల్లెల శ్రీరామచంద్రుడు)

“కొందరు నిన్ను కాశ్మీరలలాటంపై అందమైన తిలకం అంటారు. కొందరు వంగాంగనా శిరోభూషణమైన వజ్రకాంతివని భావిస్తారు. మరి కొందరు ఉజ్జయినీ నగరపు యశోరాశివని తలుస్తారు. మేమైతే నిన్ను విశ్వజనీన (సమస్త ప్రపంచానికీ చెందిన) కావ్యమహిమయే రూపుదాల్చి వచ్చిన భారతీయుడవు అని సంభావిస్తాము.”

ఈ విధంగా కాళిదాసకవి అందరి మనసుల్నీ దోచుకున్నాడు. అందుచేతనే జాతి గర్వించే అతణ్ణి జాతీయ కవిగా అగ్రస్థానంలో ప్రతిష్ఠించి తన ప్రతిష్ఠను నిలుపుకొంది భారతదేశం.

ఇక కాళిదాస శైలిని గూర్చి తెలుసుకోవాలంటే ఆలంకారికుల వద్దకు వెళ్లాల్సిందే. **కావ్యాలంకారసూత్రాణి** అనే అలంకార గ్రంథం రచించిన క్రీ.శ. 800 ప్రాంతానికి చెందినవాడైన వామనుడు కావ్యరీతులను గూర్చి వివరిస్తూ కవికులగురు విరచితమైన శాకుంతలంలోని శ్లోకాన్ని వైదర్భీరీతికి ఉదాహరణంగా ఇస్తాడు.

కావ్యరీతులు మూడు. అవి – వైదర్భి, పాంచాలి, గౌడి. వీటిలో ‘వైదర్భి’ లక్షణాన్ని వామనుడు ఇలా చెప్పాడు.–

“అస్పృష్టా దోషమాత్రాభిః సమగ్ర గుణగుంఫితా,
విపఞ్చీ స్వరసౌభాగ్యా వైదర్భీ రీతిరిష్యతే.”

(కావ్యాలంకారసూత్రాణి 1-11)

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వినటానికి కటువుగాను, గ్రామ్యంగాను ఉండటం దోషంగా పరిగణించబడుతుంది. అలాంటి దోషాలు ఏ మాత్రం లేకుండా, సమగ్రమైన గుణాలతో కూడుకొని వీణానాదంలా మధురంగా ఉండే 'రీతియే' 'వైదర్భి' రీతి."

సమగ్ర గుణాలు అంటే ప్రసాద, మాధుర్యాది గుణాలు. కొందరు మూడు గుణాలు చెపితే కొందరు పది గుణాలు చెప్పారు. ఏది ఏమైనా చెప్పింది చక్కగా అర్థమయ్యేరీతిలో ఉండటం ప్రసాదగుణం. ఇంపుగా ఉండటం మాధుర్య గుణం. వర్ణనకనుగుణంగా పదాల కూర్పు అవసరం. ఇది కాళిదాసుకు అప్రయత్నంగానే సిద్ధించింది. ప్రతిభావంతులకు పదాలు వాటంతటవే "మేము, మేమంటే వచ్చి పడతాయి" అంటాడు ఆనందవర్ధనుడు. అలా పదాలు వచ్చి వాలుతాయి. కాళిదాసు కావ్యారంభంలో "వాగార్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే ..." అని ప్రార్థించాడు కదా! అందుచేత 'వాగర్థాలు' అతని చేతిలో విన్యాసం చేసాయి. ఇక 'కావ్యపాకం' అంటూ ఒకటుంది. "కావ్యపరిణతి" ఆ పాకం. సహృదయులురసాస్వాదనం చేయటానికి కవి చేసే 'కావ్యపాకమే' కారణం. ఈ కావ్యపాకం ప్రధానంగా మూడు విధాలుగా చెప్పబడింది. 1. ద్రాక్షాపాకం. 2. నారికేళపాకం, 3. కదళీపాకం.

వీటిలో కాళిదాస మహాకవి రచనలు ద్రాక్షాపాక భరితములు. **'ద్రాక్షా పాకస్సకథితో బహిరంతఃస్ఫురద్రసః'.**

"ద్రాక్షా ఫలంలో ఎలాగైతే స్పృశించినంతనే రసం చిప్పిలుతుందో ఆ విధంగా బయటా లోపలా కూడా రసమయం ద్రాక్షాపాకం". కాళిదాసు పదాల్లో ఈ మాధుర్యం తొణికిసలాడుతుంటుంది. ఇక ఆయన ఉపమాసౌందర్యం గూర్చి చెప్పనవసరం లేదు. **'ఉపమా కాళిదాసస్య'** – అని ప్రసిద్ధోక్తి ఉండనే ఉంది. అన్నింటినీ మించి 'ఇది అది' అని చెప్పలేని ఒక మనోహరవిలాసం అతని కావ్యకన్యకలో అణువణువునా తొంగి చూస్తుంది. అందుచేత **'కాళిదాసే కవితాకామినీ విలాస'** మని జయదేవకవి వర్ణించాడు.

"యస్యా శ్చోర శ్చికురనికరః కర్ణపూరో మయూరో
భాసోహాసః కవికుల గురుః కాళిదాసో విలాసః – – –
కేషాం నైషా కథయ కవితా కామినీ కౌతుకాయ".

ఎవరికైతే **చోరకవి** కేశసంపదమో, **మయూరుడు** కర్ణాభరణమో, **భాసుడు** మందహాసమో, **కాళిదాసు** విలాసమో – –––– అలాంటి కావ్యకన్యను చూస్తే ఎవరికి

కావాలని అనిపించదు? (అందరికీ కావాలని అన్పిస్తుంది.)

In Public domain. Digitization Muthulakshmi Research Academy

కాళిదాసు రచనలు :- కాళిదాసు కవితావైభవాన్ని చూసి మురిసిపోయిన కవులెందరో తామూ ఉత్తమరచనలు చేయాలని ప్రయత్నించి ఉంటారు. అలా ప్రయత్నించి కావ్యరచన చేసాక తమపేరుతో ప్రకటిస్తే అనుకున్నంతగా గుర్తింపు వస్తుందో రాదో అనే సందేహం వారికి కలిగి ఉంటుంది. అందువల్ల తమ రచనలను కాళిదాసు పేరుతోనే ప్రకటిస్తే తమకు కీర్తి రాకపోయినా తమ రచనలకు గుర్తింపు వస్తుందనే ఆశతో ఆ కవి పేరుతో తమ రచనలు జోడించి ఉంటారు. అందుచేత ఎన్నో కావ్యాలూ, నాటకాలూ, మంత్రశాస్త్ర జ్యోతిఃశాస్త్రాది శాస్త్ర గ్రంథాలు కాళిదాసు పేరుతో ప్రచారంలోకి వచ్చాయి. అయితే విమర్శకులు మాత్రం ఏడింటిని మాత్రమే కాళిదాసు రచనలుగా గుర్తించారు. అవి - నాలుగు శ్రవ్యకావ్యాలు, మూడు దృశ్యకావ్యాలు (రూపకాలు).

రచనా క్రమాన్ని బట్టి చూస్తే **ఋతుసంహారం, కుమారసంభవం, మాళవికాగ్నిమిత్రం** మొదట రచించబడినట్లు తెలుస్తోంది. **మేఘసందేశ - విక్రమోర్వశీయాలు** కవి ఇంచుక ప్రౌఢదశను సంతరించుకున్న తర్వాత చేసిన రచనలై ఉంటాయి. అతడు పరిపూర్ణ లోకానుభవాన్ని చవిచూసాక చేసిన రచనలు పంచమహాకావ్యాలలో అగ్రగణ్యమైన **రఘువంశం,** దృశ్యకావ్యాలలో మకుటాయమానమైన **అభిజ్ఞానశాకుంతలం.**

రచనల సంక్షిప్తపరిచయం :-

రఘువంశం :- పంచమహాకావ్యాలలో మొదట పేర్కొనబడే మహాకావ్యం **"రఘువంశం"**. ఇది 19 సర్గల మహాకావ్యం. **రఘు** మహారాజు జనకుడైన **దిలీపునితో** ప్రారంభమై చివరిరాజైన <u>అగ్నివర్ణుని</u> వరకూ గల 29 మంది రాజుల కథ ఇందులో వర్ణించబడింది. ఇందులో 7 గురి కథ విస్తారంగానూ, 22 మంది కథ సంక్షిప్తంగానూ వర్ణించబడింది. వీరరసప్రధానమై ఇతర రసాలు అంగరసాలుగా కూర్చబడిన ఉదాత్త మనోజ్ఞకావ్యం యీ **'రఘువంశం'**.

కుమారసంభవం :- పంచమహాకావ్యాల్లో ద్వితీయస్థానాన్ని అలంకరించిన మహాకావ్యం 'వాగర్థావివ' అంటూ తాను వందనమాచరించిన ఆదిదంపతులు పార్వతీపరమేశ్వరుల ప్రణయాన్నీ పరిణయాన్నీ కనులకు కట్టినట్లుగా వర్ణించాడు కాళిదాసు. ఇతని శివభక్తికి దర్పణం యీ కావ్యం. 17 సర్గల్లో కూర్చబడిన యీ కావ్యంలో 9 మాత్రమే కాళిదాస విరచితమనీ మిగిలినవి ప్రక్షిప్తాలనీ విద్వాంసుల అభిప్రాయం.

In Public domain, Digitization Muthulakshmi Research Academy

హిమాలయవర్ణనం, పార్వతీజననం, శివునకై ఆమె చేసే పరిచర్యలు, శివుని తపోభంగం, మన్మథ దహనం, మరల పార్వతితపస్సు, శివుడు ఆమె తపస్సుకు మెచ్చి ఆమెతో వివాహానికి అంగీకరించి సప్తర్షులను హిమవంతుని వద్దకు పెళ్లిమాటలకై పంపటం, శివపార్వతుల పరిణయ ఘట్టం - ఇవన్నీ ఇందులోని మనోహరవర్ణనలు.

ఋతుసంహారం :- ఇది కాళిదాస విరచితమే కాదని కొందరి అభిప్రాయం. ఇంతకు ముందు చెప్పినట్లుగా ఇది అతని తొలిరచన అయిఉంటుంది. ఈ కావ్యంలో ఆరు సర్గల్లో ఆరు ఋతువులు వర్ణించబడినాయి. కావ్యం గ్రీష్మంతో ఆరంభమై ఆహ్లాదకరమైన వసంతంతో ముగుస్తుంది. మొత్తం శ్లోకాలు 144. ఏ ఋతువులో ఏవి సుఖకరంగా ఉంటాయో వర్ణిస్తాడు. కాలం ఏదైనా అనురక్తులైన నాయికా నాయకులకు అడ్డుగా నిలువదు. ఆరు ఋతువులూ ఆనందమయాలే అని యీ చిన్నకావ్యం తెలియజేస్తుంది. ఈ **'ఋతుసంహారమే'** కాళిదాసు ప్రకృతి పరిశీలనకు తార్కాణమని చెప్పవచ్చు.

రూపకాలు :- కాళిదాస మహాకవి విరచితాలు మూడు రూపకాలు. అవి 1. అభిజ్ఞాన శాకుంతలం, 2. మాళవికాగ్నిమిత్రం, 3. విక్రమోర్వశీయం.

1. అభిజ్ఞానశాకుంతలం :- కాళిదాసుకు విశ్వవిఖ్యాతిని చేకూర్చిన 'నాటకం' అభిజ్ఞానశాకుంతలం. ఆలంకారికులు చెప్పిన నాటక లక్షణాలకు ఈ నాటకం లక్ష్యంగా నిలుస్తుంది. ఇతివృత్తపరంగా గాని, రచనాపరంగా గాని దీనికిదే సాటి. అందుచేతనే

> **"కావ్యేషు నాటకం రమ్యం, తత్ర రమ్యా శకుంతలా**
> **తత్రాపి చతుర్థోఽఙ్కః తత్ర శ్లోక చతుష్టయమ్."**

అని అన్నారు. ఈ కావ్యంలోని "గ్రీవాభంగాభిరామం" అనే శ్లోకాన్ని అభినవగుప్తుడు నాట్యశాస్త్రంలోని రసచర్చ సందర్భంలో ఉదాహరించాడు. కాలుష్యమెరుగని ఆశ్రమంలో పెరిగిన ముగ్ధ **శకుంతల**. నాగరిక ప్రపంచానికి చక్రవర్తి **దుష్యంతుడు**. సాక్ష్యమే లేనిది వారి గాంధర్వవివాహం. ఆ ఒక్క **అభిజ్ఞానం**(గుర్తు) అంగుళీయకం కనపడకపోతే ఎంతటి అనర్థం వాటిల్లిందో వివరించాడు కవి యీ నాటకంలో. జన్మనిచ్చిన వారు వదిలి వెళ్లగా, కరుణాంతరంగుడైన **కణ్వమహర్షి** ఆ శిశువును చేరదీసి పెంచాడు. అత్తవారింటికి పంపేసమయంలో అతడనుకుంటాడు. "మునులమూ, సర్వసంగ పరిత్యాగులమూ అయిన మాకే ఇంత మనోవేదన కలుగుతుంటే ఇక కన్నవారి మనోవేదన ఎలా ఉంటుందో?"

ఈ విధంగా సమాజంలోని విషయాలని అడుగడునా ప్రతి అంకంలోనూ ప్రదర్శిస్తాడు కవి. ఈ నాటకం ఏడు అంకాల్లో సాగుతుంది.
In Public domain. Digitization Muthulakshmi Research Academy

మాళవికాగ్నిమిత్రం :- చారిత్రకాంశాన్ని ఇంచుక స్పృశించే నాటకం ఇది. ఐదు అంకాల ఈ నాటకంలో శుంగవంశస్థాపకుడైన పుష్యమిత్రుని కుమారుడు అగ్నిమిత్రుడు నాయకుడు. ఈ రాజు క్రీ.పూ. 150 ప్రాంతానికి చెందినవాడవటం చేత బహుశా కాళిదాసు ఇతని సమకాలికుడై ఉంటాడనే అభిప్రాయం కొందరు విద్వాంసులు వెలిబుచ్చారు. ధీరోదాత్తనాయకుడు **అగ్నిమిత్రుడు**. నాయిక **మాళవిక** అపురూప సౌందర్యవతి. నాట్యకళా ప్రవీణ. ఈ నాటకం కాళిదాసకవి నాట్యశాస్త్ర వైదుష్యానికి అద్దం పడుతుంది. నాట్యాన్ని గూర్చిన విషయాలు ఈ నాటకంలో ప్రస్తావించబడినాయి. ఐదు అంకాలలో కథ అందంగా పొదగబడినది.

విక్రమోర్వశీయం :- ఇది ఉపరూపకమైన త్రోటకం అనే భేదానికి చెందుతుంది. దివికీ భువికీ వంతెన వేసే ఊర్వశీ పురూరవుల ప్రణయగాథ ఇందులోని ఇతివృత్తం. ఇందులో ఐదు అంకాలున్నాయి. ఇందులో సంగీతానికి సంబంధించిన అంశాలు లభిస్తాయి.

మేఘసన్దేశమ్

కాళిదాస విరచిత **మేఘసందేశమ్** సహృదయుల్ని ఆకాశవీధిలోకి తీసుకు వెళు తుంది. ఈ కావ్యాన్ని గూర్చి చెప్పాలంటే భావాలు చెలరేగుతాయే కాని భాష అందదు. ఒక్కొక్క శ్లోకమూ ఒక అమూల్యరత్నం. భారతీయ వాఙ్మయానికి సంబంధించినంత వరకు ప్రతి కవికీ ప్రేరణ వాల్మీకి, వ్యాసులన్నది నిర్వివాదాంశం. ఆదికవి **రామాయణంలో** ఒక వానరుణ్ణి దూతగా పంపించాడు. ఆ దూత ఆకాశవీధిలో ప్రయాణిస్తుంటే కవి ఒక విమానదృశ్యంలా తన వర్ణన కొనసాగించాడు. **హనుమంతుడు** ప్రయాణించినదంతా సముద్రంపైనే. ఆ దృశ్యాన్ని అతిమనోహరంగా కనులముందు నిలిపిన కవికోకిల కవికులగురువుకు స్ఫూర్తిప్రదాత ఐనాడు. ఆ ప్రేరణతోనే 'ఆకాశవీధిలో అందాల మేఘం' ప్రణయసందేశాన్ని తీసుకుని పయనించింది. కవియొక్క ప్రకృతి పరిశీలనకుచక్కని ఉదాహరణ ఈ కావ్యం. రెండు సర్గలలో కొనసాగిన ఖండకావ్యం ఇది. అయితే దీని మహత్త్వాన్ని గ్రహించిన **మల్లినాథుడు** మహాకావ్యాలతో పాటు దీనికీ వ్యాఖ్యానం వ్రాయటంతో యీ ఖండకావ్యం అఖండయశస్సుతో మహాకావ్య ప్రపంచంలోకి

In Public domain. Digitization Muthulakshmi Research Academy
చేరిపోయింది. ఇందులో మొదటి సర్గ 'పూర్వమేఘం' అనీ రెండవ సర్గ "ఉత్తరమేఘం" అనీ వ్యవహరించబడుతుంది. కవి ఎన్నుకున్న ఇతివృత్తం, ఛందస్సు సహృదయుల హృదయాలని పరవశింపజేసాయి.

మేఘసందేశంలోని కథ :– కర్తవ్యమును మరచిన ఒక యక్షుడు తనస్వామి ఐన కుబేరుని శాపానికి గురియై ఒక సంవత్సర కాలంపాటు తన భార్యకు దూరంగా 'దివి'ని వదిలి 'భువి' కి ఏతెంచి **రామగిరి** (ప్రస్తుత **రామ్‌టేక్**) ప్రాంతాల్లో గడపాల్సివస్తుంది. ఎనిమిది నెలలూ ఎలాగో భార్యావిరహాన్ని భరించిన ఆ యక్షుడు 'ఆషాఢమాసం యొక్క మొదటి రోజున అవతరించిన వర్షపుమేఘాన్ని (జలద = జలాన్నిచ్చేది) చూచి ఇక విరహాగ్నిని సహించలేకపోయాడు. అంతే కాదు ఈ సమయంలో అసలే సుకుమారి ఐన తన ప్రియతమ అర్ధాంగి ఈ విరహవేదనను ఎలా భరించగలదో అని వేదన చెందాడు. అలా దుఃఖతప్తుడైన అతనికి ఒక మేఘం కన్పించింది. తన క్షేమాన్ని గూర్చీ, త్వరలో కలుగబోయే శాపవిముక్తిని గూర్చీ ప్రేయసికి ఆ మేఘంతో వర్తమానం పంపాలని నిశ్చయించుకున్నాడు. "అయితే మేఘం ఏమిటి? సందేశాన్ని తీసుకువెళ్లటం ఏమిటి?" అని విన్నవారు నవ్వకోరా? అందుచేత కవి తన రచననూ, యక్షుని చర్యనూ సమర్థించటానికి **"కామార్తా హి ప్రకృతికృపణాశ్చేతనా చేతనేషు"** అంటాడు. కామార్తులకు తమ మనోవేదనే తప్ప బాహ్యావిషయములందు స్పృహ ఉండదు. మేఘం జడం – అది సందేశాన్ని తీసుకువెళ్లగలదా అన్న ఆలోచన యక్షునికి లేదు.

ఈ విధంగా మేఘంతో సందేశం పంపుతాడు యక్షుడు. తాను ఉన్నది భూలోకం ప్రేయసి ఉన్నది 'అలకాపురి'. మరి మేఘానికి వెళ్లాల్సిన మార్గాన్ని వివరించాలి కదా! ఇక ప్రారంభమైంది భరతఖండంలోని వివిధ భాగాల వర్ణన. సుఖంగా ఉండే మార్గాన్ని నిర్దేశించాడు. ఇదంతా పూర్వమేఘంలో వర్ణించబడింది.

ఇక ఉత్తరమేఘంలో అలకాపురి వర్ణనం, ఆ పురంలో ఉన్న యక్షుని నివాసభవన వర్ణనం చోటు చేసుకున్నాయి. అక్కడ ఆ యక్షిణి విరహవేదనతో రోజులు ఎలా వెళ్లబుచ్చుతుందో యక్షుడు ఊహించి చెబుతాడు. విప్రలంభశృంగార రసం చిప్పిలుతుంది ఈ ఘట్టంలో.

యక్షుడు తనమాటలుగా తన భార్యతో ఇలా చెప్పమంటాడు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

"అఙ్గేనాఙ్గం ప్రతను తనునా గాఢ తప్తేన తప్తం
సాస్రేనాశ్రుద్రుతమ విరలోత్కంఠముత్కంఠితేన,
ఉష్ణోచ్ఛ్వాసం సమధికతరోచ్ఛ్వాసినా దూరవర్తీ
సంకల్పై స్తైర్విశతి విధినా వైరిణా రుద్ధమార్గః."

"ఓ కృశాంగీ ! ప్రతికూలమైన దైవంచేత నేను నిన్ను చేరలేకున్నాను. నా మార్గం అడ్డగించబడింది. అందుచేత దూరంగా ఉన్న నిన్ను నా మనస్సంకల్పంచేతనే (మనస్సుచేతనే) నిన్ను చేరుతున్నాను. విరహవేదనతో తపించిపోయిన నా మేనితో అదేవిధంగా తప్తమై ఉన్న నీ మేనును, కనులలో అశ్రువులతో నేను, కన్నీటితో నిండిన నిన్ను విరహౌత్కంఠుడనైన నేను, విరహౌత్కంఠితవైన నిన్ను, గాఢంగా నిట్టూర్చే నేను, దీర్ఘంగా నిట్టూర్చే నిన్ను నా మనోవీధిలోనే చేరుతున్నాను."

ఇరువురి అవస్థ ఒకేలాగ ఉంది. పరస్పర అనురక్తులయిన వారి పరిస్థితి అది. అంతేగాదు విధి వక్రిస్తే ఏం చేసినా ప్రయోజనం ఉండదు. యక్షుడంటాడు, "కలలోనైనా నిన్ను చూడాలనుకుంటే నిదురలేని నాకు కల ఎక్కడిది?" అని. అన్నింటికన్నా అందమైన భావం కవి కలం నుండి వెలువడింది. ఒక శ్లోకంలో యక్షుడు ప్రేయసి చిత్రాన్ని చిత్రించి అందులో తనను కూడా చిత్రించుకోవాలనుకుంటాడు. అయితే ప్రేయసిని చిత్రించాక అతని కళ్లు నీళ్లతో నిండుకున్నాయి. "విధి చివరికి చిత్రంలో కూడా మనసమాగమాన్ని సహించలేకున్నాడు" అంటాడు.

"త్వామాలిఖ్య ప్రణయకుపితాం ధాతురాగై శ్శిలాయా
మాత్మానంతే చరణ పతితం యావదిచ్ఛామి కర్తుం,
అస్రైస్తావ న్ముహురుపచితై ర్దృష్టి రాలుప్యతే మే
క్రూరస్తస్మిన్నపి న సహతే సఙ్గమం నౌ కృతాంతః".

"ధాతురాగం (గైరికధాతు పొడి) తో ఒక శిలపైన ప్రణయకోపంతో ఉన్న నిన్ను చిత్రించి, నేను నీ పాదాలపై పడినట్లుగా (బతిమాలు కోవటం) చిత్రించాలనుకున్నాను. నీ చిత్రం పూర్తయిందో లేదో కళ్లలో నీళ్లు పొంగి పొరలాయి. ఎంత తుడుచుకున్నా మాటిమాటికీ అవి నిండుకురావటంలో నా దృష్టికేమి కన్పించకుండా పోయి, చిత్రరచన సాగలేదు. చివరికి చిత్రరూపంలోనైనా మనం కలుసుకోవటం ఆ విధాత సహించ లేకున్నాడు."

In Public domain. Digitization: Muthulakshmi Research Academy

ఇలా [illegible] మేఘసందేశం. ఈ కావ్యానికి "పవనతనయ సందేశం" ప్రేరణ అని కావ్యంలోని ఒక శ్లోకం తెలియజేస్తుంది. యక్షుడంటాడు, "నీవు వెళ్లి నా మిత్రునిగా పరిచయం చేసుకొని, సందేశం వినిపింప బోగా పవనతనయుని కేసి మైథిలి ఉత్కంఠతో చూచినట్లు నా పత్ని నీ నుండి వచ్చే సందేశానికై వేచి చూస్తుంది. నీ పట్ల ఆదరంతో వ్యవహరిస్తుంది."

"ఇత్యాఖ్యాతే పవనతనయం మైథిలీవోన్ముఖీ సా
త్వా ముత్కంఠోచ్ఛ్వసిత హృదయా వీక్ష్య సంభావ్యచైవ".

రసం :– మేఘసందేశ మొక ఖండకావ్యం. "ఖండకావ్యం భవేత్కా వ్యస్యైక దేశాను సారి చేత్" అని ఖండకావ్యలక్షణమ్. ఏదో ఒక అంశాన్ని తీసుకొని వర్ణిస్తే అది 'ఖండకావ్యం' అనబడుతుంది. అయితే రసపోషణ విషయంలో ఈ కావ్య వైశిష్ట్యాన్ని బట్టీ, వ్యాఖ్యాతృసార్వభౌముడు ఈ కావ్యానికి కూడా వ్యాఖ్యానం 'సంజీవిని'ని కూర్చడం బట్టీ మహాకావ్యాల కోవలో చేర్చబడిందీ కావ్యం. "కావ్యంలో రసాలు ఎన్నో పోషించబడినప్పటికీ ఒకేరసం అంగీరసం (ప్రధానరసం) గానూ, మిగిలినవి అంగరసాలు గానూ కూర్చాలి" అని ధ్వనికారుడు ఆనందవర్ధనుడు వివరించాడు.

ప్రసిద్ధేఽపి ప్రబంధానాం నానారసనిబంధనే,
ఏకో రసోఽంగీకర్తవ్య స్తేషాముత్కర్షమిచ్ఛతా.

(ధ్వన్యాలోకం–3–21)

ఒకేరసం ప్రధానంగా ఉండటం వల్ల కావ్యానికి శోభాతిశయం చేకూరుతుంది. దృశ్యకావ్య ప్రక్రియలో ఉత్తమమైన నాటకంలోనూ, శ్రవ్య కావ్య ప్రక్రియలోని మహా కావ్యంలోనూ వీరరసం గానీ శృంగార రసం గానీ ప్రధాన రసంగా ఉండాలని భరత ముని అభిప్రాయం.

కాళిదాస కవి రచనల్లో ఇది కనిపిస్తుంది. ఐతే కాళిదాస కవి ఈ లక్షణ గ్రంథాలు (ఆలంకారిక గ్రంథాలు) చదివి కావ్యాలు వ్రాయలేదు. ఆలంకారికులే ఆతని కావ్యాలు చదివి "కావ్యలక్షణాలను" నిర్ణయించారు. ధ్వనిసిద్ధాంత ప్రతిపాదనతో ఆలంకారశాస్త్ర ప్రపంచంలో సహృదయ చక్రవర్తిగా సహృదయుల హృదయాల్లో నిలచిన ఆనందవర్ధనుడు "కాళిదాస మహాకవి కావ్యాలను" తరచుగా ఉదాహరిస్తుంటాడు. ఈ విధంగా

అందరిమన్ననలకూ పాత్రమైన విప్రలంభశృంగార పోషణకు ఉదాహరణ 'మేఘసందేశమ్'.
In Public domain. Digitization Muthulakshmi Research Academy

'విప్రలంభశృంగారం' శృంగారరసానికి పరిపుష్టిని కలుగజేస్తుంది.

న వినా విప్రలంభేన సంభోగః పుష్టిమశ్నుతే
కషాయితే హి వస్త్రాదౌ భూయాన్రాగోవివర్ధతే.

"విప్రలంభం (వియోగం) లేకుండా సమాగమానికి పుష్టిచేకూరదు. రంగు కొంచెం అలదిన తర్వాతే వస్త్రంపైన మళ్లీ అద్దబడిన రంగు చక్కగా నిలుస్తుంది."

కరుణ, విప్రలంభ శృంగార రసాలు రెండూ అత్యంత సుకుమారమైనవి. అందుచేత "మాధుర్యం", "ప్రసాదం" అనే రెండుగుణాలు వీటిలో ఉంటాయి. నాయికానాయకులు ఒకచోట ఉన్నపుడు వారి శృంగారభావాల్ని కవి వర్ణిస్తాడు. అదే వారు వియోగంలో ఉన్న సమయంలో ఆ నాయికానాయకులు తమ మధురానుభూతులను నెమరు వేసుకుంటారు. అవి ప్రత్యక్షానుభూతులవటం చేత రసోత్కర్షత్వం ఉంటుంది. ఈ సందర్భంలో కవి తన వర్ణనా చాతుర్యంతో రసానికి పుష్టి చేకూర్చగలడు. అందుచేతనే కవి అంటే సామాన్యుడు కాడు. ఈ కావ్య ప్రపంచంలో అతడే ప్రజాపతి. ఈ ప్రపంచంలో పాత్రలు అతని ఇచ్ఛానుసారం నర్తిస్తాయి అంటాడు ఆనందవర్ధనుడు.

"అపారే కావ్య సంసారే కవిరేకః ప్రజాపతిః,
యథాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే." (ధ్వన్యాలోకం-3)

అంతేకాదు కవి రసహృదయుడైతే అతడు సృష్టించిన కావ్య జగత్తూ రసమయం.

"శృంగారీ చేత్కవిః కావ్యేజాతం రసమయం జగత్,
స ఏవ వీతరాగశ్చేత్ నీరసం సర్వమేవ తత్".

రసహృదయుడైన కవికుల గురువు యొక్క మానససృష్టి మేఘసందేశం. 'రవిగాంచనిచో కవి కాంచునే కదా' అన్నట్లు యక్షుడు, యక్షిణి రహస్య శృంగారమయ జీవనం కవి చూశాడు.

విడిపోయిన ఆ ప్రేమైకమూర్తుల వియోగవేదనను అర్థం చేసికొన్నాడు. అనురాగ మూర్తుల దాంపత్యం ఎలా ఉంటుందో తన వర్ణన ద్వారా చూపించాడు.

In Public domain: Digitization Muthulakshmi Research Academy

ప్రకృతి చిత్రణ : ప్రకృతి చిత్రణ విషయంలో కాళిదాసు అతనికి అతడే సాటి. ప్రకృతి వర్ణనం వేరు. ప్రకృతినే పాత్రలుగా చిత్రించటం వేరు. ఇది కాళిదాసు రచనల్లో అడుగడుగునా కన్పిస్తుంది. శకుంతలను అత్తవారింటికి పంపే సందర్భంలో వృక్షాలు వస్త్రాల్నీ ఆభరణాల్నీ ఇస్తాయి. 'శాకుంతలం'లో లతలు పండుటాకుల రూపంలో కన్నీళ్లు కారుస్తాయి. వనదేవతకు ప్రతినిధిగా కోయిలమ్మ శకుంతలకు వీడ్కోలు ఇస్తుంది.

ఇలా ప్రతికావ్యంలోనూ ప్రకృతిలో చైతన్యాన్ని నింపాడు కవివర్యుడు కాళిదాసు.

ఛందస్సు :- "మేఘసందేశం" అంతా మందాక్రాంత వృత్తంలోనే రచించబడింది. ఇక్కడ మేఘుడు జలదుడు. వర్షపు నీటిని నింపుకున్నవాడు. అందుచేత త్వరితంగా నడవలేడు. మందమందంగా సాగుతుంది అతని గమనం. అదీగాక యక్షుడు వియోగార్తుడు. ఆవేదనతో ఉన్నవారి హృదయం బరువుగా ఉంటుంది. మాటలు గొంతు పెగల్చుకొని రావటానికి ఎంతో ప్రయాసపడాల్సివస్తుంది. అందుచేత రసహృదయుడైన కాళిదాసు 'మందాక్రాంత' ను ఎన్నుకున్నాడు. పద్యకావ్యాల్లో ఛందస్సులో సంగీతం ఉంటుంది. ఆయా భావాల వ్యక్తీకరణకు అనుకూలమైనవిగా ఉంటాయి వివిధ ఛందస్సులు.

మందాక్రాంతలో పదిహేడు అక్షరాలుంటాయి. మగణ, భగణ, నగణ, తగణ ద్వయం, గురు ద్వయం ఉంటాయి.

"మందాక్రాంతా జలధి షడగైర్ మ్భౌ నతౌ తాద్ గురూ చేత్".

జలధి	- నాల్గు సముద్రాలు	4 సంఖ్యను సూచిస్తుంది.
షట్	- ఆరు సంఖ్య	6 సంఖ్య సూచిస్తుంది.
అగైః	- ఏడు పర్వతాలు	7 సంఖ్య సూచిస్తుంది.

అలంకారాలు :- కవి కులగురువు యొక్క అలంకార వైచిత్రిని గూర్చి చెప్పనవసరం లేదు. ఉపమా, రూపక, అర్థాంతర న్యాసాదులు ఎన్నో ప్రయోగించాడు. 'ఉత్ప్రేక్ష' ను గూర్చి ఇక చెప్పేందుకు ఏమీ లేదు. ఇవన్నీ పూర్వమేఘపు కథా వర్ణనలో చోటు చేసుకుంటాయి.

ఇక మేఘసందేశంలో మేఘునికే నాయకత్వాన్ని ఆపాదించాడు. నదులు నాయికలు. ఆకాశవీధిలో తేలియాడుతూ సాగిపోయే మేఘం. దానికేసి ఆసక్తిగా చూచే మానవ కాంతలు, నదీకాంతలు. భువినుండి దివికి సోపానపంక్తి మేఘుని ప్రయాణమార్గం. ఈ విధంగా 'మేఘసందేశం' ఒక 'మధురచిత్రం' గా సహృదయుల్ని అలరించింది.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మేఘసన్దేశమ్ (పూర్వ మేఘః)

యక్షుడు మేఘాన్ని చూడటం, సందేశానికై ప్రార్థించటం

కశ్చిత్ కాంతా విరహగురుణా స్వాధికారాత్ ప్రమత్తః
శాపేనాస్తం గమితమహిమా వర్షభోగ్యేణ భర్తుః
యక్షశ్చక్రే జనకతనయా స్నాన పుణ్యోదకేషు
స్నిగ్ధచ్ఛాయా తరుషు వసతిం రామగిర్యాశ్రమేషు. 1

ప్ర.అ.:- స్వాధికారాత్ = తాను చేయవలసిన పని నుండి, ప్రమత్తః = నిర్లక్ష్యముగా నున్న వాడు, కాంతా విరహగురుణా = ప్రియురాలి విరహాధిక్యం చేత, వర్షభోగ్యేణ = ఒక ఏడాది పాటు అనుభవించవలసి ఉన్నదానిచేత, భర్తుః = స్వామి యొక్క, శాపేన = శాపం చేత, అస్తంగమిత మహిమా = మహిమను గోల్పోయినవాడై, కశ్చిత్ యక్షః = ఒకానొక యక్షుడు, జనకతనయాః = సీతాదేవి యొక్క, స్నానపుణ్యోదకేషు = స్నానం చేత పునీతమైన జలాలుగల, స్నిగ్ధచ్ఛాయాతరుషు = చిక్కని చల్లని నీడను ఇచ్చే చెట్లు గల, రామగిరి ఆశ్రమేషు = రామగిరి ప్రాంతంలోని ఆశ్రమాల్లో, వసతిం చక్రే = నివసించాడు.

తా:- ఒకానొక యక్షుడు తన కర్తవ్యాన్ని అలక్ష్యం చేయటం వలన తన ప్రభువు యొక్క శాపానికి గురైనాడు. ఆ శాపాన్ననుసరించి అతడు ఒక ఏడాది పాటు తన ప్రియమైన అర్థాంగికి దూరంగా గడపాల్సి ఉంది. శాపకారణంగా తన దివ్యత్వాన్ని కోల్పోయిన ఆ యక్షుడు శాపావధి ముగిసే వరకూ జనకతనయ స్నానం చేత పవిత్రతను సంతరించుక్ను జలాశయాలు కల్గినదీ, చిక్కని చక్కని నీడనిచ్చే తరు సముదాయంతో కూడుకొనినవీ అయిన 'రామగిరి' ఆశ్రమప్రాంతాల్లో తన నివాసం ఏర్పాటు చేసుకున్నాడు (అక్కడ నివసించసాగాడు).

వి :- సంస్కృతకావ్యాల ఆరంభంలో ఆశీః, నమస్క్రియ, వస్తునిర్దేశం - ఈ మూడింటిలో ఏదైనా ఒకటి ఉండాలి. ఈ నియమాన్ననుసరించి కాళిదాస కవి యీ ఖండకావ్యాన్ని వస్తునిర్దేశంతో ఆరంభించాడు.

In Public Domain. Digitization: Muthulakshmi Research Academy

“ఆశీర్నమస్క్రియా వస్తునిర్దేశో ఽపి వా తన్ముఖమ్”. ఆశీః అనగా శుభాకాంక్ష.

‘ప్రమత్తః’ అనగా జాగరూకత లేనివాడు. ‘ప్రమాదోఽనవధానతా’ అని అమరము. ‘అవధానం’ లేకపోవటం ప్రమాదం. ఆంధ్రభాషలో యీ ‘ప్రమాదం’ దుర్ఘటనకు పర్యాయంగా వాడుతారు. ప్రమాదం వల్ల జరిగేది దుర్ఘటనే కాబట్టి బహుశా ఆవిధంగా వ్యవహారంలోకి వచ్చి ఉంటుంది.

యక్షుని అవధానం చెదరటానికి కారణమేమిటో కాళిదాసు చెప్పలేదు. అయితే పద్మపురాణంలో ఇలాంటి కథే ఉంది. ఆ కథ ఇలా ఉంది – “యక్షుడు కుబేరుని అనుచరుడు. ప్రతిరోజూ కుబేరుని శివపూజకై పూలు తెచ్చి ఇవ్వటం యక్షుని వంతు. ఒకనాడు తన ప్రియురాలి సన్నిధిని వీడలేక ఆ యక్షుడు కొంచెం ఆలస్యంగా వచ్చాడు. కర్తవ్యాన్ని నిర్లక్ష్యం చేసిన అతణ్ణి చూచి కుబేరునకు కోపం వచ్చింది. ఏ ప్రియురాలి వ్యామోహం అతణ్ణి కర్తవ్యదూరుణ్ణి చేసిందో ఆ ప్రియురాలి నుండి ఎడబాటే అతనికి తగిన శిక్ష అని భావించిన కుబేరుడు ఆ యక్షుడు ఒక ఏడాది పాటు తన ప్రియురాలికి దూరమై భూలోకంలో ఉండాలని శపించాడు. శాపకారణంగా యక్షునికున్న దివ్యత్వం తొలగిపోయి భూలోకంలో రామగిరి ప్రాంతంలోని ఆశ్రమాలని ఆశ్రయించి నివసించ సాగాడు.

యక్షుడు అనగా దేవయోని. దేవతలలో ఒక జాతి. కవి ఈ శ్లోకంలో ‘భార్య’ అనే పదం వాడకుండా ఉద్దేశ్యపూర్వకంగా ‘కాంత’ అనే పదం వాడాడు. ‘కము’ ధాతువునుండి ఏర్పడిన ఈ పదానికి అర్థం ‘ప్రేయసి, అత్యంత ప్రియతమ’ అని అర్థం.

ఇక్కడ అలంకారం ‘పరికరాంకురం’ అని వ్యాఖ్యాతలు చెప్పారు. ‘ఛాయా తరువులు’ అనగా చిక్కని నీడనిచ్చే ‘నమేరు’ వృక్షాలు.

తస్మిన్నద్రౌ కతిచిదబలా విప్రయుక్త స్స కామీ
నీత్వా మాసాన్కనక వలయ భ్రంశరిక్త ప్రకోష్ఠః;
ఆషాఢస్య ప్రథమ దివసే మేఘమాశ్లిష్టసానుం
వప్ర క్రీడా పరిణత గజ ప్రేక్షణీయం దదర్శ. **2**

ప్ర.అ. – అబలా విప్రయుక్తః = సతిని ఎడబాసిన అతడు, కనకవలయభ్రంశ = చేతినుండి స్వర్ణకంకణము (వదులై) జారిపోగా, రిక్త ప్రకోష్ఠః = శూన్యమైన ముంజేయి కలిగి, సః కామి = ఆ కామార్తుడు, తస్మిన్ అద్రౌ = ఆ పర్వతము పైన, కతిచిత్ మాసాన్

= కొన్ని నెలలను, నీత్వా = గడిపి, ఆషాఢస్య ప్రథమ దివసే = ఆషాఢమాసం యొక్క
In Public domain. Digitization Muthulakshmi Research Academy
ప్రథమ దినమునందు, ఆశ్లిష్టసానుమ్ = కొండచరియను కౌగిలించుకొని ఉన్న, కొండచరియ పై నున్న, వప్రక్రీడా = వప్రము (కోట యొక్క అడుగున మట్టితో నిర్మించబడిన భాగము) తో ఆడుకునే, పరిణతగజ = ఏనుగువలె ఉన్న, ప్రేక్షణీయం = చూడముచ్చటైన దానిని, మేఘం = మేఘమును, దదర్శ = చూచాడు.

తా:- ప్రేయసిని ఎడబాసిన ఆ ప్రేమికుడు (కామి) కొన్ని మాసములు ఆ రామగిరి పర్వతం పైన గడిపాడు. విరహవేదనతో చిక్కిపోయిన ఆతని ముంజేతి నుండి కంకణము జారిపోయినది. అది కూడా గ్రహించలేని మానసిక స్థితి ఆ యక్షునిది. అలా రోజులు గడుపుతున్న ఆ యక్షునికి ఆషాఢమాసం మొదటి రోజు ఒక మనోహర దృశ్యం కంటపడింది. అక్కడ కొండచరియపైన ఒక మేఘం ఉంది. ఆ మేఘం ఎలా ఉందంటే వప్రక్రీడలో ఉన్న ఏనుగులాగా చూడముచ్చటగా ఉంది.

వి :- 'ఆషాఢస్య ప్రథమ దివసే' అన్నచోట 'ప్రథమ' స్థానంలో 'ప్రశమ' అనే పాఠాంతరం ఉంది. 'ప్రథమ' అనగా మొదటి, 'ప్రశమ' అనగా 'అంతిమ' అనే అర్థం. ఈ పాఠభేదాలను గూర్చి వివరంగా చర్చించిన వ్యాఖ్యాతృసార్వభౌముడు మల్లినాథుడు. 'ప్రథమ దివసే" అనే పాఠమే సరిఐనది అని వ్యాఖ్యానించాడు. అతని వ్యాఖ్యాన్ననుసరించి ఇక్కడ అదే పాఠం గ్రహించబడింది. 'వప్రక్రీడ' అనగా ఏనుగు తనదంతాలతో మట్టిని, రాళ్లను పైకి చిమ్ముతూ ఆడుకోవటం. పర్వత సానువు మీద ఉన్న మేఘం అలా ఉందని కవి భావచిత్రణ. 'గజప్రేక్షణీయమ్' అనుచోట 'ఇవ' అనే వాచకశబ్దం లోపించటం వలన ఇక్కడ 'లుప్తోపమ' అలంకారం.

అలా మేఘాన్ని చూస్తూ ఉండిపోయాడు యక్షుడు.

"తస్య స్థిత్వా కథమపి పురః కౌతుకాధానహేతో
రంతర్బాష్పశ్చిరమనుచరో రాజరాజస్య దధ్యౌ,
మేఘాలోకే భవతి సుఖినోఽప్యన్యథావృత్తి చేతః
కంఠాశ్లేష ప్రణయిని జనే కిం పునర్దూర సంస్థే. **3**

ప్ర.అ. – రాజరాజస్య = కుబేరుని యొక్క, అనుచరః = సేవకుడు, అంతర్బాష్పః = కన్నీళ్ళు లోలోన దాచుకొనినవాడు, కౌతుకాధానహేతోః = ఉత్కంఠ కలగడానికి కారణమైన, తస్య పురః = దాని ముందు, కథమపి = ఎలాగో, దధ్యౌ = ఆలోచించాడు,

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మేఘాలోకే = మేఘాన్ని చూసినపుడు, సుఖినః అపి = సుఖంగా ఉన్నవ్యక్తికి కూడా, చేతః = మనసు, అన్యథా వృత్తి భవతి = మరొకవిధంగా (ఎలాగో) మారిపోతుంది, కంఠాశ్లేష ప్రణయిని జనే = ఆలింగనం చేసుకోవాలనుకునే ప్రియమైన వ్యక్తి, దూరసంస్థే = దూరంగా ఉన్నపుడు, కిం పునః = ఏమని చెప్పాలి?

తా:– తన కన్నీళ్లను లోపలే దాచుకొని కుబేరుని అనుచరుడైన ఆ యక్షుడు ఉత్కంఠను కలిగించే ఆ మేఘాన్ని తదేకంగా చూస్తూ ఆలోచిస్తూ అలా ఉండిపోయాడు. మేఘాన్ని చూసినంతనే సుఖంగా ఉన్న వ్యక్తి మనను కూడా ఏదో ఆరాటానికి లోనవుతుంది. అలాంటిది కౌగిలిలో బంధించాల్సిన ప్రణయిని గానీ, ప్రియుడు గానీ ఎక్కడో దూరంగా ఉంటే ఇక వారి పరిస్థితిని ఏమని చెప్పాలి.

వి :– అందంగా కదలాడే మేఘాలు అదీ వర్షాకాలం సమీపిస్తున్న సమయంలో సమస్త ప్రకృతినీ పరవశింప జేస్తాయి. మానవులను గూర్చి చెప్పనవసరం లేదు. ఎక్కడెక్కడికో తమ తమ పనుల మీద వెళ్లిన వాళ్లు కూడా ఆ సమయానికి తమ ఇల్లు చేరుకుంటారు. విశేషించి ప్రవాసంలో ఉన్నవారు వర్షాకాలం వచ్చే సరికి తమ ప్రియతమలను చేరాలని ఎలా తహతహలాడతారో కావ్యాల్లో వర్ణించబడింది. అలాంటి పరిస్థితే ఇక్కడ యక్షునకు ఎదురైంది. శాపం ముగిసే వరకు తాను వెళ్లలేడు. తన సంగతి అటుంచి అక్కడ తన ప్రియతమ పరిస్థితి ఏమిటో? అసలే సుకుమారి ఐన ఆమె ఈ వియోగదుఃఖాన్ని భరించగల్గుతుందో లేదో ? ఇలా ఏ భావాలు యక్షుని మనసులో మెదిలాయో గానీ అతని అంతరంగం దుఃఖమయమైంది.

'రాజరాజు' అనగా కుబేరుడు. 'రాజరాజో ధనాధిపః' అని అమరము.

ఇక్కడ 'అర్థాంతర న్యాసాలంకారము'.

అటుపైని యక్షుడు ఏం చేసాడో చెపుతున్నాడు.

ప్రత్యాసన్నే నభసి దయితా జీవితాలంబనార్థీ
జీమూతేన స్వకుశలమయీం హారయిష్యన్ ప్రవృత్తిమ్,
స ప్రత్యగ్రైః కుటజకుసుమైః కల్పితార్ఘాయ తస్మై
ప్రీతః ప్రీతిప్రముఖ వచనం స్వాగతం వ్యాజహార. 4

ప్ర.అ.– సః (యక్షః) = ఆ యక్షుడు, నభసి = శ్రావణమాసము, ప్రత్యాసన్నే = సమీపించుచుండగా, దయితా జీవితఆలంబనార్థీ = ప్రియురాలి జీవితం నిలవటానికి

ఆధారాన్ని కోరేవాడు, జీమూతేన = మేఘం ద్వారా, స్వకుశలమయీమ్ = తన క్షేమాన్ని
In Public domain. Digitization Muthulakshmi Research Academy
తెలిపే, ప్రవృత్తిమ్ = సమాచారాన్ని, హారయిష్యన్ = పంపగోరినవాడై, ప్రత్యగ్రైః = నవనవలాడే, కుటజకుసుమైః = అడవి మల్లెలతో, కల్పితార్ఘ్యాయ = అర్ఘ్యము ఏర్పాటు చేయబడిన, తస్మై = ఆ మేఘమునకు, ప్రీతః = ఆనందంతో (సంతోషంగా), ప్రీతి ప్రముఖవచనం = ప్రేమపూర్వకమైన మాటలతో, స్వాగతం = స్వాగతాన్ని, వ్యాజహార = పలికాడు.

తా:– మేఘాన్ని చూడగానే యక్షునకు అర్థమైంది శ్రావణమాసం సమీపిస్తుందని, తనకు దూరమైన ప్రేయసి ప్రాణాలు నిలపాలని, తన కోసం తపించే ప్రియతమకు తన క్షేమసమాచారాన్ని అందజేయాలనుకున్నాడు. ఎదురుగా మేఘుడు కన్పించాడు. ఆ మేఘం ద్వారానే తన ప్రాణప్రియకు సందేశాన్ని పంపాలనుకున్నాడు. అందుచేత అప్పుడే వికసించిన అడవిమల్లెలను అర్ఘ్యంగా చేతబూని ఆనందంగా ప్రియమైన వాక్కులతో ఆ మేఘునకు స్వాగతం పలికాడు.

వి :– విశిష్ట వ్యక్తులు వచ్చినప్పుడు సాదరంగా స్వాగతం చెపుతారు. దేవతలను ఆహ్వానించినప్పుడు అర్ఘ్య పాద్యాదులు ఇవ్వటం తెలిసిన విషయమే. అలా మేఘునికి పుష్పాంజలితో స్వాగతం పలికాడు యక్షుడు.

మేఘం ఏమిటి? సందేశం కొని పోవటం ఏమిటి? అది ప్రాణం ఉన్న పావురమూ కాదు. 'కాకితో కబురంపటం' లాంటిదీ కాదు. ఈ రకమైన సందేహాలు చదువరులకు రావచ్చు. అయితే కవి సావధానచిత్తుడే. తాను ఏం చెప్పాలో స్పష్టంగా తెలిసినవాడే. అందుచేత మేఘంతో కబురంపటానికి గల కారణాన్ని ఈ క్రింది శ్లోకంలో వివరిస్తున్నాడు.

ధూమ జ్యోతిః సలిల మరుతాం సన్నిపాతః క్వ మేఘః
సందేశార్థాః క్వ పటుకరణైః ప్రాణిభిః ప్రాపణీయాః,
ఇత్యౌత్సుక్యాదపరిగణయన్గుహ్యకస్తం యయాచే
కామార్తా హి ప్రకృతికృపణాశ్చేతనాచేతనేషు. **5**

ప్ర.అ.– ధూమ జ్యోతిః సలిల మరుతాం = ధూమము (పొగ), తేజస్సు, జలము, వాయువు, వీటి యొక్క, సన్నిపాతః = కలయిక, మిశ్రమము, మేఘః = మేఘము, క్వ = ఎక్కడ?, పటుకరణైః = సమర్థములైన (ఎట్టివైకల్యములేని) ఇంద్రియములతో కూడిన, ప్రాణిభిః = చైతన్యవంతములైన ప్రాణుల చేత, ప్రాపణీయాః = పంపించదగిన, చేర్చదగిన,

In Public domain. Digitization: Muthulakshmi Research Academy

సందేశార్థాః = సందేశములు, క్వ = ఎక్కడ?, ఇతి = అని, ఔత్సుక్యాత్ = ఉత్సుకత, ఉద్వేగం వలన, అపరిగణయన్ = ఆలోచించకుండా, గుహ్యకః = యక్షుడు, తం = ఆ మేఘుని, యయాచే = అర్థించాడు, హి = ఎందుచేతననగా, కామార్తాః = కామార్తులు, ప్రియా సంగమాభిలాషులు, చేతనాచేతనేషు = సచేతన, అచేతనాల విషయంలో (వాటి భేదం తెలుసుకోలేక), ప్రకృతికృపణాః = సహజంగానే దీనులు, ఏమీతోచని వారు.

తా:- ధూమము, ప్రకాశము, జలము, వాయువు సమ్మేళనరూపమైన మేఘం ఎక్కడ? సమర్థమైన ఇంద్రియములు కలిగిన ప్రాణుల చేత పంపించదగిన సందేశాలు ఎక్కడ? ఈ విషయాన్ని విరహోత్కంఠతతో ఉన్న యక్షుడు గమనించలేకపోయాడు. అందుచేత ఆ మేఘాన్నే సందేశాన్ని తీసుకువెళ్లమని అర్థించాడు. నిజమే కదా! కామార్తులు సహజంగానే చేతనాచేతనాలకు గల భేదాన్ని గ్రహించలేని మోహమయ దశలో ఉంటారు.

వి :- సందేశాలు అందించటం సామాన్యమైన విషయం కాదు. అందుకెంతో సామర్థ్యం ఉండాలి. రాజనీతి శాస్త్రాల్లో దూతకు ఉండాల్సిన లక్షణాలని చెబుతారు. ప్రేమసందేశం మోసుకెళ్లడానికి కూడా ఎంతో సమయస్ఫూర్తి, వాక్చాతుర్యం ఉండాలి. ఇవేమి గమనించకుండా యక్షుడు మేఘాన్ని అర్థించటం అతనిలోని విరహార్తిని తెలియజేస్తుంది. ఈ వర్ణనలే తరువాత వచ్చిన 'మేఘమాల' సందేశాలకు ప్రేరణలు. ఈ శ్లోకం ద్వారా కాళిదాస కవికి గల ప్రకృతి విజ్ఞానం కూడా విదితమౌతుంది. మేఘం అంటే 'ధూమజ్యోతి సలిలమరుత్తుల సమ్మేళనం' అని చక్కగా వివరించాడు. ఇది శాస్త్రీయ దృక్పథం.

ఇక్కడ 'అర్థాంతర న్యాసాలంకారం' ఉంది. విశేషాన్ని సామాన్యం చేత సమర్థించాడు కవి.

ఇక మేఘంతో యక్షుని సంభాషణ రాబోయే శ్లోకం నుండి ఆరంభమౌతుంది. ఎవరితో నైనా సంభాషణ కుపక్రమించేటప్పుడు ఎలా ప్రారంభించాలో మహాకవి మాటల్లో చూడాల్సిందే.

జాతం వంశే భువనవిదితే పుష్కరావర్తకానాం
జానామి త్వాం ప్రకృతిపురుషం కామరూపం మఘోనః,
తేనార్థిత్వం త్వయి విధివశాత్ దూరబంధుర్గతోఽహం
యాచ్ఞామోఘా వరమధిగుణే నాధమే లబ్ధకామా. 6

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ.- త్వాం = నిన్ను, భువనవిదితే = లోకప్రసిద్ధమైన, పుష్కర ఆవర్తకానాం = పుష్కర ఆవర్తకముల యొక్క వంశే = వంశమునందు, జాతం = జన్మించినవానిగా, కామరూపం = కోరినరూపం ధరించేవానిగా, మఘోనః = ఇంద్రుని యొక్క ప్రకృతిపురుషం = ప్రకృతి మండలంలో ఒకనిగా, ప్రధానమైనవానిగా, జానామి = ఎరుగుదును, తేన = అందుచేత, విధివశాత్ = అదృష్టవశాత్తూ, దూరబంధుః = దూరబంధువును, అహం = నేను, త్వయి = నీపట్ల, నీ వద్ద, అర్థిత్వం = అర్థించేవానిగా, గతః = అయినాను, అధిగుణే = తమకన్నా శ్రేష్ఠుడైన వాని వద్ద, యాచ్ఞా = యాచన, ప్రార్థన, మోఘా = విఫలమైనను, వరం = మేలే, అధమే = నీచుని వద్ద, లబ్ధకామా = కోరికసిద్ధించిన, (యాచ్ఞా), న వరమ్ = శ్రేష్ఠముకాదు.

తా:- (ఓ మేఘుడా!) విశ్వవిఖ్యాతమైన పుష్కరావర్తకముల వంశములో నీవు జన్మించావని నేనెరుగుదును. అంతేకాదు ఇంద్రుని సచివులలో ఒకనివని, అతని ఆస్థానంలో ప్రముఖ వ్యక్తివని కూడా నాకు తెలుసును. కోరిన రూపం ధరించే శక్తి నీకున్నది. (నీవు ఇంద్రుని ప్రధానపురుషుడవు. నేను కుబేరుని అనుచరుడను. ఇరువురమూ దిక్పాలకుల అనుచరులమే). అదృష్టవశాత్తూ దివ్యలోకానికి చెందిన నీతో నాకు దూరపుబంధుత్వం కూడా ఉంది. ఆ బాంధవ్యాన్ని పురస్కరించుకొని నేను నిన్ను (సందేశార్థం) ప్రార్థిస్తున్నాను. ఎందుచేతనంటే అధములను యాచించి కోరినది పొందే కన్నా మహాత్ములను అర్థించి కోరినది పొందలేక వట్టి చేతులతో వెళ్లినా అది మంచిదే.

వి :- ఇంద్రుడు ఒక దిక్పాలకుడు. కుబేరుడు ఒక దిక్పాలకుడు. మేఘుడు ఇంద్రుని సహచరుడు. యక్షుడు కుబేరుని అనుచరుడు. ఈ విధంగా మేఘునకు యక్షునకు మధ్య దూరపు బంధుత్వం ఏర్పడింది. మహాత్ములను అర్థిస్తే సాధ్యమయితే వాళ్లు సహాయం చేస్తారు. లేకపోతే లేదు. హేళన చేయరు. నీచులు మాత్రం గోరంత చేసి కొండంత చెప్పుకుంటారు. అలాంటి వారినుండి సహాయం పొందేకంటే, మహాత్ములనర్థించి ప్రయోజనం పొందలేకపోయినా విచారం లేదు.

ఇక్కడ 'అర్థాంతర న్యాసాలంకారం'. ఈ 'అర్థాంతర న్యాసాలంకారం' ఒక లోకానుభవాన్ని చూపి విషయాన్ని సమర్థిస్తుంది. అందుచేత ఈ వాక్యాలు చక్కని లోకోక్తులు అని చెప్పవచ్చు.

'In Public domain- Digitization Muthulakshmi Research Academy

'పుష్కర, ఆవర్తకాలు' ఈ రెండు శ్రేష్ఠమైన మేఘాలు. వీటిని గూర్చి వివిధ వ్యాఖ్యానాలున్నాయి. 'పుష్కరం పానీయం ఆవర్తయంతి యథాకామం పృథివ్యాం భ్రమంతి' అని వీటి నిర్వచనం. జలాన్ని తీసుకుని ఆ జలాన్ని అక్కడా ఇక్కడా వర్షిస్తాయి. చక్కని జలప్రదాయకమేఘాలు అని చెప్పవచ్చు. మేఘుడు ఎక్కడ వర్షించాలి? ఎక్కడ తిరిగి జలం స్వీకరించాలి, ఇత్యాదులు కవి చాలా చక్కగా వివరిస్తాడు.

యక్షుడు మేఘాన్ని ప్రార్థిస్తున్నాడు -

సంతప్తానాం త్వమసి శరణం తత్పయోద! ప్రియాయాః
సందేశం మే హర ధనపతి క్రోధ విశ్లేషితస్య,
గంతవ్యా తే వసతిరలకా నామ యక్షేశ్వరాణాం
బాహ్యోద్యానస్థిత హర శిరశ్చంద్రికా ధౌత హర్మ్యా. **7**

ప్ర.అ.- హే పయోద! = ఓ జలదా! (నీటినిచ్చువాడా!), త్వం = నీవు, సంతప్తానాం = తపించిపోయిన వారికి, శరణమ్ అసి = శరణం అయి ఉన్నావు, తత్ = అందుచేత, ధనపతిక్రోధ = కుబేరుని కోపకారణంగా, విశ్లేషితస్య = ప్రియతమ నుండి వేరుచేయబడిన, మే = నా యొక్క, సందేశం = సందేశాన్ని, ప్రియాయాః = ప్రేయసివద్దకు, హర = తీసికొని వెళ్లుము, తే = నీకు, బాహ్యోద్యాన = నగరం వెలుపల ఉండే ఉద్యాన వనమునందు, స్థిత = ఉన్నట్టి, హర = శివుని యొక్క, శిరశ్చంద్రికా = శిరసునందలి చంద్రుని వెన్నెల చేత, ధౌతహర్మ్యా = ధవలములుగా చేయబడిన భవనములు కలిగిన, అలకానామ = 'అలక' అను పేరుగల, యక్షేశ్వరాణాం = యక్ష ప్రభువు యొక్క, వసతిః = నివాస స్థలము, గంతవ్యా = వెళ్లవలసి ఉన్నది.

తా:- సందేశాన్ని ఎక్కడకు తీసుకువెళ్లాలో ఈ శ్లోకంలో వివరిస్తున్నాడు కవి. ఓ జలదా! తపించిపోయిన వారికి పిపాసను తీర్చి రక్షించేవాడవు నీవు. సంతప్తులకు (విరహతప్తులకు) నీవే శరణం. అందుచేత కుబేర శాపానికి గురియై, ప్రియురాలినుండి విడివడి తపించిపోతున్న నాకు, కూడా, దిక్కు నీవే (నీటితో నిండిన గుండె కలవాడు కావున ఆర్ద్రహృదయుడు మేఘుడు). నా సందేశాన్ని నా ప్రియతమ వద్దకు తీసుకొని వెళ్లుము. నీవు వెళ్లాల్సినది 'అలకాపురి'. అది యక్షులకు నివాస స్థానము. ఆ నగరం ఎంతో పునీతమైనది. నగరం వెలుపల ఉద్యానవనంలో ప్రతిష్ఠితుడైన చంద్రమౌళీశ్వరుని

శిరసునలంకరించిన చంద్రుని యొక్క వెన్నెలలు ఆ నగరంలోని భవనాలను స్వచ్ఛమైన ధవళకాంతితో మెరిసిపోయేటట్లు చేస్తున్నాయి.

In Public domain, Digitization Muthulakshmi Research Academy

వి :– తాపం అనగా వేడి. గ్రీష్మంతో తపించే జనులకు జలమునిచ్చి సేదదీర్చేవాడు మేఘుడు. ఇక్కడ యక్షుడు విరహం చేత తపించి ఉన్నాడు. తాపాన్ని ఉపశమింప జేసే హృదయం కలవాడు కనక మేఘుడు తన విరహతాపాన్ని, ప్రేయసి విరహతాపాన్ని ఉపశమింపజేయ సమర్థుడని యక్షుడు భావించాడు. మేఘుడు ఎంత దూరం ప్రయాణం చేయాల్సి ఉందో కూడా ఇక్కడ సూచించాడు.

'అలకాపురి' అనగా అలతి, భూషయతి – అలంకరిస్తుంది. కనక 'అలక'.

దీనినే 'వసుధార, వసుస్థలి, ప్రభ' అనికూడా అంటారు. ఇది హిమాలయం లోని కైలాస పర్వతంపై ఉంది.

ఇక రాబోయే శ్లోకంలో గగన వీధుల్లో ఎగిరే మేఘం యొక్క సౌందర్యాన్ని కవి వర్ణిస్తున్నాడు.

త్వామారూఢం పవనపదవీముద్గృహీతాలకాంతాః
ప్రేక్షిష్యంతే పథికవనితాః ప్రత్యయాదాశ్వసంత్యః,
కః సన్నద్ధే విరహవిధురాం త్వయ్యుపేక్షేత జాయాం
న స్యాదన్యోఽ_ప్యహమివ జనో యః పరాధీనవృత్తిః 8

ప్ర.అ.:– పవన–పదవీం = వాయు మార్గాన్ని, ఆరూఢం = అధిరోహించిన, త్వాం = నిన్ను, పథికవనితాః = ప్రవాసమునకు వెళ్ళినవారి భార్యలు, ఉద్గృహీత = పైకి ఎత్తబడిన, అలక అంతాః = ముంగురు కలిగిన, ప్రత్యయాత్ = (నీ రాకచే కలిగిన) నమ్మకం చేత, ఆశ్వసంత్యః = ఊరట చెందుతూ, ప్రేక్షిష్యంతే = చూడగలరు. త్వయి సన్నద్ధే = నీవు ఆకాశంలో (వర్షించడానికి) సిద్ధపడుతుండగా, విరహవిధురాం = విరహంతో వికలమయి ఉన్న, జాయాం = భార్యను, కః ఉపేక్షేత = ఎవడు ఉపేక్షించగలడు (జాగుచేయగలడు), అన్యః అపిజనః = మరొకడు కూడా, అహమ్ ఇవ = నాకు వలెనే, పరాధీనవృత్తిః = సేవక వృత్తిలో ఉన్నవాడు, న స్యాత్ = కాకపోయినట్లైతే.

తా:– ఆకాశంలో కెగసి వాయుమార్గాన్ని చేరిన నిన్ను ప్రవాసంలో ఉన్న బాటసారుల భార్యలు నుదుటిమీద పడే ముంగురులను పైకి సరిజేసుకుంటూ చూస్తూ ఊరట చెందుతారు. నిన్ను చూడగానే వారికి ఇక తమ భర్తలు తొందరలోనే తిరిగి వస్తారు అనే

In Public domain. Digitization Muthulakshmi Research Academy

నమ్మకం ఏర్పడుతుంది. అంతేకాదు (వర్షాకాలానికి) సన్నద్ధుడవయి ఉన్న నిన్ను చూచిన తర్వాత ఎవడు మాత్రం విరహార్తితో ఉన్న తన భార్యను ఉపేక్షించగలడు? ఎవడైనా నాలాంటి పరాధీనవృత్తిలో ఉంటే తప్ప సాధారణ జనుడు ఎవడూ అలా భార్యను వదిలి దూరంగా ఉండలేడు.

వి :- ఇక్కడ యక్షుని మనోవేదన ప్రకటితమయింది. వర్షాకాలం ఆసన్నమయిందని తెలియగానే ఎక్కడి వారూ ఇల్లు చేరుకుంటారు. మరీ పరాధీనుడయితే మాత్రం వియోగ దుఃఖం తప్పదు.

ఇక్కడ కూడా అర్థాంతరన్యాసాలంకారమే.

రాబోయే శ్లోకంలో తన ప్రియతమ విరహవేదనను ఊహించి కళ్లకు కట్టినట్లుగా వర్ణిస్తున్నాడు యక్షుడు.

తాం చావశ్యం దివసగణనా తత్పరామేకపత్నీ-
మవ్యాపన్నా మవిహతగతిర్ద్రక్ష్యసి భ్రాతృజాయామ్,
ఆశాబంధః కుసుమసదృశం ప్రాయశోహ్యంగనానాం
సద్యః పాతి ప్రణయి హృదయం విప్రయోగే రుణద్ధి. 9

ప్ర.అ.- చ = మరియు, దివసగణనాతత్పరాం = రోజులు లెక్కపెట్టటంలో నిమగ్నమై ఉన్న, అవ్యాపన్నాం = జీవించి ఉన్న, ఏకపత్నీం = భర్త పైనే మనసు ఉంచిన, తాం భ్రాతృజాయామ్ = ఆ నీ సోదరుని భార్యను, అవిహతగతిః = నిరాటంకంగా, ఏ అడ్డూ లేకుండా, అవశ్యం = తప్పనిసరిగా, ద్రక్ష్యసి = చూడగలవు, ఆశాబంధః = ఆశ అనే బంధము, కుసుమ సదృశం = పూవువంటి సుకుమారమైన, అంగనానాం ప్రణయి హృదయం = యువతుల యొక్క ప్రేమమయ హృదయాన్ని, విప్రయోగే = వియోగమునందు, సద్యః పాతి = వెంటనే పడిపోబోగా (క్రిందపడబోగా), ప్రాయశః = చాలవరకు, రుణద్ధి = ఆపుతుంది.

తా:- మరియు నీవు (అక్కడికి వెళ్లి) రోజులు లెక్కబెట్టుకుంటూ ఎలాగో ప్రాణాలు నిలువుకొని ఉన్న నీ యీ సోదరుని భార్యను నిరభ్యంతరంగా (ఎవరిచేతా అడ్డు పెట్టబడకుండా) అవశ్యం చూడగలవు. యువతుల ప్రేమమయ హృదయాలు సుమసుకుమారాలు. ఏ చిన్నపాటి విరహవేదనకైనా చిరుగాలి తాకిడికి పూవులా రాలి

క్రిందపడబోయేట్టుగా ఉంటాయి. అలాంటి ఆ హృదయాన్ని కుసుమాన్ని వృంతం(కాడ) నిలిపినట్లుగా ఆశ అనే బంధం పట్టుకుని పడిపోకుండా నిలుపుతుంది.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వి :- సందేశం పంపటానికి మేఘుణ్ణి ఎంచుకున్నపుడే యక్షునికి అతని పట్ల గల ఆదరం, విశ్వాసం వెల్లడి అయ్యాయి. భార్యవద్దకు ఎవరూ అపరిచితుణ్ణి పంపరు కదా! అందుచేత యక్షుడు తన భార్యను మేఘునకు 'సోదరుని భార్య' అని వ్యవహరించాడు. నీ 'వదిన' అని అర్థం. ఉత్తరప్రదేశ్‌లో మిత్రుల భార్యలను 'భాభీ' అనే పిలుస్తారు.

ఏకపత్నీ = ఏకః పతిః యస్యాః సా, ఒకే భర్త కలిగిన స్త్రీ, ఈ 'ఏకపత్నీ' అనేది స్త్రీ పురుషులిరువురికీ వర్తిస్తుంది. 'పతి' శబ్దానికే 'న' చేరి పత్నీ అనిరూపం ఏర్పడుతుంది.

'పత్యుః నో యజ్ఞసంయోగే', అని సూత్రం. యజ్ఞ, యాగాదుల్లో కలిసి చేసేవారు పతి-పత్నులు. అందుచేతనే 'ధర్మపత్ని' అంటారు. ధర్మకార్యాల్లో భాగస్వామిని కనుక. ఇందులో అర్థాంతరన్యాసాలంకారం ఉంది. ఇక మేఘగమన వర్ణనం ప్రారంభమౌతుంది.

మందం మందం నుదతి పవనశ్చానుకూలో యథా త్వాం
వామశ్చాయం నదతి మధురం చాతకస్తే సగర్వః,
గర్భాధానక్షణపరిచయాన్నూన మాబద్ధమాలాః
సేవిష్యంతే నయనసుభగం ఖే భవంతం బలాకాః. **10**

ప్ర.అ :- అనుకూలః = అనుకూలంగా, పవనః = వాయువు, త్వాం = నిన్ను, మందం మందం = మెల్ల మెల్లగా, యథా = ఏ విధంగానైతే, నుదతి = ప్రేరేపిస్తుంది, ముందుకు నడిపిస్తుంది, అయం = ఈ, చాతకః చ = చాతక పక్షికూడా, వామః = ఎడమవైపున ఉండి, సగర్వః = సగర్వంగా, మధురం = తీయగా, నదతి = ధ్వనిచేస్తుంది, గర్భాధానక్షణ పరిచయాత్ = సంభోగక్షణముతోడి పరిచయం వలన (గర్భాధానానికి అనుకూలమైన వేళ ఇది అని తెలుసుకొని), ఖే = ఆకాశమునందు, ఆబద్ధమాలాః = బారులు తీరిన, బలాకాః = కొంగలు, నయనసుభగం = కంటికింపుగా నున్న, చూడముచ్చటైన, భవంతం = నిన్ను, సేవిష్యంతే = సేవించగలవు.

తా:- యక్షుడు మేఘునితో ఇలా అంటున్నాడు - "నీమార్గంలో వాయువు నీకు అనుకూలంగా వీస్తూ మెల్లమెల్లగా నిన్ను ప్రేరేపిస్తూ ముందుకు నడిపిస్తుంది. నీకు ఎడం ప్రక్కన చాతకపక్షి సగర్వంగా, మధురంగా కూస్తుంది (నిన్ను చూసి). గర్భాధాన

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఉత్సవవేళ అని తెలుసుకుని కొంగలు ఆకాశంలో వరుసలు తీరి (బారులు తీరి), నయనానందకరంగా ఉన్న నిన్ను ఆదరంగా సేవిస్తాయి.

వి :- వాయువు యొక్క అనుకూలత కార్యసిద్ధిని సూచిస్తుంది. చాతకపక్షులు వర్షపు బిందువులను మాత్రమే సేవిస్తాయి. అందుచేత వాటికి మేఘాలను చూస్తే అనందం, కొంగలకు కూడా బహుశా ఇదియే సమాగమవేళ. అందుచేత అవి ఆనందంగా మేఘుణ్ణి సేవిస్తాయి.

ఇంకా ఇలా వర్ణిస్తున్నాడు యక్షుడు –

కర్తుం యచ్చ ప్రభవతి మహీముచ్ఛిలీంధ్రాత పత్రాం
తచ్ఛ్రుత్వా తే శ్రవణసుభగం గర్జితం మానసోత్కాః,
ఆకైలాసాద్ బిసకిసలయ చ్ఛేద పాథేయవంతః
సంపత్స్యంతే నభసి భవతో రాజహంసాః సహాయాః 11

ప్ర.అ.- యత్ చ = మరియు ఏదైతే, మహీం = భూతలాన్ని, ఉత్ శిలీంధ్ర ఆతపత్రాం = పొడుచుకువచ్చిన పుట్టగొడుగులు కలదిగా (పుట్ట గొడుగులు మొలిచేటట్లుగా), కర్తుం ప్రభవతి = చేయగల సామర్థ్యముకలదో, తత్ = ఆ యొక్క శ్రవణ సుభగం = వినుటకింపైన, తే గర్జితం = నీ గర్జనను, శ్రుత్వా మానసోత్కా = మానస సరోవరం చేరాలని ఉత్కంఠతతో ఉన్న (మానసోత్కంఠతతో ఉన్న), రాజహంసాః = రాజహంసలు, బిసకిసలయచ్ఛేద = తామరతూడుల ముక్కలను, పాథేయవంతః = దారి భోజనముగా కలిగినవై, ఆకైలాసాత్ = కైలాసపర్వతము వరకు, నభసి = ఆకాశంలో, భవతః = నీయొక్క, నీకు, సహాయాః = సహాయకులుగా, తోడుగా, సంపత్స్యంతే = చేరుతారు, అవుతారు.

తా:- మహీతలాన్ని శిలీంధ్ర ఆతపత్రములు కలదిగా చేయగలగిన ప్రభావము గల నీ వీనులవిందైన గర్జనను వినగానే, మానస సరోవరాన్ని చేరాలనే ఉత్కంఠతో ఉన్న రాజహంసలు నీతో గూడా బయలుదేరుతాయి. తామరతూడుల ముక్కలను పాథేయంగా అవి తీసుకుని కైలాసపర్వతం వరకూ నీతోబాటుగా పయనిస్తూ నీకు తోడుగా ఉంటాయి.

వి:- మేఘగర్జనకు పుట్టగొడుగులు బయలుదేరుతాయి. అవియే భూదేవికి అతపత్రాలు (గొడుగులు) అని కవి వర్ణన. 'పాథేయం' అనగా 'పథి సాధు' అని అర్థం.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్రయాణానికి వెళ్ళేటప్పుడు బాటసార్లులు తీసుకువెళ్ళే 'దారి భోజనం' పాథేయం. రాజహంసలకు మృణాలతంతులు ఇష్టం. అందుచేత అవి వాటిని తీసుకుని వెళతాయి అని కవి చమత్కారం.

ముక్కు, కాళ్లు అరుణవర్ణంలోనూ, మిగిలిన శరీరభాగం తెల్లగానూ ఉంటుంది రాజహంసలకు. ఇవి కాలాంతరంలో వలసపోయి వర్షాకాలం వచ్చేసరికి మానససరోవరాన్ని చేరతాయట.

ఈ విధంగా మేఘుణ్ణి ప్రయాణానికి ఉన్ముఖుడయ్యేటట్లుగా వర్ణించి ఇప్పుడు ఇక బయలు దేరమని సూచిస్తున్నాడు యక్షుడు.

ఆపృచ్ఛస్వ ప్రియసఖమముం తుంగమాలింగ్య శైలం
వంద్యైః పుంసాం రఘుపతి పదైరంకితం మేఖలాసు,
కాలే కాలే భవతి యస్య సంయోగమేత్య
స్నేహవ్యక్తిశ్చిర విరహజం ముంచతో బాష్పముష్ణమ్. 12

ప్ర.అ.– పుంసాం = జనులకు, వంద్యైః = పూజనీయములైన వాటిచేత, రఘుపతి పదైః = శ్రీరాముని పాదములచేత, మేఖలాసు = సానువులందు, అంకితమ్ = ముద్రలు వేయబడినట్టి, తుంగమ్ = శిఖరాన్ని, అముం ప్రియసఖం = ఈ ప్రియమిత్రుని, శైలమ్ = పర్వతాన్ని, ఆలింగ్య = కౌగిలించుకొని, ఆపృచ్ఛస్వ = సెలవు తీసుకో, వెళ్లడానికి అనుమతి తీసుకో, కాలే కాలే = ప్రతి వర్షాకాలం లోనూ, సంయోగం ఏత్య = సంయోగాన్ని పొంది, ఒకచోట చేరి, యస్య = ఎవని యొక్కనైతే, చిర విరహజం = చిరకాలవియోగం వలన కలిగిన, ఉష్ణం బాష్పం = వేడికన్నీటిని, ముంచతః = వదలుచున్న వానియొక్క స్నేహవ్యక్తిః = స్నేహం యొక్క అభివ్యక్తి (ప్రకటన), భవతి = అవుతుంది.

తా:– ప్రియసఖుడైన ఈ శైల (పర్వత) శిఖరాన్ని కౌగిలించుకొని ప్రయాణానికై సెలవుతీసుకో. ఈ పర్వతసానువులపై శ్రీరామ పదచిహ్నాలున్నాయి. అందుచేత సకల జనులకు పూజనీయము ఈ 'రామగిరి'. ప్రతి వర్షాకాలారంభంలోనూ నీతో సమ్మేళనాన్ని పొందే ఇతడు (పర్వతం) నిన్ను కలవగానే ఎంతో కాలానికి కలవటం వల్ల కలిగిన ఆనందంతో విడిచే వేడి కన్నీటి చుక్క అతనికి నీపట్ల గల స్నేహాన్ని తెలియజేస్తుంది.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వి :- సహజంగా తొలకరి జల్లులు వేడిగానే ఉంటాయి. గ్రీష్మం తర్వాత పడే తొలిచినుకు పర్వతంపై నుండి రాలినపుడు వేడిగానే ఉంటుంది. దీన్ని కవి పర్వతుని కన్నీటిగా అభివర్ణించాడు. ఎవరైనా తమవారిని వదిలి దూరంగా వెళ్ళేటప్పుడు వారి వద్ద తీసుకునే వీడ్కోలు 'ఆపృచ్ఛ' వెళ్లివస్తాను అని చెప్పటం. 'స్నేహితులైతే ఆప్యాయంగా కౌగిలించుకొని వీడ్కోలు' చెప్పుకుంటారు. అందువల్ల మేఘునితో ప్రియమిత్రుడైన 'రామగిరి'ని ఆలింగనం చేసి కొమ్మని యక్షుడు చెప్పాడు.

ఇక్కడ ఒక విశేషం గమనార్హం. మేఘం నేలను తాకదు. అది ఆకాశంలో విమానంలా పయనించగలదు కానీ నేలను తాకలేదు. అందుచేత కవి శిరోమణి కాళిదాసు మేఘం కొండచరియపైన కనవడినట్లు వర్ణించి, తరువాత అది పర్వతశిఖరాన్ని ఆలింగనం చేసికొని బయలుదేరినట్లు చెప్పబోతున్నాడు. ఇది 'మేఘం' ఆకాశంలోకి టేకాఫ్ చేయట మన్న మాట. మరొక విషయం ఏమిటంటే మేఘమండలం దాటితే క్రింద ఏమీ అగుపించదు. కానీ మేఘమండలం నుండి క్రింద దృశ్యాలు కనబడతాయి. దీన్ని బట్టి కాళిదాసు 'హెలికాప్టర్' లాంటి దానిలో ప్రయాణించి ఉండవచ్చని అనిపిస్తుంది. శాకుంతలం సప్తమాంకంలోనూ, ఈ మేఘసందేశంలోనూ గల భౌగోళిక వర్ణన ఈ భావనకు తావిస్తుంది.

మేఘుడు పయనించాల్సిన మార్గవర్ణనం.:-

యక్షుడు మేఘునితో ఇలా అంటున్నాడు.

మార్గం తావచ్ఛృణు కథయతస్త్వత్ప్రయాణానురూపం
సందేశం మే తదను జలద! శ్రోష్యసి శ్రోత్రపేయమ్,
ఖిన్నః ఖిన్నః శిఖరిషు పదం న్యస్య గంతాసి యత్ర
క్షీణః క్షీణః పరిలఘు పయః స్రోతసాం చోపభుజ్య. 13

ప్ర.అ.- హే జలద ! = ఓ మేఘమా! తావత్ కథయతః (మత్తః) = చెప్పబోతున్న నా నుండి (నేను చెప్పబోయేది), త్వత్ ప్రయాణానురూపం = నీ ప్రయాణమునకు అనువైన, మార్గం = మార్గమును గూర్చి, శృణు = వినుము, యత్ర = ఏ మార్గమునందైతే, ఖిన్నః ఖిన్నః = అలసి సొలసి, శిఖరిషు = పర్వత శిఖరాలపైన, పదం న్యస్య = కాలుమోపి, క్షీణః క్షీణః = మరీమరీ క్షీణించిన (బక్క చిక్కిన) నీవు, స్రోతసాం = నదుల యొక్క పరిలఘు = తేలికైన, పయః = జలాన్ని, ఉపభుజ్య = సేవించి, చః = మరియు, గంతాసి

In Public domain. Digitization Muthulakshmi Research Academy

= వెళ్లగలవు, తదను = మార్గమును గూర్చి విన్న పిదప, శ్రోత్రపేయం = కర్ణపేయమైన, వీనుల విందైన, మే సందేశం = నా సందేశాన్ని, శ్రోష్యసి = వింటావు.

తా:- ఓ జలదా ! నీ ప్రయాణానికి అనుకూలమైన మార్గాన్ని గూర్చి చెబుతాను వినుము. మార్గాయసము వలన నీవు మరీ మరీ అలసిపోయినపుడు, నీరసించినపుడు అక్కడక్కడా పర్వతశిఖరాలపై ఒకింతసేపు కాలుమోపి విశ్రమించి తేలికైన నదీజలాలను సేవించి ముందుకు సాగవచ్చు (అలాంటి నదీజలాలు లభించే మార్గాన్ని నీకు తెలియ జేస్తాను). ప్రయాణ మార్గాన్ని గూర్చి తెలుసుకున్న తరువాత, వీనులకు విందుగా నా సందేశాన్ని విందువు గాని.

వి :- మేఘాలు ప్రయాణిస్తూ అక్కడక్కడా నీటిని గ్రహిస్తూంటాయి. ఆ నీటినే వర్షంగా కురిపిస్తూ ఉంటాయి. ఇది భౌగోళిక సత్యం. ఈ విషయాన్ని 'మేఘానికి' ఒక మూర్తరూపాన్ని కల్పించి అందంగా అందించాడు కవికులగురువు. ఎవరైనా ప్రయాణించేటపుడు సుఖకరమైన మార్గాన్నే ఎంచుకుంటారు. చూట్టూ తిరిగి కాస్త దూరమైనా ఫరవాలేదు. ఇలాంటి విషయమే ముందు ముందు ఉజ్జయినీనగర విషయంలో కవి వర్ణిస్తాడు.

* * * * *

పర్వతం పైనుండి కదిలే మేఘవర్ణనం

మేఘునకు మార్గాన్ని వివరిస్తున్నాడు యక్షుడు. కేవలం మార్గవివరణే అయితే ఇక కావ్య సౌందర్యం ఎక్కడుంటుంది. అందుచేత ప్రయాణోన్ముఖుడైన మేఘుని యొక్క ప్రతీకదలికనూ అణువణువునూ కళ్లకు కట్టినట్లుగా చిత్రీకరించాడు కవితల్లజుడు కాళిదాసు. సహజంగా కదిలే మేఘం యొక్క పోకడను అందంగా వ్యాఖ్యానించటమే గాని మేఘం సందేశాన్ని తీసుకువెళ్లగల్గుతుందా? అయితే ఇలాంటి ఆలోచనే మనసులోనికి రానీయకుండా అత్యంతమనోహరంగా వర్ణించాడు కవి. ఆ వర్ణన ఇలా సాగుతుంది.

అద్రేః శృంగం హరతి పవనః కింస్విదిత్యున్ముఖీభి -
ర్దృష్టోత్సాహశ్చకిత చకితం ముగ్ధసిద్ధాంగనాభిః,
స్థానాదస్మాత్సరస నిచులా దుత్పతోదఙ్ముఖః ఖం
దిఙ్నాగానాం పథి పరిహరన్ స్థూల హస్తావలేపాన్. 14

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ.- పవనః = వాయువు, అద్రేః = పర్వతం యొక్క శృంగం = శిఖరాన్ని హరతి కిం స్విత్ = తీసికొని వెళ్లుచున్నదా ఏమి?, ఇతి = అని, ఉన్ముఖీభిః = తలలు పైకెత్తి (కుతూహలంగా), ముగ్ధ సిద్ధాంగనాభిః = ముగ్ధలైన సిద్ధయువతులచేత, చకిత-చకితమ్ = మరీ మరీ ఆశ్చర్యంతో, దృష్టోత్సాహః = నీ ఉత్సాహాన్ని చూడగా (చూడబడిన ఉత్సాహం గలవాడు), సరసనిచులాత్ = ఆర్ద్రమైన వెదురు వనము నుండి, అస్మాత్ స్థానాత్ = ఈ ప్రదేశమునుండి, పథి = మార్గమునందు, దిఙ్నాగానాం = దిగ్గజముల యొక్క, స్థూలహస్తావలేపాన్ = బలిష్ఠమైన తొండముల తాకిడులను, పరిహరన్ = తొలగద్రోసుకుంటూ, తప్పించుకుంటూ, ఉదఙ్ముఖః = ఉత్తర దిశకు అభిముఖుడవై, ఉత్పత = పైకి ఎగురుము.

తా:- ఓ మేఘుడా! పచ్చగా నవనవలాడే వేతసవృక్షాలతో శోభించే ఈ ప్రదేశం నుండి ఉత్తరాభిముఖుడవై నీవు ఆకాశవీధిలోకి ఎగసి పొమ్ము. నీవు పైకెగిరినంతనే ఇక్కడ ఉన్న ముగ్ధలైన సిద్ధాంగనలు "వాయువు కొండశిఖరాన్ని ఎత్తుకొని వెళుతున్నదా ఏమి?" అని అత్యంతాశ్చర్యంతో పైకి చూస్తారు. నీ ఉత్సాహం వారి కంటపడుతుంది. అలా ఉత్సాహంగా ముందుకు సాగే నీ దారిలో దిగ్గజాలుంటాయి. అవి వాటి తొండాలని అటూ ఇటూ చలింపజేసేటప్పుడు వాటి తాకిడికి గురికాకుండా నిన్ను నీవు తప్పించుకుంటూ సాగిపోవాలి.

వి :- ఎనిమిది వైపుల ఏనుగులు ఉండి ఈ భూభారాన్ని మోస్తాయని పురాణాలు చెపుతున్నాయి. అవి అష్టదిగ్గజాలు అనబడతాయి. వాటిపేర్లు 1. ఐరావతము, 2. పుండరీకము, 3. వామనము, 4. కుముదము, 5. అంజనము, 6. పుష్పదంతము, 7. సార్వభౌమము, 8. సుప్రతీకము. 'సిద్ధులు' అనగా 'అణిమాది' అష్టసిద్ధులను పొందినవారు. మేఘం వర్షాకాలారంభాన్ని సూచిస్తుంది అని మొదటే చెప్పబడింది. ఆకాశంలో ఇంద్రధనుస్సులు కనబడినపుడు ఆ దృశ్యం ఎలా ఉంటుందో యక్షుడు మేఘునికి చెపుతున్నాడు.

రత్నచ్ఛాయా వ్యతికర ఇవ ప్రేక్ష్య మేతత్పురస్తా -
ద్వల్మీకాగ్రా త్ప్రభవతి ధనుఃఖండమాఖండలస్య,
యేన శ్యామం వపురతితరాం కాంతిమాపత్స్యతే తే
బర్హేణేవ స్ఫురిత రుచినా గోపవేషస్య విష్ణోః. 15

ప్ర.అ.- రత్న చ్ఛాయావ్యతికరః ఇవ = వివిధ రత్నకాంతుల సమ్మేళనము వలె, ప్రేక్ష్యం = చూడదగిన, అందమైన, ఆఖండలస్య = ఇంద్రుని యొక్క, ఏతత్ ధనుఃఖండం = ఈ ధనుస్సు యొక్క భాగము, పురస్తాత్ = ఎదుటనున్న, వల్మీకాగ్రాత్ = పుట్టపై భాగమునుండి, ప్రభవతి = ప్రకటితమవుతున్నది (కనుపించుచున్నది), యేన = ఏ ఇంద్ర ధనుస్సు చేతనైతే, తే = నీ యొక్క, శ్యామం వపుః = నీలశరీరము, స్ఫురితరుచినా = మెరిసే కాంతితో, బర్హేణ = నెమిలిపింఛముతో, గోపవేషస్య = గోపాలుని (కృష్ణుని) వేషము (రూపము) ధరించిన, విష్ణోః = విష్ణువు యొక్క, అతితరాం = అత్యధికమైన, శోభాం = సౌందర్యాన్ని, ఆపత్స్యతే = పొందుచున్నది.

In Public domain. Digitization: Muthulakshmi Research Academy

తా:- వివిధ రత్నాలకాంతుల సమ్మేళనం వలె చూడముచ్చటగా నున్న రంగురంగుల ఇంద్ర ధనస్సు యొక్క భాగం కొంత ఎదుట నున్న వల్మీకాగ్రభాగం నుండి వెలువడుతుంది. ఆ కాంతి సోకిన నీ నల్లని(నీల) శరీరం నెమలిపింఛంతో కృష్ణుని రూపంలా అత్యంత శోభావహంగా ఉంది.

వి :- ఆకాశంలో ఇంద్రధనుస్సు ఉదయించింది. మేఘుని వెనక ఆ ఇంద్రధనుస్సు కాంతి సోకుతుంది. అది చూడటానికి నీలిమేఘవర్ణం గల కృష్ణుడు నెమలిపింఛంతో ఎలా మెరిసిపోతున్నాడో అలా ఉంది. నల్లని మేఘం దానిలో ప్రతిఫలించే రత్నాల కాంతి వంటి రంగురంగుల కాంతి.

ఇక్కడ 'పూర్ణోపమా అలంకారం'. కాళిదాసు ఉపమా సౌందర్యానికి, ఊహాశక్తికీ తార్కాణం.

ఇంకా మేఘుని రాక కోసం ఎవరెవరు ఎంత ఆసక్తిగా వేచి ఉన్నారో వర్ణిస్తున్నాడు.

త్వయ్యాయత్తం కృషిఫలమితి భ్రూవిలాసానభిజ్ఞైః
ప్రీతిస్నిగ్ధైర్జనపద వధూలోచనైః పీయమానః,
సద్యః సీరోత్కషణ సురభి క్షేత్రమారుహ్య మాలం
కించిత్పశ్చాద్ వ్రజ లఘుగతిర్భూయ ఏవోత్తరేణ. **16**

ప్ర.అ.- కృషిఫలం = సేద్యఫలము, త్వయి ఆయత్తం = నీ పై ఆధారపడి ఉన్నది, ఇతి = అని, భ్రూవికార అనభిజ్ఞైః = కనుబొమల విరుపులను ఎరుగని, ప్రీతి స్నిగ్ధైఃచ = ప్రేమార్ద్రములయిన, జనపదవధూలోచనైః = పల్లెపడుచుల కనులచేత

In Public domain: Digitization Mithulakshmi Research Academy

(చూపులచేత), పీయమానః = (చూపులతో) త్రాగబడేవాడవై, మాలం = 'మాల' అను ప్రదేశమును, సద్యః = అప్పుడే, సీరోత్కషణ = నాగలి రాపిడి చేత, సురభి క్షేత్రం = సువాసన వెదజల్లే పొలము గలది, ఆరుహ్య = అధిరోహించి, అభివర్షించి, కించిత్ = ఇంచుక, పశ్చాత్ = పశ్చిమదిశగా, వ్రజ = వెళ్లుము, భూయః = మరల, లఘుగతిః = త్వరిత గతిని, ఉత్తరేణ ఏవ = ఉత్తరదిశగానే (వ్రజ).

తా:- శ్రమించి చేసిన సేద్యపు పంట నీపైన ఆధారపడి ఉన్నది. అందుచేత పల్లెపడుచులు ఆకాశంలో నీవు కనబడగానే, ప్రేమపూరితనయనాలతో నిన్ను చూస్తారు. వారికి నాగరిక యువతుల వలె నయనవిన్యాసాలు చేతకావు. అందుచేత కల్లాకపటం లేని అమాయకపు కళ్లతో నిన్ను త్రాగేస్తున్నట్లు ప్రేమగా చూస్తారు. ఆ విధంగా ఆశగా వారు చూస్తుండగా, అప్పుడే దున్నటం చేత మట్టి సువాసనలు వెదజల్లే క్షేత్రాలతో విలసిల్లే 'మాల' దేశానికి పైగా వెళ్లు. అలా వెళ్లడానికి కొంచెం పశ్చిమ దిశగా వెళ్ళాలి. అలా అటు వెళ్లి వారికి ఆనందం కలిగించేటట్లుగా కొంచెం చినుకులు రాల్చి మళ్లీ వడివడిగా ఉత్తరదిశగానే సాగిపో.

వి :- వ్యవసాయదారులకు మేఘం కనపడితే ఆత్మీయుడు కనబడినట్లే. వారు దుక్కిదున్నిన పొలాలు పండాలంటే మేఘుని గుండె కరగాల్సిందే. అందుచేత అప్పుడే పొలాలను దున్ని వర్షం కోసం వేచి ఉంటారు 'మాల' ప్రాంతం వాళ్లు. ఆత్మీయులు వేచి ఉంటే ప్రయాణంలో కొంచెం మలుపు తిరగక తప్పదు. అయితే ఎక్కువ సేపు అక్కడే ఉండిపోయి చేయాల్సిన పనిని మరవగూడదు. అందుచేత యక్షుడు పై విధంగా చెప్పాడు.

రాబోయే రెండు శ్లోకాల్లో 'ఆమ్రకూట' మనే పర్వత వర్ణనం :-

త్వామాసార ప్రశమిత వనో పప్లవం సాధు మూర్ధ్నా
వక్ష్యత్యధ్వశ్రమ పరిగతం సానుమానామ్రకూటః,
న క్షుద్రో௨పి ప్రథమ సుకృతాపేక్షయా సంశ్రయాయ
ప్రాప్తే మిత్రే భవతి విముఖః కిం పునర్య స్తథోచ్చైః. 17

ప్ర.అ.- ఆమ్రకూటః = ఆమ్రకూటమను పేరుగల, సానుమాన్ = పర్వతము, సారప్రశమిత వనోపప్లవం = ధారాపాతముగా వర్షమును కురిపించి దవాగ్నిని చల్లార్చిన వాడవు, అధ్వశ్రమ పరిగతం = మార్గాయాసమును పొందినవాడవు ఐన, త్వాం = నిన్ను, సాధు = చక్కగా, మూర్ధ్నా = శిరసా, వక్ష్యతి = వహిస్తుంది, క్షుద్రః అపి =

అల్పుడు కూడా, సంశ్రయాయ = ఆశ్రయము కొరకు, మిత్రే ప్రాప్తేసతి = మిత్రుడు
In Public domain. Digitization Muthulakshmi Research Academy
వచ్చినపుడు, ప్రథమ సుకృత అపేక్షయా = పూర్వపు ఉపకారాన్ని తలచి, విముఖః = విముఖుడు, న భవతి = కాజాలడు, యః = ఏ ఆమ్రకూటమైతే, తథా ఉచ్చైః = ఆ విధంగా ఉన్నతమైనదో (అంతటి ఉన్నతమైన), కింపునః = ఇక చెప్పేదేమిటి?

తా:- నీ నుండి ఉపకారం పొందిన 'ఆమ్రకూట' పర్వతం ఉంది. నీ శక్తియావత్తూ వర్షంగా కురిపించి వనాన్ని దహించే కార్చిచ్చును చల్లార్చి వనానికి కలిగే ఉపద్రవాన్ని ఉపశమింపజేసావు. ఆ విధంగా వనాన్ని రక్షించి, ప్రయాణంలో అలసి ఉన్న నిన్ను 'ఆమ్రకూటం' తన తలపైన పెట్టుకుంటుంది (అంతగా ఆదరిస్తుంది). ఎంతటి అల్పుడైనా ఒకప్పుడు ఉపకారం చేసిన మిత్రుడు ఆశ్రయం కోరి తన వద్దకు వస్తే విముఖుడు కాజాలడు (కాదని పెడముఖం పెట్టలేడు). అలాంటిది అంతటి ఉన్నతుడైన 'ఆమ్రకూటాన్ని' గూర్చి ఇక వేరే చెప్పాలా? (తప్పకుండా ఆదరిస్తాడు)

వి :- ఉపకారం చేసేవాడు మిత్రుడు. అపకారం చేసేవాడు శత్రువు. అందువల్ల మిత్రుడు అన్నపదం ఉందంటే అతడు తప్పక సహాయం చేసిన వాడే అయిఉంటాడు. 'ఉచ్చైః' అనే పదం పర్వతం యొక్క ఔన్నత్యాన్ని గూర్చి చెప్తూన్నప్పటికీ ఒక ఉత్తమ వ్యక్తి యొక్క 'ఔన్నత్యం' అనే అర్థం గూడా వ్యంజితమౌతుంది. 'ఆమ్రకూట' ప్రాంతంలో ఆమ్ర వృక్షాలు అధికంగా ఉంటాయట. అందుచేత ఆ పర్వతానికి ఆ పేరు వచ్చిందని విమర్శకుల అభిప్రాయం.

ఈ శ్లోకంలో అర్థాంతర న్యాసాలంకారం ఉంది.

'మేఘుడు' ఆమ్రకూటం పై చేరినప్పుడు ఎలా ఉంటుందో కవి యక్షుని ఊహాచిత్రణ ద్వారా తెలియజేస్తున్నాడు.

ఛన్నోపాంతః పరిణతఫలద్యోతిభిః కాననామ్రై -
స్త్వయ్యారూఢే శిఖరమచలః స్నిగ్ధవేణీ సవర్ణే,
నూనం యాస్యత్యమర మిథునప్రేక్షణీయా మవస్థాం
మధ్యే శ్యామః స్తన ఇవ భువః శేషవిస్తారపాండుః. 18

ప్ర.అ.- పరిణతఫలద్యోతిభిః = చక్కగాపండిన మామిడిపళ్లతో కనిపించే, కాననామ్రైః = అడవిమామిళ్లతో, ఛన్నోపాంతః = అంతటా ఆవరించబడి ఉన్న, అచలః = ఆమ్రకూటపర్వతము, స్నిగ్ధవేణీ సవర్ణే = నిగనిగలాడే శిరోజాలము వంటి నలుపు

In Public domain. Digitization Muthulakshmi Research Academy

రంగుకల, త్వము = నీవు, శిఖరం = శిఖరాన్ని, ఆరూఢే = ఆక్రమించి ఉండగా, నూనం = నిక్కము, నిశ్చయంగా, మధ్యే శ్యామః = నడుమ నల్లని రంగుతో, శేషవిస్తారపాండు = మిగిలిన భాగమంతా పాండు వర్ణంతో (తెలుపుతో), భువః = భూదేవి యొక్క స్తనః ఇవ = స్తనము వలె, అమరమిథున = సురదంపతులకు, ప్రేక్షణీయాం = చూడదగిన, అవస్థాం = దశను, యాస్యతి = పొందగలదు.

తా:– చక్కగా పక్వానికి వచ్చిన ఆమ్రఫలాలతో నిండిన వృక్షాలు ఆమ్రకూటమంతా ఆవరించి ఉండగా, నీవు వెళ్లి ఆ పర్వతశిఖరాన్ని ఆక్రమించి ఉన్నపుడు, నిగనిగలాడే కేశపాశం వంటి నల్లని నీ మేనితో ఆ పర్వతం మధ్య నలుపుతోనూ మిగిలిన భాగమంతా తెలుపుతోనూ శోభించే భూదేవి యొక్క స్తనంలా ఉంటుంది. గగనమార్గాన సంచరించే సురదంపతులకు అది ఒక మనోహరదృశ్యంగా భాసిస్తుంది.

వి :– స్తనద్వయాన్ని పర్వతశిఖరాలతోనూ, కలశాలతోనూ పోల్చటం కవులకు పరిపాటి. అందుచేత కాళిదాస కవి ఇక్కడ ఒక అందమైన దృశ్యాన్ని మనకళ్ల ముందుంచాడు. అయితే భూదేవిని సమగ్రంగా వీక్షించటం మానవుల తరంకాదు. అది గగనసీమలలో తేలియాడే అమరులకే సాధ్యం. అందుచేత పై విధంగా వర్ణించాడు.

ఈ శ్లోకం కూడా 'ఉపమా కాళిదాసస్య' కు ఉదాహరణమే.

ప్రియాసందేశవ్యగ్రతతో ఉన్న యక్షుడు మేఘుణ్ణి ఎక్కడా ఎక్కువసేపు నిలవనీయటం లేదు. రాబోయే శ్లోకంలో నర్మదానది వద్దకు పంపిస్తున్నాడు.

స్థిత్వా తస్మిన్ వనచరవధూ భుక్తకుంజే ముహూర్తం
తోయోత్సర్గద్రుతతరగతి స్తత్పరం వర్త్మ తీర్ణః,
రేవాం ద్రక్ష్యస్యుపలవిషయే వింధ్యపాదే విశీర్ణాం
భక్తిచ్ఛేదైరివ విరచితాం భూతిమంగే గజస్య. **19**

ప్ర.అ.– వనచరవధూ = వనచరవనితల చేత, భుక్తకుంజే = అనుభవించబడిన పొదరిండ్లు గల, తస్మిన్ (ఆమ్రకూటే) = ఆ ఆమ్రకూట ప్రాంతంలో, ముహూర్తం స్థిత్వా = ముహూర్తకాలం ఉండి (కొంచెంసేపు విశ్రమించి), తోయోత్సర్గ = జలాన్ని కురిపించటం వలన, ద్రుతతరగతిః = తేలికపడినవాడవై వడివడిగా, తత్పరం = ఆ పర్వతం ఆవల, వర్త్మ = మార్గాన్ని, తీర్ణః = దాటినవాడవై, ఉపలవిషమే = రాళ్లతో కూడి ఎగుడు దిగుడుగా

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఉన్నట్టి, వింధ్యపాదే = వింధ్య పర్వత పాదాల వద్ద, విశీర్ణాం = చెల్లాచెదరైన, పాయలు పాయలుగా విడిపోయిన, రేవాం = నర్మదానదిని, గజస్య = ఏనుగు యొక్క, అంగే = శరీరమున, భక్తిచ్ఛేదైః = రచనా భంగిమల చేత (రంగు రంగుల డిజైన్లచేత), విరచితాం = చిత్రించబడిన, భూతిం ఇవ = అలంకరణను వలె, సింగారాన్ని వలె, ద్రక్ష్యసి = చూడగలవు.

తా. – వనచరవనితలు హాయిగా ఆనందించే పొదరిండ్లతో కూడిన ఆ ఆమ్రకూట పర్వత ప్రాంతంలో కొంతసేపు విశ్రమించుము. అక్కడ నీ యందు గల జలాన్ని వర్షించి తేలిక పడిన శరీరంతో శీఘ్రగతిని ప్రయాణాన్ని కొనసాగించు. అలా వెళ్లి ఆమ్రకూటానికి ఆవల ఉన్న మార్గాన్ని దాటి వెళ్లావంటే వింధ్యపర్వత ప్రాంతంలో నర్మదా నది నీకు కన్పిస్తుంది. ఆ వింధ్యపర్వత ప్రాంతం రాళ్లతో నిండి ఉండటమే గాక ఎత్తుపల్లాలతో కూడి ఉంటుంది. అందువలన అక్కడ నర్మదానది చెల్లాచెదరై ముందుకు సాగుతుంది. ఆ విడిపోయిన భాగాలతో ఉన్న ఆ నదీసోయగం రకరకాల రంగులతో ఏనుగు శరీరంపైన చిత్రించబడిన అలంకరణ సౌందర్యాన్ని పోలి ఉంటుంది. అలాంటి ఆ నదీసింగారాన్ని నీవు చూడగలవు.

వి:– ఏనుగు శరీరంపై (పట్టాభిషేకాది సమయాల్లో) అందంగా అలంకరణ చేస్తారు. పర్వత ప్రాంతంలోని నదుల అందాలే వేరు. అదీ రాళ్లు, రప్పలను తప్పించుకుంటూ ముందుకు సాగే నదీవయ్యారం మరింత చూడ ముచ్చటగా ఉంటుంది.

భౌగోళికంగా వింధ్యపర్వతానికి చాలా ప్రాధాన్యం ఉంది. ఆర్యావర్తము, దక్షిణాపథము ఈ రెంటినీ విభజించేది వింధ్యపర్వతమే. అంతేకాదు బాణునికి ప్రియతమమైనది వింధ్యాటవి. నర్మదానదినే 'రేవా' అని అంటారు. భారతదేశంలోని పవిత్రనదులలో ఇది ఒకటి.

ఈ శ్లోకంలో ఉపమా సౌందర్యం ఉట్టిపడుతుంది.

మేఘం వర్షించాలి. మళ్లీ నీటిని నింపుకోవాలి. లేకపోతే జలదుడు కాలేడు. అతని సంపత్తి జలమే. వర్షాకాలమేఘాలకున్న విలువ సాధారణమైన జలరహితమైన మేఘాలకు ఉండదు కదా! అదే విషయాన్ని యక్షుడు ఈ క్రింది శ్లోకంలో చెపుతున్నాడు.

తస్యాస్తిక్తైర్వనగజమదైర్వాసితం వాంతవృష్టి
Public Domain Digitization Muthulakshmi Research Academy
ర్జంబూకుంజ ప్రతిహతరయం తోయమాదాయ గచ్ఛేః
అంతః సారం ఘన! తులయితుం నానిలః శక్ష్యతి త్వాం
రిక్తః సర్వో భవతి హి లఘుః పూర్ణతా గౌరవాయ. 20

ప్ర.అ. – వాంతవృష్టిః = వర్షమును నీనుండి వెలువరించిన వాడై, తిక్తైః = కషాయ పరిమళములచేత (ఘాటైన వాసనల చేత), వన గజమదైః = అడవి ఏనుగుల మదజలము చేత, వాసితం = సువాసన కలిగినట్టి, జంబూకుంజ = నేరేడు వృక్షములచే, ప్రతిహతరయం = అడ్డుకొన బడిన వేగము కలిగినట్టి (వేగము అడ్డగించబడిన), తస్యాః = ఆ నర్మదానది యొక్క, తోయం = నీటిని, ఆదాయ = గ్రహించి, గచ్ఛేః = వెళ్లుము, ఘన = ఓ మేఘమా!, అంతఃసారం = లోపల సారమును (జలమును) కలిగిన, త్వాం = నిన్ను, అనిలః = వాయువు, తులయితుం = ఎగరకొట్టడానికి (త్రోయటానికి), న శక్ష్యతి = సమర్థము కాజాలదు, హి = ఎందుచేతననగా, రిక్తః = శూన్యుడు, ఏమీలేనివాడు, సర్వః = అందరూ, సర్వము, లఘుః = తేలికైనది (విలువలేనిది), భవతి = అగును, పూర్ణతా = నిండుదనము, గౌరవాయ = గౌరవమునకు, భవతి = తగును (అగును).

తా:– ఓ మేఘుడా! నీలోని జలమంతయు వర్షించిన పిదప నీవు రిక్తుడవు ఏమిలేని వాడవు అగుదువు. అందుచేత వనగజముల యొక్క కషాయ పరిమళ భరితమైన మదజలపరిమళములతో కూడినదియు, జంబూవృక్ష సముదాయముచేత అడ్డగించబడిన వేగము కలదియు ఐన ఆ నర్మదా నదీజలమును గ్రహించి (నీలో నింపుకొని) ప్రయాణమును కొనసాగించుము. జలపూర్ణుడవు అయిన నిన్ను ఇక వాయువు కదలించ జాలదు. ఎందుచేతననగా తన వద్ద ఏమి లేనివాడు ఎవడైనా తేలికగా చూడబడతాడు. వ్యక్తిలోని పరిపూర్ణత గౌరవానికి కారణమౌతుంది.

ఇక్కడ అర్థాంతరన్యాసాలంకారం కూర్చబడింది.

మేఘుడు నీటికణాలను (తుంపరలను, వర్షపు బిందువులను) రాలుస్తూ వెళ్తుంటే కురంగ, భృంగ మాతంగములు ఆనందించి ఆ మేఘుని ప్రయాణమార్గాన్ని తమ చేతలచే సూచిస్తున్నాయి అంటున్నాడు యక్షుడు.

నీపం దృష్ట్వా హరిత కపిశం కేసరై రర్ధరూఢై -
In Public domain. Digitization Muthulakshmi Research Academy
రావిర్భూత ప్రథమ ముకుళాః కన్దలీశ్చాను కచ్ఛం,
జగ్ధ్వారణ్యేష్వధికసురభిం గన్ధ మాఘ్రాయ చోర్వ్యాః
సారంగాస్తే జలలవముచః సూచయిష్యంతి మార్గమ్. 21

ప్ర.అ.- సారంగాః = తుమ్మెదలు, హరిణాలు, ఏనుగులు, అర్ధరూఢైః = సగము (కొంచెం) పెరిగిన, కేసరైః = కేసరముల చేత, హరిత కపిశం = ఆకుపచ్చ మరియు కపిశ వర్ణంలో ఉన్న, నీపం = కదంబవృక్షాన్ని, దృష్ట్వా = చూచి, అనుకచ్ఛం = తడిగా ఉన్న నేలను అనుసరించి, చ = మరియు, ఆవిర్భూత = బయలుపడిన (వెలికివచ్చిన), ప్రథమ ముకుళాః = మొదటి మొగ్గలు గల, కందళీః = నేల అరటితీగలను, జగ్ధ్వా = భక్షించి, అరణ్యేషు = అరణ్యములందు, అధికసురభిం = మిక్కిలి పరిమళాన్ని వెదజల్లే, ఉర్వ్యాః = భూమి యొక్క (నేలయొక్క), గంధం = వాసనను, ఆఘ్రాయ = ఆఘ్రాణించి, పీల్చి, జలలవముచః = నీటికణాల్ని వదిలే, చినుకులను కురిపించే, తే = నీ యొక్క మార్గం = మార్గాన్ని, సూచయిష్యంతి = సూచిస్తాయి.

తా :- తుమ్మెదలు, హరిణాలు, ఏనుగులు ఇవన్నీ వాటివాటికున్న విశేష శక్తిని బట్టి చరిస్తాయి. తొలకరి చినుకులకు సగం సగం బయలు వెడలిన కేసరాలతో కదంబ వృక్షం ఆకుపచ్చ, నారింజ వర్ణాల మిశ్రమంతో చూడముచ్చటగా ఉంది. నేల అరటి అప్పుడప్పుడే మొగ్గలు తొడుగుతోంది. చినుకులతో తడిసిన నేల, ఆర్ద్రంగా ఉంది. వీటిని చూసి తుమ్మెదలు, లేళ్లు, ఏనుగులు ఆనందిస్తున్నాయి. కదంబ పూల పరిమళాలు అరటిమొగ్గలు వీటన్నితో కలసిన ఒకానొక పరిమళం, దీనికి తోడు వర్షపు జల్లువలన నేలనుండి వెలువడే సుగంధం. వీటిని ఆఘ్రాణించిన సారంగాలు నీ యొక్క మార్గాన్ని సూచిస్తున్నాయి.

వి :- సారంగమనే పదానికి చాతకపక్షి, భృంగం (తుమ్మెద), హరిణం, ఏనుగు అని నాలుగు అర్థాలు ఉన్నాయి. వివిధ వ్యాఖ్యాతలు సోదాహరణంగా వీటిని గూర్చి వివరించారు. ఏది ఏమైనా అడవిలో జంతువులు, పక్షులు మొదలైనవి తొలకరిచినుకులకు ఆనందించాయన్నదే ఇక్కడ భావం.

మేఘము (వర్షాకాలము) దంపతులకు, ఎలా ఆనందాన్ని కూర్చుతుందో వర్ణిస్తున్నాడు యక్షుని మాటల్లో కవి కుల గురువు.

అమ్భో బిందు గ్రహణ చతురాంశ్చాతకాన్ వీక్ష్యమాణాః
In Public domain. Digitization Muthulakshmi Research Academy
శ్రేణీభూతాః పరిగణనయా నిర్దిశంతో బలాకాః,
త్వామాసాద్య స్తనితసమయే మానయిష్యంతి సిద్ధాః
సోత్కంఠాని ప్రియసహచరీ సంభ్రమాలింగితాని. 22

ప్ర.అ.- అమ్భః బిందుగ్రహణ = జల బిందువులను గ్రహించుట యందు, చతురాన్ = నేర్పరులైన, చాతకాన్ = చాతకపక్షులను, వీక్ష్యమాణాః = చూస్తున్నవారు, శ్రేణీభూతాః = బారులు తీర్చిన, బలాకాః = కొంగలను, పరిగణనయా = లెక్కిస్తూ, నిర్దిశంతః = చూపుతున్నవారు, సిద్ధాః = సిద్ధులు, స్తనిత సమయే = నీవు గర్జించినపుడు, సోత్కంఠాని = ఉద్వేగభరితములైన, ప్రియసహచరీ = ప్రియతమల యొక్క, సంభ్రమ = తత్తరపాటుచేత, ఆలింగితాని = కౌగిలింతలను, ఆసాద్య = పొంది, త్వాం = నిన్ను, మానయిష్యంతి = అభిమానించెదరు, అభినందించెదరు.

తా:- నీటిబిందువులను (వానచినుకులను) గ్రహించటంలో నేర్పరులైన చాతక పక్షులను చూస్తూ, ఆకాశంలో బారులు తీరిన కొంగలను ఒకటొకటిగా లెక్కపెట్టి ప్రియురాళ్లకు చూపిస్తూ నిలిచి ఉన్న సిద్ధులని వారి ప్రియతమలు నీవు ఉరిమినంతనే తత్తరపాటుతో కౌగిలించుకుంటారు. ఈ విధంగా ప్రియసహచరీసంభ్రమాలింగనలకు దోహదం చేసిన నిన్ను వారు మనసారా అభినందిస్తారు.

వి :- వర్షపు నీటి బిందువులను ఆకాశంలోనే గ్రహించి సేవిస్తాయి చాతకపక్షులు. అవి మేఘం రాల్చే జలబిందువులను మాత్రమే త్రాగుతాయి అని అంటారు. సిద్ధులు అనగా దివ్యత్వాన్ని సంపాదించుకున్నవారు. అంతేగాని సన్న్యాసులు కాదు. మేఘం ఉరిమినపుడు యువతులు బెదిరిపోవటం సహజం. అలా బెదిరిపోయిన సిద్ధాంగనలు చేరువనే ఉన్న తమ ప్రియులను తమంతట తామే (ప్రియులు కోరకుండానే) ఆలింగనం చేసుకుంటారు. ఇలాంటి అవకాశాన్ని తన గర్జన ద్వారా కలిగించిన మేఘుని పట్ల మరి వారికి అత్యంతాభిమానం ఏర్పడటంలో ఆశ్చర్యంలేదు.

అడుగడుగునా అభిమానించేవారు ఎదురైనప్పటికీ ఆలస్యం చేయకుండా వెళ్లి తన కార్యాన్ని సాధించమని యక్షుడు మేఘునికి ఇలా చెపుతున్నాడు.

ఉత్పశ్యామి ద్రుతమపి సఖే మత్ప్రియార్థం యియాసోః
In Public domain. Digitization Muthulakshmi Research Academy
కాలక్షేపం కకుభ సురభౌ పర్వతే పర్వతే తే,
శుక్లాపాంగైః సజలనయనైః స్వాగతీకృత్య కేకాః
ప్రత్యుద్యాతః కథమపి భవాన్గన్తు మాశు వ్యవస్యేత్. 23

ప్ర.అ.– సఖే! = ప్రియ సఖా! (మిత్రమా!), ద్రుతం = శీఘ్రంగా, తొందరగా, యియాసోః అపి = వెళ్లాలని నీకు ఉన్నప్పటికీ, తే = నీకు, కకుభసురభౌ = కొండమల్లె పరిమళంగల, పర్వతే పర్వతే = ప్రతికొండపైనా, కాలక్షేపం = కాలయాపనను, ఉత్పశ్యామి = ఊహిస్తున్నాను, సజలనయనైః = నీళ్లు నిండిన కళ్లతో (ఆనందబాష్పాలతో), శుక్ల అపాంగైః = తెల్లని కనుకొలకుల చేత, కేకాః = నెమళ్ల కేకారవములు, స్వాగతీకృత్య = స్వాగతవచనములుగా చేసి, ప్రతి ఉద్యాతః = ఎదుర్కొనబడినవాడవై (గౌరవంగా ఎదురు వెళ్లి స్వాగతం చెప్పబడినవాడవై), భవాన్ = నీవు (ఆదరపూర్వక సంబోధన), కథం అపి = ఎలాగో, ఆశు = వెంటనే, త్వరగా, గన్తుం = వెళ్లడానికి, వ్యవస్యేత్ = ప్రయత్నించాలి.

తా:– ఓ మిత్రమా! నాకు ఆనందాన్ని కలిగించాలనే ఆరాటంతో నీకు త్వరత్వరగా వెళ్లాలనే ఉంటుంది. అయినప్పటికీ అక్కడక్కడా విలంబం జరుగుతుందని నేనను కుంటున్నాను. దానికి కారణం అడుగడుగునా నీకు ఎదురయ్యే కొండమల్లెల పరిమళాల్ని నింపుకున్న గిరులు. అంతేకాక నిన్ను చూచిన ఆనందంలో నయనాలు ఆర్ద్రంకాగా తమ కేకారవాలనే స్వాగతవచనాలుగా నీకు ఎదురేగి స్వాగతం పలుకుతాయి వనమయూరాలు. అయినా ఎలాగో (వాటికి నచ్చజెప్పి) నీవు త్వరగా వెళ్లటానికి ప్రయత్నించాలి సుమా!

ఈ శ్లోకంలో 'కేకారవమే" 'స్వాగతవచనంగా' ఆరోపించబడటం చేత పరిణామాలంకారం.

రాబోయే శ్లోకంలో 'దశార్ణ' దేశవర్ణన ఉంది. ఒకే శ్లోకంలో ఆ దేశవైశిష్ట్యాన్ని పొదిగాడు మహాకవి కాళిదాసు.

పాండుచ్ఛాయోపవనవృతయః కేతకైః సూచిభిన్నై-
ర్నీడారమ్భైర్గృహ బలిభుజామాకులగ్రామ చైత్యాః,
త్వయ్యా సన్నే పరిణత ఫలశ్యామ జంబూ వనాంతాః
సంపత్స్యంతే కతిపయ దినస్థాయి హంసా దశార్ణాః. 24

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ.– హే మేఘ! = ఓ మేఘమా!, త్వయి = నీవు, ఆసన్నే(సతి) = చేరువకాగా, దశార్ణాః = దశార్ణదేశము (దేశాన్ని గూర్చి చెప్పేటప్పుడు బహువచనం వాడతారు), సూచిభిన్నైః = విడివడిన అగ్రభాగములతో, కేతకైః = మొగలిపూవులచేత, పాండుచ్ఛాయాం = పాండువర్ణము (కొంచెం పసుపువర్ణంతో కూడిన తెలుపు, రక్తహీనవర్ణం), ఉపవన = ఉపవనములతో, వృతయః = ఆవరించబడినవి, గృహబలిభుజాం = ఇళ్ల సమీపంలో తిరుగాడే కాకుల యొక్క, నీడ + ఆరంభైః = గూళ్లుకట్టడం ఆరంభించబడిన (కట్టబడుతున్న), ఆకులగ్రామచైత్యాః = వ్యాకులమైన (నిండి ఉన్న) (గ్రామములందలి చైత్యములు (కట్టడములు), పరిణతఫలశ్యామ = పక్వమైన పళ్లతో శ్యామవర్ణంలో కనిపించే, జంబూవనాంతాః = అల్లనేరేడు వృక్షములతో నున్న వనభాగాలు, కతిపయ దినస్థాయి హంసాః =హంసలు కొన్ని రోజులు ఉండే ప్రదేశాలు, సంపత్స్యంతే = అగుచున్నవి.

తా.– మిత్రమా! నీవు చేరువ అయ్యేటప్పటికి దశార్ణదేశపు సొగసే వేరు. మొగలిపూల అగ్రభాగాలు కొంచెం విచ్చుకోగా, ఆ మొగలిపూల పాండువర్ణంతో శోభించే వనాలు ఆ దేశం నిండా ఆవరించి ఉన్నాయి. గ్రామాల్లోని రాతికట్టడాలు వృక్షాలు అన్నీ కాకులు నిర్మించే గూళ్లతో నిండిపోయాయి. చక్కగా పక్వమైన నేరేడు పళ్లతో ఉన్న జంబూ వనాలతో దేశం కడు మనోహరంగా ఉంది. వీటన్నింటితోనూ విలసిల్లే దశార్ణదేశం హంసలు కొలదిరోజులు ఆవాసముండేందుకు అనుకూలంగా ఉంది.

వి :– బలిభుక్ = అన్నాన్ని భుజించే కాకి, చైత్యం = కట్టడం, వృక్షం, వనాంతః = వనము వెలుపల, వనముతో కూడిన, దశార్ణదేశమనగా పది దుర్గములు కల ప్రదేశము. ఇది ఈనాటి 'ఛత్తీస్‌గఢ్' అని విద్వాంసుల అభిప్రాయం. ఇక్కడ వింధ్య పర్వతమునుండి పుట్టిన దశార్ణమను నది ప్రవహించుచున్నది.

దశార్ణం తరువాత కవి విదిశా నగరాన్ని వర్ణిస్తున్నాడు. ఇది కూడా చారిత్రకంగా ప్రాధాన్యం కలదేశం. కావ్యాల్లో, తరచుగా ఈ నగర ప్రస్తావన వస్తుంది.

తేషాం దిక్షు ప్రథిత విదిశాలక్షణాం రాజధానీం
గత్వా సద్యః ఫలమవికలం కాముకత్వస్య లబ్ధ్వా,
తీరోపాన్తస్తనిత సుభగం పాస్యసి స్వాదు యత్త–
త్సభ్రూభంగం ముఖమివ పయో వేత్రవత్యాశ్చలోర్మి. 25

ప్ర.అ.- దిక్షు = దిశలందు, ప్రథిత = పేరుగన్న, ఖ్యాతి గాంచిన, విదిశాలక్షణాం = 'విదిశ' యను పేరుగల, తేషాం = దశార్ణజనపదముల యొక్క, రాజధానీం = రాజధానీ నగరమునకు, గత్వా = వెళ్లి, సద్యః = వెంటనే, కాముకత్వస్య = కాముకుని యొక్క శృంగార పురుషుని యొక్క అవికల ఫలం = మొక్కవోని ఫలితాన్ని, సంపూర్ణఫలాన్ని, లబ్ధ్వా = పొంది, యత్ = ఏదైతే, వేత్రవత్యాః = వేత్రవతీ నది యొక్క, స్వాదు = మధురమైన, యస్మాత్ = దేనినుండి ఐతే, చలోర్మిపయః = చలించే తరంగాల జలాన్ని, తత్ = దానిని, సభ్రూ భంగమ్ = కనుబొమల విన్యాసంతో కూడిన, ముఖం ఇవ = ముఖమును వలె, తీరోపాంత = తీరప్రాంతంలో, స్తనిత సుభగం = గర్జనతో విలాసమయంగా, పాస్యసి = త్రాగగలవు, ఆస్వాదించెదవు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

తా:- ఆ దశార్ణ దేశానికి రాజధాని దశదిశలా పేరుగాంచిన విదిశ అనే నగరము. నీవు ఆ నగరానికి వెళ్లుము. అక్కడికి వెళ్లినంతనే శృంగారపురుషుడవైన నీకు సంపూర్ణ ఫలము లభించును. అది ఏమిటంటే అక్కడ వేత్రవతీ నది ప్రవహిస్తుంది. చంచలంగా చలించే ఆ నదీ తరంగాల జలాన్ని సవిలాసంగా ఆస్వాదించి జలదగంభీరస్వనంతో నీవు ఆనందిస్తుంటే అది భ్రుకుటి విలాసాలతో కూడిన నాయికా ముఖసౌందర్య ఆస్వాదనంలా ఉంటుంది.

వి :- సహృదయుడైన నాయకుడు జలదుడు. సరస (నీటితో కూడిన) నాయిక వేత్రవతి. ఆ రసాస్వాదన పరవశంతో మధుర నిస్వనం మేఘునిది. చలించే తరంగాలు నాయిక కనుబొమల విన్యాసాలు. ఇంతకన్నా ఈ శృంగారఘట్టాన్ని వర్ణించటానికి సాధ్యంకాదు. ఇక్కడ సమాసోక్తి అలంకారం నదీ మేఘములందు నాయికా నాయకారోపం వలన. ఉత్ప్రేక్షాలంకారం - (సభ్రూభంగం ముఖమివ" అన్న వాక్యంలో). రెండింటికి అంగాంగి భావం వలన 'సంకర' అలంకారం.

తరువాత 'నీచైః' అను పేరుగల పర్వతాన్ని గూర్చి చెపుతున్నాడు.

నీచైరాఖ్యం గిరిమధివసేస్తత్ర విశ్రామహేతో-
స్త్వత్సంపర్కాత్పులకిత మివ ప్రౌఢపుష్పైః కదంబైః,
యః పణ్యస్త్రీ రతిపరిమలోద్గారిభి ర్నాగరాణా-
ముద్దామాని ప్రథయతి శిలావేశ్మభిర్యౌవనాని. **26**

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ.- తత్ర = అచట, విశ్రమహేతోః = విశ్రాంతి కొరకై, ప్రౌఢపుష్పైః = చక్కగా వికసించిన పూలతో గల, కదంబైః = కదంబ వృక్షములతో, త్వత్ సంపర్కాత్ = నీ సంపర్కము వలన, పులకితం ఇవ = పులకించినదా అన్నట్లున్న, నీచైః ఆఖ్యం = 'నీచై' (క్రిందున్నది) అను పేరుగల, గిరిం = కొండను, అధివసేః = ఆశ్రయించుము, యః = ఏ పర్వతమైతే, పణ్యస్త్రీ = గణికల యొక్క (వేశ్యలయొక్క), రతి పరిమల = శృంగార కేళి యందు అనుభవించబడిన సుగంధద్రవ్యముల సువాసనలను, ఉద్గారిభిః = వెలువరించునట్టి, శిలావేశ్మభిః= రాతిగుహలచేత, నాగరాణాం = నగరవాసుల యొక్క ఉద్దామాని = మిక్కుటమైన, అధికమైన, యౌవనాని = యౌవనములను, యుక్తవయస్సును, ప్రథయతి = ప్రకటించుచున్నదో.

తా:- వేత్రవతీ సరసముఖాస్వాదన చేసి అలసిన నీవు ఆ విదిశానగర సమీపంలోనున్న 'నీచైః' అను పేరుగల కొండపైన విశ్రమించుము. వికసించిన పూలతో నిండుగా ఉన్న కదంబవృక్షాలతో శోభించే ఆ పర్వతం నీ చేతిస్పర్శ సోకి పులకించినదా అనినట్లుంటుంది. ఆ పర్వతగుహలు ఆ నగరపౌరులకు, వేశ్యావనితలకూ శృంగారకేళీ మందిరాలు. ఆ యువతీయువకులుపయోగించే సుగంధద్రవ్యాల పరిమళం అక్కడ గుబాళిస్తూంటుంది. (ఆ పరిమళాలతో ఆ గుహలు వారి శృంగారకేళికి సాక్ష్యాలుగా ఉండి వారి యౌవనవిలాసాల్ని వివరిస్తున్నాయి అన్నట్లుగా ఉంది) ఆ పర్వతమే గుహల ద్వారా ఆ నాగరికుల, యువతుల, యౌవనాల్ని తెలుపుతున్నది.

వి :- రసాస్వాదన పరవశుడైన మేఘునికి విశ్రాంతి ఇచ్చే పర్వతం కూడా రసనిలయమే అని కవి వర్ణిస్తున్నాడు. కదంబవృక్షాలే పర్వతం యొక్క పులకాంకురాలు.

ఈ శ్లోకంలోని అలంకారం - 'ఉత్రేక్ష'.

❉ ❉ ❉ ❉ ❉

మేఘుణ్ణి విదిశానగర సమీపమునందలి 'నీచై' అనే పర్వతం పైన కొంతసేపు విశ్రమించి ముందుకు సాగమంటాడు యక్షుడు. సుదీర్ఘ ప్రయాణంలో మజిలీలు అవసరమని కాళిదాసు బహుశా అనుభవపూర్వకంగా గ్రహించి ఉంటాడు. అందమైన, ఆహ్లాదకరమైన ప్రదేశాలనే మేఘునికి విశ్రాంతి స్థానాలుగా చూపించాడు. ఈ వర్ణన ఆయా ప్రాంతాలలో లభ్యమయ్యే వన్యసంపదను గూర్చి కూడా తెలియజేస్తుంది. నదీ, నదాల గూర్చి ఇంక చెప్పనక్కరనే లేదు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మేఘుడు ఇంకా తన పయనాన్ని ఎలా సాగిస్తున్నాడో చూడాలి.

విశ్రాంతః సన్వ్రజ వననదీతీరజాతాని సిఞ్చ-
న్నుద్యానానాం నవజలకణైర్యూథికా జాలకాని,
గండస్వేదాపనయనరుజాక్లాంత కర్ణోత్పలానాం
ఛాయాదానాత్ క్షణ పరిచితః పుష్పలావీముఖానామ్. **27**

ప్ర.అ. - విశ్రాంతః సన్ = సేదదీరిన వాడనై, వననదీతీరజాతాని = అడవిలోని నదీ తీరములందు ఉద్భవించిన, ఉద్యానానాం = ఉద్యానవనముల యొక్క యూథికాజాలకాని = కొండమల్లి తీగలను, నవజలకణైః = క్రొత్త నీటికణాలతో, సిఞ్చన్ = తడుపుతూ, గండస్వేద = చెక్కిళ్లపై స్వేదజలాన్ని, అపనయన = తుడిచివేయటంలో, రుజా = ఒరిపిడి చేత, క్లాంత = కమిలి పోయిన, వాడిపోయిన, కర్ణోత్పలానాం = చెవులయందు కలువపూలు ధరించినట్టి, పుష్పలావీముఖానాం = పూలుకోసే పడతుల ముఖములకు, ఛాయాదానాత్ = నీడనిచ్చుటవలన, క్షణ పరిచితః = క్షణకాలము పరిచితుడవై, వ్రజ = వెళ్లుము.

తా:- విశ్రాంతిని పొంది సేదదీరిన పిదప నీవు ఆ వనాల్లోని నదీ తీరాల్లో పెరిగిన గిరిమల్లికల తీగలను నీ క్రొత్త నీటితో తడుపుతూ ముందుకు సాగుము. అక్కడ పుష్పలావికలు (పూలు కోసి మాలలు కట్టి విక్రయించేవారు) గ్రీష్మతాపంతో చెక్కిళ్లపై అంకురించే స్వేద జలాన్ని మాటిమాటికీ తుడుచుకోవటం చేత ఆ ఒత్తిడిలో వారు చెవి ప్రక్కగా అలంకారంగా ధరించిన కలువలు కూడా మ్లానమై పోయాయి. అలసిన ఆ యువతుల ముఖాలకు నీడనిచ్చి ఒక్క క్షణంవారికి పరిచితుడవై ముందుకు సాగిపో.

ఈ శ్లోకంలో 'సమాసోక్తి' అలంకారం.

ఉజ్జయినీ నగర వర్ణన

In Public domain. Digitization Muthulakshmi Research Academy

రాబోయే శ్లోకం ఉజ్జయినీ నగరాన్ని గూర్చి వర్ణిస్తుంది. ఇక్కడనుండి 42వ శ్లోకం వరకు ఉజ్జయినీ వర్ణనమే. నిజానికి ఉజ్జయినీ నగరం రామగిరి-కైలాసగిరుల మధ్య మార్గంలో రాదు. అయినప్పటికీ ఉజ్జయినీ నగరాన్ని చూచే వెళ్లాలి అని యక్షుని చేత మేఘునకు చెప్పిస్తాడు కాళిదాసు. ఈ సందర్భాన్ని బట్టే కాళిదాసు ఉజ్జయినికి చెందినవాడన్న బలీయమైన అభిప్రాయం ఉంది. ఏది ఏమైనా 'మేఘసందేశం'లో ప్రాధాన్యాన్ని కలిగి ఉన్న ఘట్టం ఉజ్జయినీ నగర వర్ణనం.

వక్రః పన్థా యదపి భవతః ప్రస్థిత స్యోత్తరాశాం
సౌధోత్సంగ ప్రణయవిముఖో మా స్మభూరుజ్జయిన్యాః,
విద్యుద్దామ స్ఫురిత చకితై ర్యత్ర పౌరాంగనానాం
లోలా పాంగైర్యది న రమసే లోచనైర్వంచితస్యాః. **28**

ప్ర.అ.- ఉత్తర ఆశాం = ఉత్తరదిక్కునకు, ప్రస్థితస్య = బయలుదేరిన (వెళ్లవలసి ఉన్న), భవతః = నీకు, పన్థా = మార్గము, వక్రః యత్ అపి = ఇంచుక చుట్టూ తిరిగి ఉన్నప్పటికీ, ఉజ్జయిన్యాః = ఉజ్జయినీ నగరం యొక్క, సౌధ ఉత్సంగ = సౌధముల అగ్రభాగముల, ప్రణయవిముఖః = మైత్రీ విముఖుడవు, మా స్మభూః = కాబోకుము, యత్ర = ఎచ్చటైతే, విద్యుద్దామ = మెరుపుతీగల వలన, స్ఫురిత చకితైః = ఉలికిపాటుతో చకితములైన (విప్పార్చుకున్న), పౌరాంగనానాం = పురవనితల యొక్క, లోలాపాంగైః = చంచలములగు కటాక్షవీక్షణములతో, లోచనైః = కనులతో, న రమసే = ఆనందించక పోయినచో, వంచితః స్యాః = వంచితుడవు అగుదువు.

తా: - ఉత్తరదిక్కుగా వెళ్లాల్సి ఉన్న నీకు ఉజ్జయినీ నగరానికి వెళ్లటం చుట్టూ తిరిగి వెళ్లటమే అయినప్పటికీ, ఆ నగరంలోని అందమైన ప్రాసాదాగ్రాలతో ప్రణయ పూర్వకంగా వ్యవహరించకుండా నీవు వెళ్లకూడదు. ఎందుచేతనంటే ఆ నగరంలోని యువతులు నీ మెరుపులను చూసి, చకితులై కళ్లు విప్పార్చుకుని నీకేసి చూస్తారు. వారికళ్లలోని మెరుపులనూ, చంచలములైన ఆ వాలుచూపులనూ (కటాక్షవీక్షణాలను) చూసి ఆనందించలేకపోతే నీవు వంచితుడవు అవుతావు. కనులుండీ సౌందర్యం చూడలేక పోతే ఆ చూపులు నిరర్థకాలు. ఆ వ్యక్తి కనులుండీ లేనివాడే.

ఇందులో అలంకారము వాచ్యంగా చెప్పబడలేదు. 'వినోక్తి' అలంకారం ఇచట వ్యంగ్యం. In Public domain. Digitization Muthulakshmi Research Academy

రాబోయే శ్లోకంలో నిర్వింధ్యా నదిని వర్ణిస్తున్నాడు. వింధ్య పర్వతమున ప్రభవించిన ఈ నది ఉత్తరదిశగా ప్రవహిస్తుంది. ఈ నదికి తూర్పుదిక్కున శిప్రానదీతీరంలో అవంతీదేశ రాజధాని ఉజ్జయిని ఉన్నది. మేఘుడు పయనించాల్సిన మార్గం నిర్వింధ్యకు కొంచెం పశ్చిమ దిశలో ఉంటుంది. అందుచేత ఉజ్జయినీ సందర్శనం మేఘునికి చుట్టూ తిరగటమే (వక్రః పంథా) అయినా చూడదగిన ప్రదేశం. కాబట్టి యక్షుడు మేఘునితో తప్పకుండా వెళ్లమని చెప్పాడు. ఈ సందర్భంలో తన కార్యానికి ఆలస్యమైనా మిత్రుని ఆనందాన్ని కోరే ఒక ఆత్మీయహృదయం యక్షునిది అని స్పష్టమౌతుంది. కాళిదాస మహాకవి ఏం చెప్పదల్చుకున్నాడో సహృదయహృదయాలకే అవగతమౌతుంది. కేవలం శృంగారమేకాదు యీ కావ్యంలో అతడు పొదిగినది, ఎన్నో మానవత్వపు విలువల పరిమళాల్ని నింపాడు.

వీచిక్షోభస్తనిత విహగ శ్రేణికాంచీ గుణాయాః
సంసర్పంత్యాః స్ఖలితసుభగం దర్శితావర్తనాభేః,
నిర్వింధ్యాయాః పథిభవద్రసాభ్యంతరః సన్నిపత్య
స్త్రీణామాద్యం ప్రణయవచనం విభ్రమో హి ప్రియేషు. 29

ప్ర.అ.- పథి = ఉజ్జయినికి వెళ్ళేమార్గమునందు, వీచిక్షోభ = తరంగముల కల్లోలముచే, స్తనిత = ధ్వనిచేయబడే, విహగశ్రేణి = పక్షుల పంక్తులనెడి, కాంచీగుణాయాః = మేఖలగా (నడుమున అలంకరించుకునే గొలుసులా) కలిగిన, స్ఖలిత సుభగం = తొట్రుపాటుతో అందంగా, సంసర్పంత్యాః = ముందుకు సాగే, దర్శితావర్తనాభేః = నీటిసుడుల రూపంలో నాభిని ప్రదర్శించే, నిర్వింధ్యాయాః = నిర్వింధ్య యొక్క, సన్నిపత్య = సన్నిధిని చేరి, రసాభ్యంతరః భవ = రసాస్వాదుడవు (రసమును నింపుకున్న వాడవు) కమ్ము, స్త్రీణాం = అతివలకు, ప్రియేషు = ప్రియుల పట్ల, విభ్రమః = వయ్యారమే, ఆద్యం = మొదటి, ప్రణయవచనం హి = ప్రేమాలాపములు.

తా:- ఎగసిపడే తరంగాల కల్లోలం చేత ధ్వనులు చేసే పక్షుల పంక్తులే కటిసూత్రంగా కలిగిన నిర్వింధ్య అందంగా తడబడుతూ, నీటిసుడులే నాభిగా ప్రదర్శింప చేస్తూ ముందుకు సాగుతుంది. అలా హొయలు కురిపించే ఆమె సన్నిధిని చేరి (శృంగార)

In Public domain. Digitization Muthulakshmi Research Academy

రసభరిత [illegible] టమే ప్రియతమల మొదటి ప్రణయాలాపం కదా!

వి :- 'విప్రలంభశృంగారం' ప్రధానరసమైన ఈ కావ్యంలో కవికుల గురువు అణువణువునా సంభోగశృంగారాన్నే నింపాడు. 'ద్రాక్షాపాకం' ఆయన శైలి. ముట్టుకుంటే రసం చిప్పిలుతుంది. మేఘుడు నాయకుడు, నది నాయిక. పరస్పరం రసాన్ని ఇచ్చి పుచుకుంటారు. 'మేఘం' నదులనుండి జలాన్ని గ్రహిస్తుంది. వాటిపైనే కురిపిస్తుంది కూడా. ఈ భౌగోళిక సత్యాన్ని నాయికానాయక శృంగారవిలాసంగా అందించాడు కవి.

నాయికల మువ్వల వడ్డాణాలు గలగలాడతాయి. ఇక్కడ పక్షుల పంక్తులు వడ్డాణం. వాటి కిలకిలలే గలగలలు. ప్రియుణ్ణి చూడగానే ప్రేయసి నోటమాటరాదు. అయినా ప్రణయం అణువణువునా తొంగిచూస్తుంది. వయ్యారంగా అడుగులు వేస్తుంది. శరీరపు వంపుసొంపుల్ని దాచీదాచకుండా చూపిస్తుంది. ఈ లక్షణాలని 'అలంకారశాస్త్ర' గ్రంథాల్లో నాయికల 'అనురాగేంగితాలు' అని వర్ణిస్తారు. ఆ విధంగా నిర్వింధ్యను రూపుదాల్చిన నాయికగానూ, మేఘుణ్ణి నాయకుడుగానూ చిత్రించాడు మహాకవి. మనసారా కోరే ప్రేయసిని నిరాదరణ చేయరాదని సూచించాడు.

ఈ శ్లోకంలో శ్లేష, రూపకం మరియు అర్థాంతరన్యాసాలంకారాలున్నాయి. నిర్వింధ్య విరహవేదనతో కృశించిపోయి ఉన్నది. ఆమెకు సౌష్ఠవాన్ని చేకూర్చటం నీ బాధ్యత సుమా అంటున్నాడు యక్షుడు రాబోయే శ్లోకంలో.

వేణీభూతప్రతను సలిలా సాత్వతీతస్య సింధుః
పాండుచ్ఛాయా తటరుహతరుభ్రంశిభిర్జీర్ణపర్ణైః,
సౌభాగ్యం తే సుభగ విరహావస్థయా వ్యంజయంతీ
కార్శ్యం యేన త్యజతి విధినా స త్వయైవోపపాద్యః. 30

ప్ర.అ.- వేణీభూత = ఒక పాయగా మారిన, ప్రతను సలిలా = తరిగిపోయిన జలముకలది, తటరుహతరు భ్రంశిభిః = ఒడ్డున పెరిగిన చెట్ల నుండి రాలిపడే, జీర్ణపర్ణైః = పండుటాకులతో, పాండుచ్ఛాయా = పాలిపోయిన వర్ణము కలది, సుభగ = ఓ సౌభాగ్యాశాలీ, విరహావస్థయా = తన విరహావస్థ చేత, అతీతస్య = దేశాంతరగతుడవైన, తే = నీ యొక్క, సౌభాగ్యం = అదృష్టాన్ని, భాగ్యాన్ని, వ్యంజయంతీ = సూచిస్తూన్న, సా = ఆ నిర్వింధ్య, యేనవిధినా = ఏ విధంగా, కార్శ్యం = కృశించుటను, త్యజతి =

విడిచివేయునో, సః = ఆ ఉపాయము, త్వయా ఏవ = నీచేత, ఉపపాద్యః = కనుగొనబడ వలసిఉన్నది.

Public domain. Digitization Muthulakshmi Research Academy

తా:– మేఘుడా! నీవు భాగ్యశాలివి, ఎందుచేతననగా దేశాంతరమున ఉన్న నీపట్ల కల అనురాగాతిశయం చేత ఈ 'నిర్వింధ్య' చిక్కిపోయి ఒకే ఒకపాయగా మిగిలిఉన్నది. తీరాన ఉన్న చెట్లనుండి రాలిపడే పండుటాకులతో ఈమెకు కలిగిన పాండు వర్ణం ఈమె విరహావస్థను తెలియజేస్తుంది. ఇలా విరహవేదనలో కృశించిన ఈమెకు సౌష్ఠవం చేకూరే మార్గం ఏదో నీవే కనుగొనాలి.

వి:– విరహవేదన శరీరం కృశత్వాన్ని వర్ణహీనతను పొందటానికి దారితీస్తుంది. 'ప్రోషితభర్తృక' లక్షణాలు ఇవి. అయితే ఇవి అనురాగవతులైన యువతులలో మాత్రమే ఉంటాయి. ఆ విధంగా తనకై తపించి, కృశించే ప్రియురాలు ఉండటం మేఘునికి సౌభాగ్యవశం చేతనే కదా కల్గింది. అలాంటి 'అనురాగమయి' యొక్క ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత కూడా అతనిదే. ఆమెను చేరి తన అనురాగరసంతో ఆమెకు పుష్టిని చేకూర్చాల్సిందే.

ఇక్కడ అలంకారం – సమాసోక్తి.

ఉజ్జయినీ నగరవైభవ వర్ణనం :–

ప్రాప్యావంతీనుదయన కథాకోవిద గ్రామవృద్ధాన్
పూర్వోద్దిష్టామనుసర పురీం శ్రీవిశాలాం విశాలాం,
స్వల్పీభూతే సుచరితఫలే స్వర్గిణాం గాం గతానాం
శేషైః పుణ్యైర్హృతమివ దివః కాంతిమత్ఖండమేకమ్. 31

ప్ర.అ.– ఉదయన = ఉదయనుడను రాజును గూర్చిన, కథాకోవిద = కథలను చెప్పుటలో నేర్పరులైన, గ్రామవృద్ధాన్ = గ్రామవృద్ధులుగల, అవంతీన్ = అవంతీదేశాన్ని, ప్రాప్య = చేరి, పూర్వోద్దిష్టాం = ఇంతకుమునుపే చెప్పిన, శ్రీవిశాలాం = లక్ష్మీ సంపన్నమైన, విశాలాం = ఉజ్జయినీ అనుపేరుగల, పురీం = నగరాన్ని, అనుసర = అనుసరించుము (వెళ్లుము), సుచరితఫలే = సుకృతఫలము, పుణ్యఫలము, స్వల్పీ భూతే = తగ్గిపోగా (క్షీణించగా), గాం = భూలోకాన్ని, గతానాం = చేరిన, స్వర్గిణాం = దేవతల యొక్క శేషైః పుణ్యైః = మిగిలిన పుణ్యఫలము చేత, హృతం = తీసికొనిరాబడిన, కాంతిమత్ =

In Public domain. Digitization Muthulakshmi Research Academy

కాంతివంతమైన, ఏకం = ఒకానొక, దివః ఖండమ్ ఇవ = స్వర్గలోకపు తునక (ముక్కవలె ఉన్నది)

తా: – వత్సరాజగు ఉదయనుని గూర్చి అత్యంతాసక్తిదాయకంగా కథలు చెప్పే గ్రామవృద్ధులుగల అవంతీదేశానికి చేరి, ఇంతకు ముందు నీకు వివరించిన ఉజ్జయినీ నగరం వైపు వెళ్లుము. ఆ నగరం పేరుకు మాత్రమే విశాలం కాదు. లక్ష్మీ సంపదకూడా అచట విశాలంగానే ఉంది. ఆ ఉజ్జయినీ నగరవైశిష్ట్యం చెప్పాలంటే, పుణ్యఫలం క్షీణించగా స్వర్గలోకవాసులు భూలోకానికి వచ్చేటపుడు తమ యొక్క శేషఫలవిశేషం వలన తమతో బాటుగా తీసుకు వచ్చిన కాంతివంతమైన స్వర్గలోకపు ఒక ఖండంలా (భాగంలా) ఉంది.

వి :– సంస్కృతసాహిత్యంలో ఉదయనునికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇతడు ధీరలలిత నాయకుడు. సుకుమారహృదయుడు. కళాపిపాసి, కళాకోవిదుడు. అనురాగమూర్తి. ఇతని ప్రణయగాథలు మనోరంజకంగా ఉంటాయి. ఎన్నో రూపకాలు ఇతని చరిత్రను చిత్రించాయి. కాళిదాసుకు కూడా ఇతని పాత్ర పట్ల ఆదరం ఉంది. అవంతీరాకుమారి ఉదయనుని ప్రేయసి. అందుచేత అవంతీనగరంలో ఉదయన, వాసవదత్తల ప్రణయగాథలు వినిపిస్తూంటాయి.

మానవులు పుణ్యఫలం చేత స్వర్గానికి వెళతారు. స్వర్గవాసులు పుణ్యం క్షీణిస్తే భూలోకానికి రావాల్సిందే. అలాపుణ్యం తరిగిన స్వర్గవాసులు భూలోకానికి వస్తూ తాము ఉండటానికి గాను తెచ్చుకున్న స్వర్గఖండంలా ఉందట ఉజ్జయినీ నగరం. 'విశాల' అనేది ఉజ్జయినీ నగరానికి మరో పేరు.

ఉజ్జయినీ నగరం సిప్రా (శిప్రా) నదీ తీరంలో ఉంది. అందుచేత రాబోయే శ్లోకంలో ఆ నది వర్ణించబడింది.

దీర్ఘీ కుర్వన్ పటుమదకలం కూజితం సారసానాం
ప్రత్యూషేషు స్ఫుటిత కమలామోదమైత్రీకషాయః,
యత్ర స్త్రీణాం హరతి సురతగ్లానిమంగానుకూలః
శిప్రావాతః ప్రియతమ ఇవ ప్రార్థనా చాటుకారః. **32**

ప్ర.అ. - యత్ర = ఏ ఉజ్జయినీ నగరమునందు, ప్రత్యూషేషు = ప్రభాత సమయాల్లో, పటు మదికలం = మదాధిక్యత వలన మధురంగా, సారసానాం = సారసపక్షుల యొక్క, కూజితం = కూజితాన్ని, దీర్ఘీకుర్వన్ = పొడిగిస్తూ, స్ఫుటిత = బాగుగా విచ్చుకున్న, కమలామోద = అరవిందాల పరిమళం చేత, మైత్రీకషాయః = కలయిక చేత సుగంధితమైన, అంగాను కూలః = అంగాలకు (శరీరానికి) హాయిని గూర్చే, శిప్రావాతః = శిప్రానది మీదుగా వచ్చే గాలి, ప్రార్థనా చాటుకారః = ప్రియమైన మాటలతో వేడుకొనే (తీయని మాటలతో బ్రతిమాలుకునే), ప్రియతమః ఇవ = ప్రియతముని వలె, స్త్రీణాం = పడతుల యొక్క సురతగ్లానిం = శృంగారకేళి వలన కలిగిన అలసటను, హరతి = తొలగించును, పోగొట్టును.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

తా.- ఉజ్జయినీ నగరం శిప్రానదీ తీరంలో ఉంది. ఆ నది మీదుగా వీచే వాయువులు సుగంధభరితాలు, ఆనందదాయకాలు. ఆ శిప్రావాయువు మధురపరిమళాన్ని మోసికొని వస్తూంటే నదిలోని సారసపక్షులు కూడా మత్తుగా, తీయగా కూస్తూనే ఉన్నాయి. పూర్తిగా వికసించిన తామరలలోని సుగంధాన్ని తనలో నింపుకొని వీచే ఆ వాయువు, శృంగారకేళిలో అలసిన యువతులకు సుఖస్పర్శను అందిస్తూ వారి శరీరాలకు హాయి కూరుస్తూ, ప్రియమైన సరససల్లాపాలతో ప్రియతమల దరిజేరి వారి సురతగ్లానిని పోగేట్టే ప్రియునిలా ఉంది.

వి :- ఈ శ్లోకంలో సంభోగశృంగారం వర్ణించబడింది. రేయంతా అలసిన యువతులు ప్రభాతసమయాన ప్రియులకు అనుకూలంగా ఉండలేరు. వారి అలసట తొలగితేనే కాని వారు ప్రియతముల కోరికను మన్నించలేరు. అందుచేత శృంగార నాయకులు వారిని ప్రసన్నులను చేసుకొనటానికై ఎన్నో ప్రియాలాపాలు, మధురమైన చేతలు చేస్తారు. ఈ శిప్రావాయువు కూడా అలాగే చేస్తూంది అని కవి చిత్రణ.

ఇక్కడ "పూర్ణోపమ" అలంకారం.

రాబోయే శ్లోకంలో విశాలనగరంలో విపణి వీధి యొక్క ప్రాశస్త్యాన్ని వర్ణిస్తున్నాడు.

హారాంస్తారాంస్తరళగుటికాన్కోటిశః శఙ్ఖశుక్తీః
ఘాసశ్యామాన్మరకతమణీన్మయూఖ ప్రరోహాన్,
దృష్ట్వా యస్యాం విపణిరచితాన్విద్రుమాణాంచ భంగాన్
సంలక్ష్యంతే సలిలనిధయస్తోయమాత్రావశేషాః. 33

In Public domain: Digitization Muthulakshmi Research Academy

ప్ర. [illegible] విపణివీథి యందైతే (వర్తకవాడలోనైతే), కోటిశః = కోట్లకొలది, విపణిరచితాన్ = ఆపణముల (దుకాణముల)ందు అమర్చబడినట్టి, తారాన్ = మెరిసిపోయే, తరళగుటికాన్ = తరళమైన మణులుగల, హారాన్ = ముత్యాలహారాలను, శజ్ఞ శుక్తీః = ముత్యపుచిప్పలను, శంఖములను, ఘాసశ్యామాన్ = పచ్చగడ్డి పరకల వలె శ్యామవర్ణముగల (ముదురాకుపచ్చ), ఉన్మయూఖ ప్రరోహాన్ = పైకి కాంతి కిరణములను వెదజల్లునట్టి, మరకతమణీన్ = గరుడ పచ్చలను, విద్రుమాణాం ఖండాన్ = పగడపు ముక్కలను, దృష్ట్వా = చూచి, సలిలనిధయః = జలనిధులు (సాగరములు), తోయమాత్ర అవశేషాః = కేవలం నీటిని మాత్రమే కలిగియున్నట్లు, సంలక్ష్యంతే = కనిపించుచున్నవి.

తా:- ఉజ్జయినీనగర వర్తకవాడలో ఆపణములందు అమర్చబడిన అమూల్య వస్తువులు ఇలా ఉన్నాయి- కోట్లకొలది అనర్ఘమైన మిలమిలమెరిసిపోయే మణులు మధ్యలో కూర్చబడిన స్వచ్ఛమైన ముత్యాల హారాలు, పచ్చగడ్డి వలె ఆకుపచ్చరంగులో మెరిసిపోతూ కిరణకాంతులను వెదజల్లే మరకతమణులు, మంచి పగడపు ముక్కలు (ముక్కలుగా చిన్నవిగా ఖండించబడిన పగడాలు) అక్కడ అంగళ్లలో ఉన్నాయి. అక్కడ ఉన్న రత్నరాసులను చూస్తే రత్నాకరాలు అని పిలువబడే సాగరాల్లోని రత్నాలన్నీ తీసికొని రాబడినట్లూ, ఆ సాగరాలలో కేవలం జలాలు మాత్రమే మిగిలినట్లూ తోస్తూంది.

కృష్ణరాయల కాలాన్ని గూర్చి వర్ణిస్తూ 'అంగళ్ల రతనాలు అమ్మినారట ఇచట' అని చెపుతూంటారు. భోజరాజు పరిపాలించిన ఉజ్జయినీ వైభవం ఇంతా అంతాకాదు. ఎంతో ధనవంతులు ఉంటేనేగానీ రత్నాల అంగళ్లు నిలవవు. ఈ రత్న సమృద్ధి నాగరికుల (నగరవాసుల) ఐశ్వర్యాన్ని తెలియజేస్తూంది.

అమూల్య సంపత్తివర్ణనచే ఇచట 'ఉదాత్తాలంకారం'.

'ఉదయన కథాకోవిదులు' అని ఇంతకు మునుపు వర్ణించాడు కాబట్టి ఇపుడా 'ఉదయన కథ' యొక్క సంక్షిప్త పరిచయం ఇవ్వబోతున్నాడు కవి యక్షుని మాటల్లో.

ప్రద్యోతస్య ప్రియదుహితరం వత్సరాజోఽత్ర జహ్రే
హైమం తాలద్రుమవనమభూదత్ర తస్యైవ రాజ్ఞః,
అత్రోద్భ్రాంతః కిల నలగిరిః స్తంభముత్పాట్యదర్పా-
దిత్యాగన్తూ న్రమయతిజనో యత్ర బన్ధూనభిజ్ఞః. 34

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ.- అత్ర = ఈ ఉజ్జయిని యందు, వత్సరాజః = వత్సదేశానికి రాజైన ఉదయనుడు, ప్రద్యోతస్య = ఉజ్జయినీ రాజైన ప్రద్యోతుని యొక్క, ప్రియదుహితరం = ప్రియపుత్రిక వాసవదత్తను, జహ్రే = తీసికొని వెళ్లెను. అత్ర = ఇక్కడ, తస్య ఏవ రాజ్ఞః = ఆ రాజు యొక్క (అతనిదే), హైమం = బంగారు వర్ణం గల, తాలవనం = తాళ (తాటి) వృక్షాలవనం, అభూత్ = ఉండినది, అత్ర = అదేచోట, నలగిరిః = నలగిరి అను పట్టపుటేనుగు, దర్పాత్ = మదము వలన, స్తంభం = స్తంభాన్ని (కట్టుకొయ్యను), ఉత్పాట్య = పెకలించుకొని, ఉద్భ్రాంతః కిల = చెదిరి విశృంఖలంగా తిరుగాడిందట, ఇతి = అని, అభిజ్ఞః = ఈ విషయాలను గూర్చి తెలిసిన, జనః = జనుడు (గ్రామంలోని వృద్ధుడు), ఆగంతూన్ = క్రొత్తగా ఆ నగరమునకు వచ్చినవారిని, బన్ధూన్ = బంధువులను, యత్ర = ఎచటైతే, రమయతి = రంజింపజేయునో.

తా.- ఉదయన కథావిశేషాలను చక్కగా ఎరిగి ఉన్న నగరవాసి తన ఇంటికి విచ్చేసిన బంధువులకు ఆ కథను చెప్పి రంజింపజేస్తాడు. ఆ విశేషాలు ఇలా ఉన్నాయి. ఈ ఉజ్జయినీ నగరానికి ప్రద్యోతుడను నతడు రాజుగా ఉండేవాడు. అతని ప్రియపుత్రిక 'వాసవదత్త'. ఆమెను పొరుగునే ఉన్న వత్సదేశపురాజైన ఉదయనుడు (రాజుకు తెలియకుండా) తీసికొని వెళ్లిపోయాడు. ప్రద్యోతుని రాజ్యంలో ఒక చక్కని 'తాలవనం' ఉండేది. అది బంగారురంగులో ఉండేది (నిండా పళ్లతో ఉండటం వలన). ఇక్కడే 'నలగిరి' అనే పట్టపుటేనుగు మదమత్తయై ఆలానస్తంభాన్ని ఊడబెరికి, నగరవీధులలో సంచరించినదట.

వి :- ఈ విధంగా గడచిన వృత్తాంతాన్ని కనులకు కట్టినట్లుగా చెప్పటం చేత ఇక్కడ 'భావికాలంకారం'.

రాజుయొక్క గజాశ్వబలాలని కూడా యక్షుడు వర్ణిస్తున్నాడు.

పత్రశ్యామా దినకరహయ స్పర్ధినో యత్ర వాహాః
శైలోదగ్రాస్త్వమివ కరిణో వృష్టిమంతః ప్రభేదాత్,
యోధాగ్రణ్యః ప్రతిదశముఖం సంయుగే తస్థివాంసః
ప్రత్యాదిష్టా భరణరుచయశ్చంద్రహాస వ్రణాంకైః **35**

ప్ర.అ.- యత్ర = ఎచటైతే, వాహాః = అశ్వములు, పత్రశ్యామాః = ఆకుల వలె పచ్చనైన, దినకరహయస్పర్ధినః = సూర్యుని గుర్రాలతో పోటీపడేవి, శైలోదగ్రాః = పర్వతాల

In Public Domain - Digitization Muthulakshmi Research Academy

వలె ఉన్నతమైన, [illegible], ప్రభూతే = [illegible], త్వం ఇవ = నీ వలెనే, వృష్టిమంతః = వర్షించునవి, యోధ అగ్రణ్యః = యోధాగ్రేసరులు, సంయుగే = యుద్ధరంగమున, ప్రతిదశముఖం = రావణుని కభిముఖముగా, తస్థివాంసః = నిలిచినవారు, చంద్రహాస = చంద్రహాసమనే ఖడ్గము యొక్క వ్రణాంకైః = గాయముల గుర్తుల చేత, ప్రత్యాదిష్ట = నిరాకరించిన, ఆభరణరుచయః = అభరణకాంతులు గలవారు.

తా.– అచటి అశ్వాలు చక్కటివర్ణంతో మిసమిసలాడుతూ ఉంటాయి. వేగంలో సూర్యుని అశ్వాలతో పోటీ పడుతుంటాయి. ఇక ఏనుగల సంగతి సరేసరి. అవి నీలాగే ఉన్నతంగా ఉంటాయి. నీవు జలధారలు వర్షిస్తే, అవి వాటి కుంభస్థలాలనుండి మద జలధారలను కురిపిస్తాయి. అక్కడి యోధాగ్రేసరులు రావణసేననే ఎదిరించినవారు. రావణఖడ్గం అయిన చంద్రహాసం చేత వారి శరీరాలపై ఏర్పడిన గాయాల గుర్తులే వారి వీరత్వానికి చిహ్నాలు. ఆ చిహ్నాలే వారికి శోభనిచ్చే అభరణాలు. ఇతరమైన ఆభరణాలు వారికి అవసరం లేదు.

33, 34, 35 ఈ మూడు శ్లోకాలూ ప్రక్షిప్తాలు (ఎవరో చేర్చినవి) అని మల్లినాథుని అభిప్రాయం అయినప్పటికీ ఆయన వీటికి వ్యాఖ్యను కూర్చారు.

ఉజ్జయినీనగరంలోని భవనాల సౌందర్యాన్ని వర్ణిస్తున్నాడు.

జాలోద్గీర్ణైరుపచితవపుః కేశసంస్కార ధూపై –
ర్బంధుప్రీత్యా భవన శిఖిభిర్దత్తనృత్యోపహారః,
హర్మ్యేష్వస్యాః కుసుమసురభిష్వధ్వఖేదం నయేథా
లక్ష్మీంపశ్యన్ లలిత వనితా పాదరాగాంకితేషు. **36**

ప్ర.అ. – జాలోద్గీర్ణైః = గవాక్షజాలములనుండి వెలువడే, కేశసంస్కారధూపైః = శిరోజాలను ఆరబెట్టుకోవటానికై వేసిన ధూపములచేత, ఉపచితవపుః = (పుంజుకొనిన) పుష్టిచేకూర్చుకొనిన శరీరముతో, బంధుప్రీత్యా = నీవు బంధువు అనెడి ప్రేమతో, భవన శిఖిభిః = ప్రాసాదాల్లోని మయూరాలచేత, దత్తనృత్యోపహారః = నృత్యమును కానుకగా పుచ్చుకొనిన వాడవై, కుసుమసురభిషు = పూలపరిమళములతో కూడినట్టి, లలితవనితా = సుకుమారమైన యువతుల, పాదరాగ అంకితేషు = పాదాలకలదిన లత్తుక గుర్తులు కలిగినట్టి, హర్యేషు = భవనాలయందు, అస్యాః = ఈ నగరము యొక్క లక్ష్మీం =

శోభను, పశ్యన్ = చూస్తూ, అధ్వఖేదం = ప్రయాణపు బడలికను, నయేథా = తొలగించుకొనుము.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

తా. – కావ్యారంభంలోనే చెప్పాడు "ధూమజ్యోతిసలిలమరుతాం" అంటూ మేఘం యొక్క స్వరూపాన్ని, ఇపుడు ధూపంతో నీ శరీరానికి పుష్టి చేర్చుకొమ్మని ఇలా చెపుతున్నాడు.

అక్కడి అంతఃపురప్రాసాదాలలో స్త్రీలు అభ్యంగన స్నానం చేసి కురులు ఆరబెట్టుకునేందుకు సుగంధమయ (సాంబ్రాణి) ధూపాన్ని వేసుకుంటున్నారు. ఆ ధూపపు పొగలు అలా వ్యాపించి గవాక్షజాలముల ద్వారా బయటికి వెళుతుంటాయి. వాటిని నీతో చేర్చుకో. నీ శరీరానికి బలం చేకూరుతుంది. అటుపైన ఆ భవనాల్లో నీ రాకకై వేచివేచి, నీవుకనబడగానే తమ ఆప్తుడు వచ్చాడనే ఆనందంతో మయూరాలు నర్తిస్తాయి. వాటి నృత్యమే నీకు కానుక. ఆ అందమైన భవనాలలో పూల పరిమళాలు గుబాళిస్తూ ఉంటాయి. అక్కడ నడయాడే సుకుమార సుందరీమణుల లత్తుక అలదిన పాద విన్యాసంతో అక్కడి నేల రాగరంజితమైఉంటుంది. ఈ విధంగా వివిధరూపాల్లో కనువిందుచేసే ఆ నగర మనోజ్ఞశోభను చూస్తే నీకు మార్గాయాసమే తెలియదు. అందుచేత కమనీయ దృశ్యాలదర్శనంతో నీ అలసటను దూరం చేసుకో.

ఈ శ్లోకంలో 'ఉదాత్తాలంకారం' ఉంది.

రాబోయే శ్లోకంలో ఉజ్జయినిలోని 'మహాకాళేశ్వరుని' వైభవం వర్ణించబడుతూంది.

భర్తుః కంఠచ్ఛవిరితి గణైః సాదరం వీక్ష్యమాణః
పుణ్యం యాయాస్త్రిభువనగురోర్ధామ చండీశ్వరస్య,
ధూతోద్యానం కువలయరజో గంధిభిర్గంధవత్యా-
స్తోయక్రీడా నిరతయువతిస్నానతిక్తైర్మరుద్భిః. **37**

ప్ర.అ.– భర్తుః = తమస్వామి యొక్క, కంఠచ్ఛవి = నీలకంఠుని కంఠం వలె నీలంగా ఉన్నది, ఇతి = అని, గణైః = ప్రమథగణముల చేత, సాదరం = ఆదరపూర్వకంగా, వీక్ష్యమాణః = చూడబడినవాడవై, త్రిభువనగురోః = ముల్లోకాధిపతి ఐన, చండీశ్వరస్య = పార్వతీ వల్లభుని యొక్క, పుణ్యంధామ = పావన నిలయానికి, యాయాః = వెళ్లుము, కువలయరజోగంధిభిః = కలువల పరాగపరిమళాలతో, గంధవత్యాః = గంధవతి అనుపేరుగల నది యొక్క, తోయక్రీడా = జలక్రీడల, నిరతయువతి = నిమగ్నమైన

In Public domain. Digitization Muthulakshmi Research Academy

యువతుల, స్నానసిక్తైః = స్నానంచేత సురభితమైన, మరుద్భిః = వాయువులచేత, ధూత = కంపింవజేయబడిన, ఉద్యానం = ఉద్యానం గల (ధామ యాయాః).

తా:- ఆకాశంలో ఉజ్జయినీ మీదుగా వెళ్లే నిన్ను తమ స్వామియైన నీలకంఠుని కంఠంలా నీలంగా ఉన్నావని ప్రమథగణాలు ఆదరపూర్వకంగా చూస్తారు. అలా వారి ప్రేమపూరిత లోచనాలచేత తిలకించబడుతూ త్రిలోకాధిపతియైన చండీనాథుని పవిత్ర ధామమైన మహాకాళేశ్వర మందిరానికి వెళ్లుము. అది కేవలం ముక్తి ప్రదమే కాదు - సరసమయము కూడా (రక్తిప్రదము కూడా). అక్కడి స్త్రీలు కలువలపరాగ పరిమళద్రవ్యాలతో గంధవతీ నదీజలంలో జలక్రీడలు సలిపి స్నానాలు చేస్తారు. అటుగా వీచేగాలులు ఆ రమణీమణుల స్నానంచేత సురభితమైన నది మీదుగా వీచటం చేత పరిమళభరితమై ఉంటాయి. ఆ వాయువులు ఆ మహాకాళ సమీపంలోని ఉద్యానవనంలోని చెట్లను ఊగింపజేస్తాయి. అలాంటి మనోహర ప్రదేశానికి వెళ్ళుము.

వి.- వాయువుల పరిమళంతో బహుశా చెట్లుకూడా తూగిపోతాయి. హిందీ సుప్రసిద్ధకవి మైథిలీశరణ్ గుప్త చాలా అందంగా ప్రకృతిని వర్ణిస్తాడు. అతని వర్ణనలో ఒకచోట "మానో ఝూమ్ రహేహైఁ తరుభీ మంద పవన్ కీ ఝోంకోసే" అంటాడు.

పైన చెప్పబడిన భావమే ఇందులోనూ ఉంది. ఇంకా 'మహాకాల' వర్ణనం కొనసాగుతుంది.

అప్యన్యస్మిన్ జలధర! మహాకాళమాసాద్య కాలే
స్థాతవ్యం తే నయనవిషయం యావదత్యేతి భానుః,
కుర్వన్సంధ్యా బలిపటహతాం శూలినః శ్లాఘనీయా-
మామన్ద్రాణాం ఫలమవికలం లప్స్యసే గర్జితానాం. **38**

ప్ర.అ. - జలధర! = ఓ జలధరా!, మహాకాలం = మహాకాలమందిరాన్ని, అన్యస్మిన్ = సంధ్యాతిరిక్తమగు, కాలే = సమయంలో, అపి = అయినప్పటికీ, ఆసాద్య = అక్కడికి చేరిన తరువాత, యావత్ = ఎంతవరకైతే, భానుః = సూర్యుడు, నయనవిషయం = కనుచూపుమేర, అతిఏతి = దాటిపోవునో (అంతవరకు), తే = నీకు, స్థాతవ్యం = అక్కడ ఉండాల్సి ఉంది, శూలినః = త్రిశూలధారి ఐన మహేశ్వరుని యొక్క శ్లాఘనీయాం = ప్రశస్తమైన, సంధ్యాబలిపటహతాం = సంధ్యాకాలపు పూజ (నైవేద్యం) సమయంలో మ్రోగించే పటహ (భేరి) త్వాన్ని, కుర్వన్ = చేయుచు, (త్వం) ఆమంద్రాణాం =

మంద్రగంభీరములయిన, గర్జితానాం = ఉరుములయొక్క, అవికలం = అఖండమైన, ఫలం = ఫలాన్ని, లప్స్యసే = పొందగలవు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

తా:- ఓ జలధరా! నీవు మహాకాలమందిరం చేరేటప్పటికి ఏ సమయమైనా కానీ నీవు మాత్రం సూర్యుడు దృష్టిపథాన్ని దాటిపోయేవరకూ అక్కడ నిలిచి ఉండాల్సిందే. ఎందుచేతనంటే వరమశివునికి అక్కడ సంధ్యాకాలంలో పూజజరుగుతుంది. ఆసమయంలో పటహాలు మ్రోగింపబడతాయి. నీవు నీ జలద గంభీరమైన మంద్రధ్వనితో గర్జించి ప్రశస్తమైన 'సంధ్యాబలిపటహం' చేసే పని కావించినట్లైతే నీకు అఖండ ఫలం సిద్ధిస్తుంది.

వి:- మేఘగర్జనని మృదంగధ్వనితోను, భేరీధ్వనితోను పోలుస్తారు. శివుడు తాండవమూర్తి. అతడు సంధ్యాతాండవం చేస్తాడు. ఆ సమయాని కొక ప్రాశస్త్యం ఉంది. అందుచేత మేఘుడు భేరీవాద్యం చేయాల్సిన పనిని తాను చేయటం వలన విశేషఫలం లభిస్తుంది.

ఈ శ్లోకంలో అలంకారం 'కావ్యలింగం". ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటి ఈ ఉజ్జయినీ మహాకాళేశ్వరలింగం.

ఆలయాల్లో వేశ్యల నృత్య సంప్రదాయం కాళిదాసు కాలం నాటికే ఉండేదని రాబోయే శ్లోకం తెలుపుతుంది.

పాదన్యాస క్వణితరశనాస్తత్ర లీలావధూతై
రత్న చ్ఛాయా ఖచిత వలిభిశ్చామరైః క్లాన్తహస్తాః,
వేశ్యాస్త్వత్తో నఖపదసుఖాన్ప్రాప్య వర్షాగ్ర బిందూ-
నామోక్ష్యంతే త్వయి మధుకరశ్రేణి దీర్ఘాన్ కటాక్షాన్. 39

ప్ర.అ.- తత్ర = ఆ మహాకాళమందిరంలో, పాదన్యాస = పదవిన్యాసంచే, క్వణితరశనాః = నినదించే (సవ్వడి చేసే) కటి సూత్రములతో (నడుమున వేలాడే మువ్వల గొలుసులతో), లీలావధూతైః = సవిలాసముగా కదల్పబడిన, రత్నచ్ఛాయా ఖచిత = రత్న కాంతులతో నిండిన, వలిభిః = చామరముల దండములచేత, చామరైః = వింజామరలచేత, క్లాన్త హస్తాః = అలసిన చేతులు గలవారు, వేశ్యాః = వారకాంతలు, త్వత్తః = నీ నుండి, నఖపదసుఖాన్ = నఖక్షతములకు సుఖప్రదమగు, వర్షాగ్రబిందూన్ = తొలకరిచినుకులను, ప్రాప్య = పొంది, త్వయి = నీపైన, మధుకరశ్రేణిదీర్ఘాన్ =

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మధుకర పంక్తులవలె నల్లని దీర్ఘమైన, కటాక్షాన్ = చూపులను, క్రీగంటిచూపులను, ఆమోక్ష్యంతే = వదలుదురు, ప్రసరింపజేయుదురు.

తా:– ఆ మహాకాలమందిరంలో వేశ్యకాంతలు సంధ్యాసమయమున తమ నృత్యంతో పరమేశ్వరునికి సేవలందిస్తారు. అది స్వామికి వింజామరలు వీస్తూ వయ్యారంగా అడుగులు కదిలిస్తూ చేసే నృత్యం. అలా నృత్యం చేసేటప్పుడు వారి అడుగుల కదలికవలన నడుమున ఉన్న మణిమేఖలలు మధురంగా ధ్వనులు చేస్తాయి. వారి కరకంకణాల్లో పొదగబడిన రత్నాల కాంతులు వారు ధరించిన వింజామరల దండల్లో ప్రతిఫలించి వాటిని కాంతివంతంగా చేస్తాయి. అలా మనోజ్ఞంగా నర్తించే ఆ సుకుమార సుందరీమణుల కర, చరణాలు అలసిపోతాయి. అలసిపోయిన ఆ కోమలాంగుల శరీరంపై నఖక్షతాలకు నీ తొలకరిచినుకులు (అమృతలేపంలా) సుఖకరంగా ఉంటాయి. తమకు హాయిని గూర్చేనీవైపు ఆ యువతుల తుమ్మెదబారుల్లాంటి నేత్రాలు ప్రేమపూరిత కటాక్షాలని ప్రసరింపచేస్తాయి.

వి.– ఒకచోట నిలుచుని వీణను గాని, చామరాలనుగాని వయ్యారంగా పట్టుకొని ఆడిస్తూ చేసే నృత్యం 'దేశిక' నృత్యం అనబడుతుంది (మల్లినాథ వ్యాఖ్యానం). ఈ శ్లోకంలో 'మధుకర శ్రేణి దీర్ఘాన్' అన్న చోట 'లుప్తోపమ' అలంకారము.

రుద్రతాండవము తీక్ష్ణంగా ఉంటుంది. 'పార్వతి' సుకుమార నృత్యప్రియ (లాస్యప్రియ). ఆమె ఆ శివుని తాండవానికి బెదురుతుందేమో నీవామెకు స్తిమితం కూర్చమని మేఘునితో చెపుతున్నాడు యక్షుడు.

గజాసుర సంహారానంతరం పరమశివుడు ఆ గజాసురుని చర్మాన్ని ధరించి తాండవం చేసాడు. అందుచేత శివుణ్ణి కృత్తివాసుడనీ (చర్మధారి), గజాజినధారి అని అంటారు. అయితే రక్తసిక్తమైన గజాజినం చూసి పార్వతి ఉద్వేగకంపిత అవటం సహజమే కదా! అలాంటప్పుడు మేఘుడు ఎలాంటి సేవనందించాలో వివరిస్తున్నాడు.

పశ్చాదుచ్చైర్భుజతరువనం మండలేనాభిలీనః
సాంధ్యం తేజః ప్రతినవజపాపుష్ప రక్తం దధానః,
నృత్యారంభే హర పశుపతే రార్ద్రనాగాజినేచ్ఛాం
శాన్తోద్వేగ స్తిమితనయనం దృష్ట భక్తిర్భవాన్యా. 40

ప్ర.అ.- పశ్చాత్ = అటుపిమ్మట, పశుపతేః = భూతనాథుడైన పరమేశ్వరుని యొక్క నృత్యారంభే = నృత్యారంభ సమయమున, ప్రతినవజపాపుష్పరక్తం = అప్పుడే వికసించిన జపాపుష్పం (మందారం) యొక్క రక్తవర్ణాన్ని, సాంధ్యం = సంధ్యాకాంతిని, దధానః = ధరించిన వాడవై, భుజతరువనం = భుజములను వృక్షములతో కూడిన వనమును, మండలేన = వలయాకారమున, అభిలీనః = వ్యాపించి, భవాన్యా = భవానీ దేవి చేత, శాన్త ఉద్వేగ = ఉద్వేగము శాంతించి, స్తిమితనయనం = చూపులు ప్రశాంతములు కాగా, దృష్టభక్తిః = భక్తి ప్రదర్శించిన వాడవై (చూడబడిన భక్తికలవాడవై), పశుపతేః = ఈశ్వరుని యొక్క ఆర్ద్రనాగాజిన ఇచ్ఛాం = రక్తంతో తడిసిన ఏనుగు చర్మం పట్ల మక్కువను (ధరించాలనే కోరికను), హర = తొలగించుము.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

తా:- సంధ్యాబలిపూజాదికం అయిన తరువాత పరమశివుని తాండవనృత్యం ప్రారంభమౌతుంది. ఆ తాండవారంభసమయంలో నీవు ఆ శివుని ఉన్నత భుజాలనే తరువులతో కూడిన వనాన్ని, నీ మండలాకారంతో (మేఘమండలంతో) కప్పివేయాలి (నీవు అక్కడ లీనమవ్వాలి). అదికూడ జపాకుసుమవర్ణాన్ని బోలిన సంధ్యారుణకాంతిని ధరించి ఉండాలి నీవు (రక్తవర్ణజగజాజినాన్ని మరపింపజేయాలి). ఆ విధంగా పరమేశ్వరుని శరీరాన్ని అలంకరించిన నిన్ను చూసి భవానీ దేవికి ఉద్వేగం తగ్గి మనసు కుదుటబడి కళ్లలోని భయం తొలగి పోతుంది. ఈ విధంగా పరమేశ్వరునికి రక్తసిక్తమయిన గజాజినం పట్ల కోరికను తొలగింపజేసిన నీ భక్తిని చూసి భవానీదేవి ప్రసన్న అవుతుంది.

వి:- ఈ శ్లోకంలో 'భుజతరు' అన్న చోట 'రూపకం', 'ప్రతినవ జపాపుష్పం' అన్నచోట 'లుప్తోపమ'' అలంకారాలున్నాయి.

ఉత్తములు అందరికీ సహాయపడతారు. రాత్రిపూట ప్రియులవద్దకు ప్రయాణమయ్యే యువతులకు కూడా మేఘుడు సహాయ పడాల్సిందే. 'అభిసరతి' ఇతి 'అభిసారిక. 'అభిసారిక' అంటే వేశ్యకాదు. ప్రియతముని వద్దకు తానే స్వయంగా వెళ్లే ప్రేయసి. అందుచేత అలాంటివారికి జాలిగుండె (గుండె నీరు కదా మేఘునికి) గల మేఘుడు ఇకసాయం చేయకపోతే ఎలా? అందుకే యక్షుడు ఇలా అంటున్నాడు.

(ఇక్కడ కాళిదాసు 'అభిసారిక' అనే పదం ప్రయోగించలేదు కూడాను. మల్లినాథ వ్యాఖ్యానాన్ని బట్టి, అలంకారశాస్త్రంలోచెప్పిన లక్షణాల్నిబట్టి ఆ పదం వాడబడింది అర్థ వివరణలో.)

In Public domain. Digitization-Muthulakshmi Research Academy

గచ్ఛంతీనాం రమణవసతిం యోషితాం తత్ర నక్తం
రుద్ధాలోకే నరపతిపథే సూచిభేద్యైస్తమోభిః,
సౌదామిన్యా కనకనికష స్నిగ్ధయా దర్శయోర్వీం
తోయోత్సర్గ స్తనితముఖరో మా స్మభూ ర్విక్లవాస్తాః. **41**

ప్ర.అ. – తత్ర = ఆ ఉజ్జయినీ నగరమునందు, నక్తం = రాత్రియందు, రమణవసతిం = ప్రియుని నివాసానికి, గచ్ఛంతీనాం = వెళ్లుచున్నట్టి, యోషితాం = యువతులకు, సూచిభేద్యైః = అతిచిక్కనైన (సూదితో ఛేదించతగిన), తమోభిః = చీకట్లచేత, రుద్ధాలోకే = కంటికేమీ కనుపించనీయని, నరపతిపథే = రాజమార్గమునందు, కనకనికషస్నిగ్ధయా = నికషము (గీటురాయి) మీద గీయబడిన స్వర్ణరేఖ వలె మెరిసిపోయే, సౌదామిన్యా = మెరుపుతీగ చేత, ఉర్వీం = నేలపైన మార్గమును, దర్శయ = చూపించుము, తోయోత్సర్గ స్తనితముఖరః = వర్షాన్ని కురిపించే శబ్దాన్ని చేసేవాడవు (వెలువరించుటం), మాస్మభూః = కాబోకుము, (కుతః = ఎందుచేతనంటే) తాః విక్లవాః = ఆ లలనలు భీరువులు (బెదరిపోదురు).

తా. – ఆ ఉజ్జయినీ నగరంలో కన్నుపొడుచుకున్నా కానరాని కటికచీకటి రాత్రివేళ ప్రియతముని నివాసానికి వెళ్ళే యువతులకు రాజమార్గంలో (రాజ మార్గమైనప్పటికి) కంటికేమి కానరాదు. అలాంటి సమయంలో గీటురాయి మీద గీయబడిన బంగారు రేఖలా సన్నగా, స్నిగ్ధంగా (నునుపుగా, కాంతివంతంగా) మెరిసిపోయే విద్యుల్లతను ప్రకటించి వారికి మార్గాన్ని చూపు. వర్షం కురిపిస్తూ శబ్దం మాత్రము చేయకు (మెరువుకాని ఉరమకు), ఎందుచేతనంటే నీ ఉరుములు వింటే ఆ రమణీమణులు బెదిరిపోతారు.

'మెరుపుతీగ'ను నికషోపల స్వర్ణరేఖచే పోల్చటం కవి యొక్క అద్భుత ఊహాశక్తికి నిదర్శనం. ఈ శ్లోకంలో 'లుప్తోపమ' మరియు 'కావ్యలింగాలంకారాలు" ఉన్నాయి. ఉజ్జయినికి సంబంధించిన ఈ వర్ణనలను బట్టి అక్కడివారు ఐశ్వర్యవంతులు, భక్తి పరాయణులు, సుఖజీవసులు, లలితకళాప్రియులు అని తెలుస్తుంది.

ఇంతవరకూ ఉజ్జయినీ నగరమును వర్ణించిన యక్షుడు అక్కడ రాత్రి ఉండి ఉదయాననే ప్రయాణాన్ని కొనసాగించమని మేఘునికి చెపుతున్నాడు. ఇక ఉజ్జయినీ నగరం నుండి మళ్లీ ఉత్తరదిశగా కైలాసానికేసి మేఘుని ప్రయాణం సాగుతుంది.

❋ ❋ ❋ ❋ ❋

ఉజ్జయినీ నగర సౌందర్యం చూసి, మహాకాలుణ్ణి సేవించి, అక్కడి నృత్యాంగనలకు, అభిసారికలకు సహాయమొనరించి ఆ రాత్రి అక్కడనే గడిపి మరునాడు ప్రయాణాన్ని కొనసాగించమంటాడు యక్షుడు. ఎంత మనోహరప్రదేశమైనా ఎక్కువరోజులు ఉండిపోతే కర్తవ్యానికి విలంబం ఏర్పడుతుంది. అదీ మిత్రకార్యం. త్వరగా యక్షుని సమాచారం అందించకపోతే అతని ప్రియమైన అర్ధాంగి పరిస్థితి ఏమౌతుందో. ఈనాటి 'కొరియర్' సర్వీసులాగా ఆనాడూ జంఘాకారికులు 'రన్నర్స్' ఉండేవాళ్లు. యక్షుడు మేఘునికి చెప్పింది అలాంటి పనే. ఈనాటికీ హిమాలయాలకు కొరియర్ చేరాలన్నా రెండు రోజులు పడుతుంది. ఈ వర్ణనను బట్టి కాళిదాస కవి లోకానుశీలనం ఎలాంటిదో గ్రహించవచ్చును.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

తాం కస్యాంచిద్భవన వలభౌసుప్తపారావతాయాం
నీత్వా రాత్రిం చిరవిలసనాత్ ఖిన్న విద్యుత్కళత్రః,
సూర్యే దృష్టే పునరపి భవాన్వాహయేదధ్వశేషం
మందాయంతే న ఖలు సుహృదామభ్యపేతార్థకృత్యాః. **42**

ప్ర.అ:- చిరవిలసనాత్ = (ఇంతకు ముందు చెప్పినట్లుగా) చాలాసేపు మెరయుట వలన, ఖిన్న = అలసిపోయిన, విద్యుత్ కళత్రః = విద్యుల్లత భార్యగా గలవాడు, (విద్యుల్లత భర్త), భవాన్ = నీవు, సుప్తపారావతాయాం = నిదురించిన పారావతాలు కల (పారావతాల కలరవాలు శాంతించిన పిదప), కస్యాంచిత్ = ఏదో ఒకదాని యందు, భవనవలభౌ = భవనో పరిభాగమున, తాం రాత్రిం = ఆ రేయిని, నీత్వా = గడిపి, సూర్యే = సూర్యుడు, దృష్టే = ఉదయించగానే (కనబడగానే), పునః అపి = మరల, అధ్వశేషం = మిగిలిన ప్రయాణాన్ని, వాహయేత్ = నిర్వహింతువు గాక, కొనసాగింతువు గాక, సుహృదాం = మిత్రుల యొక్క అభ్యపేత = చేపట్టిన, అర్థకృత్యాః = చేయవలసిన కార్యములు గలవారు, నెరవేర్చాల్సిన ప్రయోజనాలను గలవారు, మందాయంతే న ఖలు = అలసత్వమును పొందరు కదా, ఆలస్యం చేయరు కదా!

తా:- మేఘుడా! అభిసారికల సహాయార్థం చిరకాలం మెరిసిమెరిసి నీ భార్య విద్యుల్లత అలసి పోతుంది. అలా అలసిపోయిన కళత్రంతో గూడా నీవు పారావతాలు నిదురించి నిశ్శబ్దంగా ఉన్న ఏదో ఒక భవనం యొక్క ఉపరిభాగంలో ఆ రాత్రిని గడిపివేయి. మళ్లీ ఉదయమే సూర్యుడు కనబడటంతోటే నీవు నీ మిగిలిన ప్రయాణానికై ముందుకు సాగాలి. మిత్రుల అభ్యర్థన మేరకు కార్యాన్ని చేపట్టినవారు కార్యసాధనలో అలసత్వం చూపరు కదా!

In Public Domain: Digitization Muthulakshmi Research Academy

వి : – ప్రకృతి చిత్రణలో అచేతనాలకు చేతనత్వాన్ని ఆపాదించే సందర్భంలో కవి అప్రమత్తుడై ఉండాల్సిందే. కాళిదాస కవి ప్రతిభ ఇలాంటి సందర్భాల్లో తళుక్కున మెరుస్తుంది. మేఘాలు భవనాలపై విహరించగలవు కానీ, భవనాల లోపలికి ప్రవేశించలేవు కదా! అందుచేత 'భవనోపరిభాగంలో విశ్రమించు' అని యక్షుని చేత పలికించాడు. అలసిన భార్యను సేదదీర్చటం ముఖ్యం. అందుచేత నిశ్శబ్దంగా ఉండేచోటు ఎంచుకొమ్మన్నాడు. అయితే ప్రేయసీపరిష్వంగం ఎంతసుఖప్రదమైనా కర్తవ్యాన్ని మరువగూడదు. కర్తవ్య విస్మరణ ఎంతటి అనర్థానికి హేతువో యక్షునికి అనుభవ పూర్వకంగా తెలిసింది. అందుచేత మేఘునికి శృంగారఘట్టాలు వివరించినప్పటికీ మాటిమాటికీ కర్తవ్యాన్ని గుర్తుచేస్తున్నాడు. ఇంతకీ ఈ ఘనతంతా కావ్యసూత్రధారి ఐన కవికుల గురువుదే !

ఈ శ్లోకంలో రూపక, అర్థాంతర న్యాసాలంకారాలు ఉన్నాయి.

నదుల వర్ణనం

సూర్యోదయంతో ప్రయాణాన్ని సాగించే మేఘునకు మరొక మాట చెపుతున్నాడు యక్షుడు "సూర్యుణ్ణి మాత్రం ఆచ్ఛాదించవద్దు" అని. ఎందుచేతనంటే సూర్యోదయం ప్రాణుల్ని చైతన్యవంతుల్నీ కర్తవ్యోన్ముఖుల్నీ చేస్తుంది.

తస్మిన్కాలే నయనసలిలం యోషితాం ఖండితానాం
శాంతిం నేయం ప్రణయిభిరతో వర్త్మ భానోస్త్యజాశు,
ప్రాలేయాస్రం కమలవదనాత్సోఽపి హర్తుం నలిన్యాః
ప్రత్యావృత్తస్త్వయి కరరుధి స్యాదనల్పాభ్యసూయః 43

ప్ర.అ.– తస్మిన్ కాలే = ఆ సూర్యోదయ సమయంలో, ప్రణయిభిః = ప్రియతముల చేత, ఖండితానాం = ఖండితలైన నాయికల యొక్క, యోషితాం = యువతులయొక్క నయన సలిలం = కళ్లలోని నీరు, శాంతిం = శాంతిని, శమింపచేయటం, నేయం = పొందించాలి, అతః = కనుక, భానోః = సూర్యుని యొక్క, వర్త్మ = మార్గమును, ఆశు = వెంటనే, త్యజ = వదలుము, అన్యథా = అలా చేయకపోయినట్లైతే, నలిన్యాః = పద్మము యొక్క, కమలవదనాత్ = పద్మముఖమునుండి, పంకజవదనమునుండి, ప్రాలేయ అస్రం = మంచుకన్నీటిని, హర్తుం = తొలగించుటకు, ప్రత్యావృత్తః = తిరిగి వచ్చిన, సః అపి = ఆ భానుడు కూడా, కరరుధి = చేతులకు అడ్డుగా నిల్చే (కిరణాలను అడ్డుకునే), త్వయి = నీ పట్ల, అనల్ప అభ్యసూయః = అమితమైన అసహనము కలవాడు, స్యాత్ = అగును.

తా.- రేయంతా ఎక్కడోగడిపి ప్రియురాళ్ల కోపానికి గురియైన ప్రణయజనులు తిరిగి వచ్చే వేళ ఆ సూర్యోదయపు వేళ. రాత్రంతా తమనువదిలి ఎక్కడికో వెళ్లారన్న కోపంతోనూ తాపంతోనూ కన్నీళ్లురాల్చే ఖండితనాయికలను అనునయించి కన్నీరు తుడిచి చేరదీయటానికి ప్రియులు వచ్చే సమయం. అలాగే పద్మబాంధవుడు, భానుడు కూడా తన ప్రియతమయైన పద్మినీకాంతను వదిలి రాత్రంతా ఎక్కడో గడిపి ఉదయాన తిరిగి వస్తున్నాడు. పద్మినీ ముఖపద్మం నుండి జాలువారే మంచు కన్నీటి బిందువులను అతడు తన చేతితో (కిరణాలతో) తుడిచివేయబోయే సమయంలో నీవు అడ్డుగా నిలిచినావంటే అతనికి అమితమైన కోపం వస్తుంది. అందుచేత అతడు కనపడగానే నీవు అతని మార్గాన్ని వదిలి వెళ్లు (లేదంటే అనర్థం సుమా).

In Public domain Digitization Muthulakshmi Research Academy

వి:- ఈ శ్లోకం కవి రసహృదయానికి తార్కాణం. అష్టవిధ శృంగారనాయికల్లో 'ఖండిత' ఒకనాయిక. ప్రియుడు అన్యాసక్తుడైనాడని ఈర్ష్యావశం చేత కుపిత ఐనది 'ఖండిత'. రోషం, దుఃఖం రెండూ ఆమెలో చోటుచేసుకుంటాయి. అయినా ప్రియుని పట్లగల అనురాగం చేత అతని చేయిసోకితేనే పరవశించి అలుకను విడనాడుతుంది. ఇక్కడ రేయంతా కనబడని సూర్యుడు నాయకుడు. మంచు బిందువులతో తడిసి దుఃఖాశ్రువులతో ఉన్నట్లుగా వర్ణించబడిన పద్మిని నాయిక. కిరణాలే సూర్యుని చేతులు, అవి సోకగానే మంచు కన్నీటి బిందువులు అదృశ్యమౌతాయి. ఇదీ ఉపమా సౌందర్యం, ఇదీ ప్రకృతి చిత్రణ. ఇవన్నీ చదివి మననం చేసికొంటే కావ్యరసాస్వాదనకు అర్హులు అవుతారు.

ఇందులో కావ్యలింగ, సమాసోక్తి. శ్లేషాలంకారాలు ఉన్నాయి.

నాయికలలో కూడా అనేకరకాలు. ఖండితలా కోపించేవాళ్లు ఒకరకమైతే గంభీరంగా ప్రియుని కోసం ఎదిరిచూసి అతని రాకతోనే పరవశించేవారు కొందరు. అలాంటి నాయిక 'గంభీరానది'. పేరే గంభీర. ఇక ఆమె స్వభావం అంతకన్నా గంభీరం. ఆ నదిని గూర్చి మేఘునికి నాయికగా కవి వర్ణిస్తున్నాడు.

గంభీరాయాః పయసి సరితశ్చేతసీవ ప్రసన్నే
ఛాయాత్మాపి ప్రకృతిసుభగో లప్స్యతే తే ప్రవేశం,
తస్మాదస్యాః కుముదవిశదాన్యర్హసి త్వం న ధైర్యా -
న్మోఘీ కర్తుం చటులశఫరో ద్వర్తన ప్రేక్షితాని. 44

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ. – గంభీరాయాః = గంభీర అనుపేరుగల, సరితః = నది యొక్క ప్రసన్నే = నిర్మలమైన, పయసి = నీటియందు, (ప్రసన్నే) చేతసి ఇవ = నిర్మలమైన హృదయము నందు వలె, ప్రకృతి సుభగః = సహజసుందరమైన, తే = నీ యొక్క, ఛాయాత్మా అపి = ఛాయా శరీరమైనను (నీడ ఐనప్పటికీ), ప్రవేశం = ప్రవేశమును, లప్స్యతే = పొందగలదు, తస్మాత్ = అందుచేత, అస్యాః = ఈ నది యొక్క, కుముద విశదాని = తెల్లకలువలవలె ధవలమైన, చటుల – శఫర = చపలములైన మీనముల యొక్క, ఉద్వర్తన = తిరుగాడుట, కదలుట, ప్రేక్షితాని = చూపులను, ధైర్యాత్ = ధూర్తత్వము వలన, (మనకెందుకులే అనుకొని), మోఘీకర్తుం = వృథాపుచ్చుటకు, న అర్హసి = తగవు.

తా :– గంభీరానది జలము అతిప్రసన్నము (స్వచ్ఛము). అందుచేత నిర్మలమైన హృదయంలో ప్రవేశించినట్లుగా నీ నీడ ఆ నదీజలములో సులభంగా ప్రవేశించగలదు. తెల్లని కలువల వలె శ్వేత వర్ణంలో ఉన్న, చంచలంగా అటూ ఇటూ తిరుగాడే మీననయిన (చేపలే కళ్లుగా కల) ఆ గంభీర యొక్క విలాసమైన చూపులను తృణీకరించి, ఆమె అనురాగ వీక్షణాల్ని వృథా చేయటం నీకు తగదు.

వి:– నిర్మలమైన హృదయంలో స్వచ్ఛమైన అద్దంలో ప్రతిబింబంలా ఏదైనా ప్రవేశించగలుగుతుంది. అలాంటి ప్రసన్న హృదయ 'గంభీర'. ఆమె మౌనంగా తన మీనలోచనాలతో అనురాగపూరితంగా చూస్తుందేగాని పెదవి విప్పి మాట్లాడదు. చూపులే అనురాగసంకేతాలు. రసహృదయుడు ఆ అనురాగాహ్వానాన్ని అందుకోవాలి అని భావం.

ఇక్కడ గంభీరానదికి కటాక్షవీక్షణాదులు చెప్పి నాయికతో సాదృశ్యాన్ని చెప్పటం చేత 'లుప్తోపమ'. మీనముల ఉద్వర్తనములందు చూపులను ఆరోపించటం వలన 'రూపకం'. ఈ రెండూ కలిసి 'సంకరాలంకారం'.

నాయికల అనురాగాన్ని సూచించే హావభావాలను అనురాగేంగితాలు అని అంటారు. 'గంభీరానది'ని గూర్చిన వర్ణనలో పెదవి విప్పకుండానే హావభావాల ద్వారా నాయికలు తమ అనురాగాన్ని ఎలా సూచిస్తారో వర్ణించాడు కవి.

ఆ వర్ణన ఇలా సాగింది.

తస్యాః కించి త్కరధృతమివ ప్రాప్తవానీర శాఖం
హృత్వా నీలం సలిలవసనం ముక్తరోధో నితంబం,

ప్రస్థానం తే కథమపి సఖే లంబమానస్య భావి
In Public domain, Digitization Muthulakshmi Research Academy
జ్ఞాతాస్వాదో వివృతజఘనాం కో విహాతుం సమర్థః. 45

ప్ర.అ.- హే సఖే! = ఓ సఖుడా!, ప్రాప్తవానీరశాఖం = అందుకొనిన వేతసశాఖ గలది, కించిత్ కరధృతం ఇవ = ఇంచుక చేతితో పట్టుకొన్న దానివలె, ముక్తరోధో నితంబం = తీరములనే నితంబాల (పిరుదుల) మీదుగా జారిన (అడ్డు తొలగిన), తస్యాః = ఆ గంభీరయొక్క, నీలం సలిలవసనం = నీలవర్ణ జలమనే వస్త్రాన్ని, హృత్వా = తొలగించి, లంబమానస్య = వ్రేలాడి పోతున్న (అలస్యంగా ముందుకు కదలుతున్న), తే = నీ యొక్క ప్రస్థానం = ప్రయాణము, కథం అపి = ఎలాగో అతికష్టం మీద, భావి = ముందుకు సాగును, జ్ఞాత ఆస్వాదః = రుచి చూసినవాడు (రసానుభూతిని ఎరిగినవాడు), కః = ఎవడు, వివృతజఘనాం = ఆవరణ తొలగిన జఘనభాగాన్ని, విహాతుం = వదిలిపెట్టుటకు, సమర్థః = శక్తుడగును.

తా-: మిత్రమా! తీరమునందలి వేతసశాఖను తగుల్కొనిన గంభీరానది (జలము) నితంబాల మీదుగా జారిపోయే నీలాంబరాన్ని (నీలిచీరను) చేతితో పట్టుకొనినట్లు ఉండగా ఆ నీలివస్త్రం తొలగించిన నీవు ప్రయాణానికై ముందుకు సాగుట కష్టం. రసజ్ఞుడు, రసాస్వాదనను తెలిసినవాడు ఎవడైనా ప్రణయిని తనముందు తన నితంబసౌందర్యాన్ని ప్రకటిస్తే చూసి వదులుకో కలుగుతాడా?

వి :- జలములో ఆకాశం ప్రతిబింబించుట వలన నీలివర్ణంగా కనపడుతుంది. నదీ జలమే ఆమెకు (గంభీరకు) నీలవర్ణపు చీర. నీరు విడిచిన సైకత తీరాలే నితంబాలు. ప్రియుని చూడగానే పరవశంతో ప్రేయసి వసనం దానంతటదే తొలగిపోతుంది అని కవులు వర్ణిస్తారు. జారిపోయే చీరను సిగ్గుతో ఒకచేత పట్టుకొన్నట్లుగా తీరంలోని వేతస వృక్షశాఖలో నీరునిలిచింది. ప్రయాణమై సాగిపోయే ప్రియతముడు చిలిపిగా ప్రియురాలి వస్త్రాన్ని లాగి, అటుపైన ముందుకు సాగలేక కాళ్లూ, చేతులూ వేళ్ళాడి పోతున్నట్లుగా వెళ్తాడు. అందులో ఎవరి అపరాధము లేదు. ఎంతటి వాడైనా మనసైన మగువ మనోహరంగా ఎదుట, నిలిచి ఉంటే కాదని వెళ్లగలడా?

ఈ శ్లోకంలో 'సమాసోక్తి' అలంకారం.

In Public Domain Digitization Muthulakshmi Research Academy

ప్రే[illegible] కార్యార్థం ముందుకు సాగుతారు. అలాగే మేఘునకూ ముందుకు సాగక తప్పలేదు. దేవగిరి ప్రాంతాలకు పయనమైనాడు.

త్వన్నిష్యందోచ్ఛ్వసిత వసుధాగంధ సంపర్క రమ్యః
స్రోతో రంధ్ర ధ్వనిత సుభగం దంతిభిః పీయమానః,
నీచైర్వాస్యత్యుపజిగమిషోర్దేవపూర్వం గిరిం తే
శీతో వాతః పరిణమయితా కాననోదుంబరాణామ్. 46

ప్ర.అ.- త్వత్ = నీయొక్క, నిష్యంద = జాలువారే (వర్షధారను), ఉచ్ఛ్వసిత = శ్వాసను పీల్చిన (గట్టిగా వాసన చూసిన), వసుధా = పృథివి, గంధసంపర్క రమ్యః = గంధమును సోకుట చేత మనోజ్ఞమైన, స్రోతో రంధ్రధ్వనిత సుభగం = నాసికారంధ్రము లందు శబ్దము వచ్చునట్లుగా ఇంపుగా, దంతిభిః = ఏనుగులచేత, పీయమానః = ఆఘ్రాణించబడినది (ఆస్వాదించబడినది), శీతః వాతః = చల్లనిగాలి, కానన ఉదుంబరాణాం = అడవిలోని మేడిపండ్లకు, పరిణామయితా = పక్వదశ కలుగజేయువాడు, దేవపూర్వం గిరిం = దేవశబ్దము ముందుగా గల గిరిని అనగా దేవగిరిని, ఉపజిగమిషోః = చేరదలచు, సమీపించగోరు, తే = నీకు, నీచైః = మెల్లగా, వాస్యతి = వీచగలదు.

తా:- నీ నుండి జాలువారే జలధారను పొంది వసుధాదేవి గట్టిగా ఊపిరి పీల్చుకున్నది. ఆ వసుధాదేవి గంధమును సోకి వాయువు పరిమళభరితమైనది. రమ్యమైన ఆ వాయువును ఏనుగులు తమనాసికారంధ్రాలతో గట్టిగా శబ్దాలు ధ్వనింపజేస్తూ ఆఘ్రాణించాయి. ఈ విధంగా సుగంధాన్నీ, శీతలత్వాన్నీ నింపుకున్న ఆ వాయువు అడవిలోని ఉదుంబర (మేడి) ఫలాలను పరిణత దశకు తీసుకువెళ్తుంది. అలాంటి ఆ వాయువు దేవగిరిని చేరబోయే నీకు మెల్లగా సేదదీరేటట్లుగా వీస్తుంది.

వి.- తొలకరిచినుకులు పడగానే భూమినుండి ఒకచక్కని పరిమళం వెలువడుతుంది. ఎండిపోయినట్టుగా ఉన్న భూతలం నిండుదనాన్ని సంతరించుకుంటుంది. ఆ విషయాన్నే పై విధంగా వర్ణించాడు కవి. ఏనుగులకు కూడా ఆనందకరమైనది వర్షాకాలం. అవి తమ ఆనందాన్ని ఘీంకారంతో ప్రకటిస్తాయి. అందువలన శబ్దం వెలువడేంతగా పరిమళాన్ని ఆఘ్రాణిస్తున్నాయి అని కవి వర్ణించాడు

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఇందు స్వభావోక్తి అలంకారము ఉన్నది. దేవగిరి చంబల్ లోయకు, దక్షిణ దిశయందున్నది. మాళవదేశమునకిది కేంద్రస్థానం. ఇక్కడ ప్రసిద్ధమైన కార్తికేయ మందిరమున్నది. ఆ విషయాన్నే రాబోయే శ్లోకంలో వివరిస్తున్నాడు.

తత్ర స్కందం నియతవసతిం పుష్పమేఘీకృతాత్మా
పుష్పాసారైః స్నపయతు భవాన్వ్యోమ గంగాజలార్ద్రైః,
రక్షాహేతో ర్నవశశిభృతా వాసవీనాం చమూనా-
మత్యాదిత్యం హుతవహముఖే సంభృతం తద్ధి తేజః. 47

ప్ర.అ.– తత్ర = ఆ దేవగిరి పైన, నియత వసతిం = స్థిరనివాసమేర్పరచుకొన్న, స్కందం = కుమారస్వామిని, పుష్పమేఘీకృతాత్మా = పూలువర్షించు మేఘుడవై, వ్యోమగంగా జలార్ద్రైః = ఆకాశగంగజలములచేత ఆర్ద్రమైన (తడిసిన), పుష్పాసారైః = పూలజల్లులతో, భవాన్ = నీవు, స్నపయతు = అభిషేకించుము, (అభిషేకించెదవుగాక), తత్ = ఆ (కార్తికేయుడు), వాసవీనాం = ఇంద్రుని యొక్క చమూనాం = సేనల యొక్క రక్షాహేతోః = రక్షణకొరకై, నవశశిభృతా = నెలవంకను (బాలచంద్రుణ్ణి) ధరించిన ఈశ్వరుని చేత, హుతవహముఖే = అగ్నిముఖమునందు, సంభృతం = ఉంచబడిన, అత్యాదిత్యం = సూర్యునికంటె అధికమైన, సూర్యుని అధిగమించిన, తేజః హి = తేజస్సుకదా!

తా.– ఆ దేవగిరి పైన స్థిరనివాస మేర్పరచుకున్న కార్తికేయునకు నీవు పుష్పవృష్టి కురిపించు మేఘుడవై, ఆకాశగంగాజలంతో తడిసిన పూలను కురిపించి అభిషేకము చేయుము. అతడు సామాన్యుడు కాడు. ఇంద్రుని సేనల రక్షణార్థం సాక్షాత్తూ ఆ చంద్రశేఖరుడే స్వయంగా అగ్నియందు ఉంచిన, సూర్యుణ్ణి సైతం అధిగమించే పరమేశ్వర తేజోరూపం ఆ కార్తికేయుడు.

ఇక్కడ 'అర్థాంతర న్యాసాలంకారం' ఉంది.

కార్తికేయుడు పార్వతీపరమేశ్వర సంతానం. అందుచేత పార్వతికి అతని పట్ల అమితమైన వాత్సల్యం. ఆ విషయాన్ని కవి వర్ణిస్తున్నాడు.

జ్యోతిల్లేఖా వలయి గళితం యస్య బర్హం భవానీ
పుత్ర ప్రేమ్ణా కువలయదళప్రాపి కర్ణే కరోతి,
ధౌతాపాంగం హరశశిరుచా పావకేస్తం మయూరం
పశ్చాదద్రిగ్రహణగురుభి ర్గర్జితైర్నర్తయేథాః. 48

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ.– జ్యోతిర్లేఖా వలయి = కాంతిరేఖా వలయం గల, గలితం = జారిపడిన, యస్య = ఏ నెమలి యొక్క, బర్హం = పింఛాన్ని (నెమలి కన్నుని), భవానీ = పార్వతి, ప్రేమా = పుత్రప్రేమచే, కువలయ దళప్రాపి = కలువరేకునుంచదగిన, కర్ణే = చెవియందు (చెవిప్రక్కన అలంకారముగా), కరోతి = ధరించుచున్నదో, హరశశిరుచా = శివుని శిరసునందలి చంద్రకాంతితో, ధౌత అపాంగం = ధవళితములైన కడగంటిచూపులు కలిగిన, పావకేః = అగ్నిపుత్రుడైన కార్తికేయుని యొక్క, తం మయూరం = ఆ మయూరమును, పశ్చాత్ = పుష్ప అభిషేకానంతరము, అద్రిగ్రహణ గురుభిః = కొండగుహలందు ప్రతిధ్వనించే ఘనమైన, గర్జితైః = గర్జనలచేత, నర్తయేథాః = నర్తింప చేయుము.

తా.– కార్తికేయుని పట్లగల పుత్రప్రేమ చేత పార్వతీ దేవి తన కుమారునికి అత్యంత ప్రియమైన చక్కని, కాంతిలేఖావలయాన్ని కల్గిన, జారివడిన (తాను ఊడబెరకకుండా) నెమలిపింఛాన్ని కర్ణోత్పలం స్థానంలో ధరించింది. పరమ శివునకూ తన కుమారుని వాహనమైన మయూరమంటే ప్రేమయే. చంద్రశేఖరుడైన ఆ పరమశివుని తలమీద నెలవంక కాంతితో ఆ మయూరం నేత్రాంచలములు ధవళితమైనవి. ఆ దేవగిరి గుహలు ప్రతిధ్వనించేటట్లుగా నీ గర్జనలు వెలువరించి, ఆ మయూరానికి అనందం కల్గించి నర్తింపజేయుము.

వి:– మేఘగర్జనలకు నెమళ్లు పురివిప్పి ఆడతాయి. మేఘగర్జనలు గిరుల ప్రాంతంలో వెలువడినపుడు ఆ గిరుల గుహలందు ప్రతిధ్వనించినపుడు మృదంగ ధ్వనుల్లా ఉంటాయి. నర్తనకు మృదంగధ్వనులెలా ఉత్తేజాన్ని కలిగిస్తాయో, మేఘగర్జనలు మయూరాలకు అలాంటి ఉత్తేజాన్ని ఉత్సాహాన్ని కలుగజేస్తాయి.

ఈ శ్లోకంలో 'ఉపమా', 'తద్గుణ' అలంకారాలున్నాయి.

మేఘుడు చర్మణ్వతీ నదిని చేరటం. ఆ నదిని సంభావించమని యక్షుడు మేఘునితో చెప్పటం రాబోయే శ్లోకంలో వర్ణించబడింది.

ఆరాధ్యైనం శరవణభవం దేవముల్లంఘితాధ్వా
సిద్ధద్వంద్వైర్జలకణభయాద్వీణిభిర్ముక్తమార్గః,
వ్యాలంబేథాః సురభితనయాలంభజాం మానయిష్యన్
స్రోతోమూర్త్యా భువిపరిణతాం రంతిదేవస్య కీర్తిమ్. 49

ప్ర.అ.– ఏనం = ఇతనిని, శరవణ భవం = రెల్లు గడ్డి వనమందు ఉద్భవించిన, దేవం = దేవుని (కుమారస్వామిని), ఆరాధ్య = ఆరాధించి, వీణిభిః = వైణికులైన, వీణలు ధరించిన, సిద్ధద్వంద్వై = సిద్ధదంపతుల చేత, జలకణభయాత్ = చినుకులు పడునేమో అనుభయంచేత, ముక్తమార్గః = విడువబడిన మార్గముకలవాడవై (వారు నీ మార్గానికి అడ్డుతొలగిపోగా), ఉల్లంఘిత అధ్వా = కొంతదూరము ప్రయాణించి, సురభితనయ = కామధేను సంతతియగు గోవుల యొక్క ఆలంభజాం = యాగమునందు బలి ఇవ్వటం వలన జన్మించినట్టిది, భువి = భూలోకమున, స్రోతోమూర్త్యా = నదీరూపమున, పరిణతాం = మారినదియు, రంతిదేవస్య = రంతిదేవుని యొక్క కీర్తిం = కీర్తిని, మానయిష్యన్ = గౌరవించుచు, వ్యాలంబేథాః = వినమ్రుడవగుము.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

తా. – రెల్లువననమునందు జన్మించిన ఆ కుమార స్వామిని ఆరాధించి ముందుకు సాగుము. వీణాపాణులై, గానలోలురై తిరుగాడే సిద్ధదంపతులు (నిన్ను చూచి) జలకణములు తమ (వీణల) మీద పడునేమో అని ప్రక్కకు తొలగిపోవుదురు. ఆ విధంగా ఎవరూ అడ్డులేని మార్గాన పయనించి, కొంత దూరము నతిక్రమించిన మీదట నీకొక నది కనిపించును. అది సాధారణమైన ప్రవాహము కాదు. వందలకొలది యాగములొనర్చిన రంతిదేవుని చేత యాగములలో ఇవ్వబడిన కామధేను సంతానమైన గోవుల ఆలంభనం (పశుబలి) చేత ఆ రంతిదేవునకు కలిగిన కీర్తియే నదీరూపమున ప్రవహించు చున్నది. ఆ నది పేరు 'చర్మణ్వతి'. వినమ్రుడవై ఆ నదికి ప్రణమిల్లి ముందుకు సాగుము.

వి: – యజ్ఞ, యాగాదులకు ప్రాధాన్యమున్న ఆ రోజుల్లో రంతిదేవుడు ఎన్నోయాగాలు చేసి యశస్వి ఐనాడు. జంతుబలులు ఆచారం ఐనప్పటికీ యాగాల పర్యవసానం ద్రవ్య, వస్తు త్యాగం, నిరతాన్న దానం ఇత్యాదులు. నెలలూ సంవత్సరాలు జరిగే ఈ యాగాల్లో ఎంతమందికి ఉచిత భోజనాదులు లభించేవో ఆలోచిస్తే యాగం యొక్క మహత్త్వం తెలుస్తుంది.

ఈ శ్లోకంలోని అలంకారం 'అతిశయోక్తి'.

చర్మణ్వతీనదిని చేరిని మేఘుని వర్ణన –

త్వయ్యాదాతుం జలమవనతే శారిఙ్గ్ణో వర్ణచౌరే
తస్యాః సిన్ధోః పృథుమపి తనుం దూరభావాత్ప్రవాహం,

ప్రేక్షిష్యంతే గగన గతయో నూనమావర్జ్య దృష్టీ–
In Public domain. Digitization Muthulakshmi Research Academy
రేకం ముక్తాగుణమివ భువః స్థూల మధ్యేంద్రనీలమ్. 50

ప్ర.అ.– శార్ఙ్గిణః = విష్ణువుయొక్క, వర్ణచౌరే = (శరీర) కాంతిని దోచిన, త్వయి = నీవు, జలం = నీటిని, ఆదాతుం = గ్రహించుటకు, అవనతే = అవనతుడవు అయి ఉండగా (వంగి ఉండగా), గగన గతయః = గగన సంచారులు, పృథుం అపి = విశాలమైన దైనప్పటికీ, దూరభావాత్ = దూరంగా ఉండటం వలన, తనుం = సన్నదిగా ఉన్నట్లు, తస్యా సింధోః = ఆ నది యొక్క ప్రవాహం = ప్రవాహాన్ని, నూనం = నిశ్చయంగా, దృష్టీః = చూపులను, ఆవర్జ్య = క్రిందికి వాల్చి, భువః = భూదేవి యొక్క, స్థూలమధ్య ఇంద్రనీలం = మధ్యన పెద్ద ఇంద్రనీలమణి కలిగిన, ఏకం ముక్తాగుణం ఇవ = ఒంటిపేట ముత్యాల హారమును వలె, ప్రేక్షిష్యంతే = చూచెదరు, వీక్షింతురు.

తా:– మేఘుడా ! నీవా చర్మణ్వతీ నదిని చేరి, దానినుండి జలాన్ని గ్రహించడానికై క్రిందికి వంగగానే ఆకాశవీధిలో సంచరించే గంధర్వాదులకు ఒక అపురూపమైన దృశ్యము కన్పించును. వారు దూరమునుండి వీక్షించటం వలన విశాలమైన ఆ నది ఒక చిన్న రేఖ వలె కన్పించును. దాని నడుమ కృష్ణుని నీలవర్ణాన్ని దోచుకున్న (నీలవర్ణంలో ఉన్న) నీవు ఇంద్రనీలమణిలా భాసించెదవు. మీ ఇరువురి కలయిక ఇంద్రనీలమణి నడుమ కూర్చబడిన ఒంటిపేట ముత్యాల హారము వలె ఉండును. గగన చారుల కది భూదేవి ధరించిన ముక్తాహారము అని తోచును. అందుచేత వారు ఆసక్తితో చూపులు క్రిందికి సారించి మిమ్ము వీక్షింతురు.

ఈ శ్లోకంలో 'నిదర్శన' 'ఉత్ప్రేక్ష' అలంకారములు గలవు.

కృష్ణవర్ణముతో తుల్యత్వాన్ని చూపించటంలో 'నిదర్శన'.

నదీ మేఘముల సంగమాన్ని ముక్తాహారంగా సంభావించటం 'ఉత్రేక్ష'. చర్మణ్వతీ నదిని దాటి ముందుకు సాగుతున్నాడు మేఘుడు.

తాముత్తీర్య వ్రజ పరిచితభ్రూలతా విభ్రమాణాం
పక్ష్మోత్క్షేపాదుపరి విలసత్కృష్ణశారప్రభాణాం,
కుందక్షేపానుగ మధుకర శ్రీముషామాత్మ బింబం
పాత్రీ కుర్వన్ దశపురవధూనేత్ర కౌతూహలానామ్. 51

In Public domain, Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ.:- తాం = ఆ నదిని, ఉత్తీర్య = దాటి, పరిచితభ్రూలతావిభ్రమాణాం = పరిచితమైన భ్రూలతా (కనుబొమల) విన్యాసముల యొక్క పక్ష్మ ఉత్క్షేపాత్ = కనురెప్పలు పైకి ఎత్తటం వలన, ఉపరివిలసత్ = పైన శోభించే, కృష్ణశారప్రభాణాం = నీల, రక్త, శ్వేత వర్ణకాంతుల యొక్క, కుందక్షేప అనుగ = కుంద ప్రసూనాల కదలికను అనుసరించు, మధుకర శ్రీముషాం = మధుకరముల శోభను దోచుకొనెడి (మధుకరముల శోభవంటి), దశపుర = దశపురం యొక్క వధూనేత్ర కౌతూహలానాం = యువతుల కళ్ళలోని కుతూహలాలకు, ఆత్మ బింబం = నీ రూపాన్ని, పాత్రీకుర్వన్ = పాత్రముగా చేస్తూ, వ్రజ = వెళ్ళుము.

తా :- ఆ చర్మణ్వతీ నదిని దాటి ముందుకుసాగే సమయంలో భ్రుకుటి విలాసాలను ఎరిగిన ఆ దశపురవనితలు తమ కనులరెప్పలు పైకెత్తి నిన్ను తిలకిస్తారు. అందమైన ఆ నీలి కనురెప్పలలో తెలుపు, ఎరుపుల మిశ్రమంతో కూడిన చూపులు కదలాడే కుందపుష్పాలు, వాటిని వెన్నంటే తుమ్మెదలు కలిసిన దృశ్యం యొక్క శోభను దోచేవిగా ఉంటాయి. అలాంటి ఆ దశపుర యువతుల కళ్ళలోని కుతూహలానికి (నీ రూపాన్ని పాత్రం చేస్తూ) పాత్రుడవై ముందుకు సాగిపొమ్ము.

వి :- కనులు, కనురెప్పలు - కుందప్రసూనాలు, తుమ్మెదలతో పోల్చబడినాయి. చంచలమైన నేత్రాలు - ఊగిసలాడే కుందప్రసూనాలు, పైకి కదిలే రెప్పలు ఆ పూలననుసరించే తుమ్మెదలు - ఇదంతా కవి మనోహర ఊహకు రూపకల్పన.

ఇచట 'ఉపమాలంకార' సౌందర్యం ఉట్టి పడుతూంది.

మేఘుడు క్రమక్రమంగా హిమాలయాలకు చేరువౌతున్నాడు. బ్రహ్మావర్తకురుక్షేత్రాలను దాటి ముందుకు సాగాలి. ఆ బ్రహ్మావర్త, కురుక్షేత్రాల వర్ణన రాబోయే శ్లోకాల్లో సాగుతుంది.

బ్రహ్మావర్తం జనపదమథచ్ఛాయయా గాహమానః
క్షేత్రం క్షత్ర ప్రధన పిశునం కౌరవం తద్భజేథాః,
రాజన్యానాం శితశరశతై ర్యత్ర గాండీవధన్వా
ధారాపాతైస్త్వమివ కమలాన్యభ్యవర్షన్ముఖాని. 52

ప్ర.అ: - అథ = అనంతరం, బ్రహ్మావర్తం = బ్రహ్మావర్తమనే, జనపదం = దేశమును, ఛాయయా = నీడచేత, గాహమానః = ప్రవేశించినవాడవై, క్షత్రప్రధన

In Public domain. Digitization Muthulakshmi Research Academy

పిశునం = క్షత్రియయుద్ధాన్ని సూచించే, తత్ = ఆ, కౌరవం క్షేత్రం = కురుక్షేత్రాన్ని, భజేథాః = చేరుము, యత్ర = ఏ కురుక్షేత్రమునందైతే, గాండీవధన్వా = గాండీవధారి, అర్జునుడు, శితశరశతైః = వందల కొలది పదునైన బాణాలచేత, రాజన్యానాం = రాజ సమూహముల యొక్క అనేకమంది రాజుల యొక్క, ముఖాని = వదనములను, ధారాపాతైః = వర్షధారలచే, కమలాని = పద్మములను, త్వం ఇవ = నీకువలె, అభ్యవర్షత్ = కురిపించి ముంచెత్తెనో.

తా :- అటుపిమ్మట బ్రహ్మావర్తమనే దేశమును నీ ఛాయతో ప్రవేశించుము. అక్కడ గొప్ప క్షత్రియ సమరానికి ఆలవాలమైన కురుక్షేత్రాన్ని చేరుము. అది కురు పాండవ క్షాత్ర సమరాన్ని చాటి చెపుతుంది. ఆ క్షేత్రంలోనే గాండీవధారియైన అర్జునుడు నీవు పద్మములపైన ధారాపాతంగా వర్షం కురిపించినట్లుగా, శత్రు రాజుల వదనాలపై తీక్ష్ణశరవర్షాన్ని కురిపించినాడు.

వి.- మేఘం జనపదంలోకి ప్రవేశించలేదు కనుక 'నీడతో' ప్రవేశించమని చెపుతున్నాడు. వర్షానికి కమలాలు పాడైపోతాయి. శరవర్షానికి వదనాలు మిగలవు. ఈ విధంగా మేఘునకు అర్జునితో పోలిక చెప్పాడు.

అనుక్షణం గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే ప్రతిచోటా కవి చాలా జాగరూకత వహించాడు. ఎక్కడ మేఘం కురుస్తుందో ఆ ప్రదేశంలో మేఘుని వర్షప్రసక్తి వస్తుంది, లేని చోట మామూలు ప్రయాణం వర్ణిస్తాడు.

బ్రహ్మావర్త దేశమనగా - సరస్వతీ, దృషద్వతీ నదుల నడుమనున్న ప్రదేశము. ఈ శ్లోకంలో 'ఉపమాలంకారము'.

'సరస్వతి' నది కాళిదాసు కాలం నాటికి ప్రవాహరూపంలో ఉన్నట్లు రాబోయే శ్లోకం వలన తెలుస్తుంది. ఆ నదిని ఇలా వర్ణిస్తున్నాడు-

హిత్వా హాలామభిమతరసాం రేవతీలోచనాఙ్కాం
బన్ధుప్రీత్యా సమరవిముఖో లాఙ్గలీ యాః సిషేవే,
కృత్వా తాసామభిగమమపాం సౌమ్య సారస్వతీనా-
మంతశ్శుద్ధస్త్వమపి భవితా వర్ణమాత్రేణ కృష్ణః. **53**

In Public Domain- Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ:- హే సౌమ్య! = ఓ సౌమ్యమూర్తీ!, బన్ధు ప్రీత్యా = బంధుప్రీతిచేత, సమర విముఖః = యుద్ధవిముఖుడై, లాంగలీ = హలధారి బలరాముడు, అభిమతరసాం = ప్రియమైన రసం కలది, రేవతీలోచనాంకాం = రేవతి నేత్రాల గుర్తు కలది, హాలాం = మధువును, హిత్వా = త్యజించి, యాః = ఏ సరస్వతీ జలమును, సిషేవే = సేవించెనో, తాసాం = వాటి యొక్క, సారస్వతీనాం అపాం = సరస్వతీ జలము యొక్క, అభిగమం = చేరుటను, కృత్వా = చేసి, అంతశ్శుద్ధః = అంతరంగమందు పవిత్రుడవైన, త్వం = నీవు, అపి = కూడా, వర్ణమాత్రేణ = రంగుచేతమాత్రమే, కృష్ణః = నల్లనివాడవు, భవితా = కాగలవు.

కౌరవ పాండవ యుద్ధం నిశ్చయమైనపుడు బలరామునికి ఆ యుద్ధం ఎంతమాత్రం ఇష్టం లేకపోయింది. అందుచేత అతడు సరస్వతీతీరానికి వచ్చి అక్కడ ఉండిపోతాడు. ఈ విషయాన్నే వర్ణిస్తున్నాడు.

తా. - "ఓ సౌమ్యుడా! మేఘుడా! బంధుప్రీతిచేత సమరవిముఖుడైన హలధరుడు తనకత్యంత ప్రియమైన పానీయాన్ని , రేవతి లోచనాల చిహ్నం కలదాన్ని మధువును త్యజించి సరస్వతీ నదీ జలాన్ని సేవించాడు. ఆ సరస్వతీ పావన జలాన్ని పొంది అంతరంగంలో స్వచ్ఛత కలిగిన నీవు రంగుచేతమాత్రమే నల్లనివాడవు కాగలవు.

వి. - నల్లని వాడు అనటంలో అర్థం 'మలినుడు' అని కూడా వస్తుంది. అందుచేత రంగుచేతమాత్రమే నల్లనివాడవు. అంతరంగంలో పవిత్రుడవు అని నొక్కి వక్కాణించబడింది. ఆ నదీజలం నీకు పవిత్రతను చేకూరుస్తుంది అని అర్థం.

ఇక 'మధువు' అత్యంత ప్రీతిపాత్రం బలరామునకు. అయితే బంధునాశనం చూడలేని అతడు విరక్తితో యుద్ధవిముఖుడై సరస్వతీ తీరాన్ని ఆశ్రయించాడు. తన కిష్టమైన మధుపానాన్ని త్యజించాడు. అతనికి భార్య రేవతి పట్ల అంతులేని అనురాగం. ఆమె నేత్రాంకితమైన 'మధువు' అనటంలో ఆమె కళ్ళు చాలా అందమైనవనీ, ఒక రకమైన 'మత్తు' ను సంతరించుకున్న సౌందర్యం వాటికుందనీ (నిషా కళ్ళు) భావం.

తరువాత 'గంగానదిని' వర్ణిస్తున్నాడు యక్షుడు.

తస్మాద్గచ్ఛేరను కనఖలం శైలరాజావతీర్ణాం
జహ్నోః కన్యాం సగరతనయ స్వర్గసోపాన పంక్తిం,

In Public domain: Digitization Muthulakshmi Research Academy

గౌరీవక్త్రభ్రుకుటిరచనాం యా విహస్యేవ ఫేనైః
శంభోః కేశగ్రహణమకరోదిందులగ్నోర్మిహస్తా. **54**

ప్ర.అ:- తస్మాత్ = ఆ కురుక్షేత్రమునుండి, అనుకనఖలం = 'కనఖల' ప్రదేశాన్నను సరించి ప్రవహించునది, శైలరాజావతీర్ణాం = పర్వతరాజగు హిమవంతునినుండి అవతరించినది, సగరతనయ = సగరచక్రవర్తి కుమారులకు, స్వర్గసోపాన పంక్తిం = స్వర్గమునకు మార్గమేర్పరచు సోపానపంక్తి ఐనదానిని, జహ్నోః = జహ్ను మహర్షియొక్క కన్యాం = పుత్రికయగుదానిని, గచ్ఛేః = సమీపించుము, యా = ఏ జాహ్నవి ఐతే, గౌరీవక్త్రభ్రుకుటిరచనాం = అసహనంతో గౌరీదేవి చూపిన భృకుటిని, కనుబొమల చిట్లింపును, ఫేనైః = తెల్లనినురగలచేత, విహస్య ఇవ = పరిహసిస్తున్నట్లుగా, ఇందులగ్న ఊర్మిహస్తా = చంద్రుని యందు తగుల్కొన్న తరంగాలే చేతులుగా కలదియై, శంభోః = పరమ శివుని, కేశగ్రహణం = జుట్టు పట్టుకొనటం, అకరోత్ = చేసెనో.

తా:- ఆ, సరస్వతీ నదీ జలము, సేవించి, ముందుకు సాగిన నీకు, హిమవంతుని నుండి జాలువారే గంగానది దర్శనమిస్తుంది. పవిత్రమైన ఆ జాహ్నవీనదిని చేరుము. ఆమె సామాన్య కాదు. సగర చక్రవర్తుల పాపమును ప్రక్షాళితం చేసి వారి స్వర్గమనానికై ఏర్పడిన సోపాన పంక్తి ఆమె. అంతేకాదు, తన భర్త శిరసున చేరుతున్న ఆ గంగను చూసి పార్వతీ దేవి అసహనంతో కనుబొమలు చిట్లించి చూడగా, ఆ చూపును లెక్క చేయకుండా, ఆమెను పరిహసిస్తున్నట్లుగా (నవ్వుల వలె) ఉన్న తెల్లని నురగలతో సాగిపోతూ (ఆమె ఎదుటనే) శివుని శిరమందు గల చంద్రుని తన తరంగ హస్తాలతో పట్టుకొని, శివుని జటాజూటాన్ని అందిపుచ్చుకున్న గడసరి.

వి:- గంగావతరణ వృత్తాంతాన్ని అందంగా ఇందులో పొదిగాడు కవి కులగురువు. ఈ శ్లోకంలో 'ఉత్ప్రేక్ష' 'రూపక' అలంకారాలున్నాయి.

మేఘుడు నీల వర్ణుడు. అతడు గంగానదిలో ప్రతిబింబిస్తే ఆ దృశ్యం గంగాయమున సంగమంలా ఉంటుందని వర్ణిస్తున్నాడు కవి.

తస్యాః పాతుం సురగజ ఇవ వ్యోమ్ని పశ్చార్ధలంబీ
త్వం చేదచ్ఛస్ఫటికవిశదం తర్కయేస్తిర్యగంభః,
సంసర్పంత్యా సపదిభవతః స్రోతసిచ్ఛాయయాసౌ
స్యాదస్థానోపగతయమునా సంగమేవాభిరామా. **55**

ప్ర.అ:- (హే మేఘ!) సురగజః ఇవ = దిగ్గజం వలె, వ్యోమ్ని = ఆకాశమందు, పశ్చార్ధలంబీ = వెనుకభాగము వేలాడుచుండగా (మేఘము కదలిక, వర్ణనం), తస్యాః = ఆ భాగీరథీనది యొక్క అచ్ఛస్ఫటికవిశదం = స్వచ్ఛమైన స్ఫటికంలా నిర్మలంగా ఉన్న, అంభః = జలము, తిర్యక్ = తలక్రిందుగా (క్రిందివైపు వంగి), పాతుం = త్రాగుటకు, తర్కయేః = నీవు తలచినచో, సపది = ఆక్షణముననే, సంసర్పంత్యా = ముందుకుసాగుచున్న, భవతః ఛాయయా = నీ నీడచేత (ప్రతిబింబముచేత), అసౌః = ఈ గంగానది, అస్థాన ఉపగత = చోటుగాని చోట చేరిన (పొందిన), యమునా సంగమా ఇవ = యమునా నదితో సంగమము కలదివలె, అభిరామా = చూడముచ్చటైనది, స్యాత్ = అగును.

తా:- దిగ్గజంలా ఆకాశంలో తేలియాడుతూన్న నీవు నీ పృష్ఠభాగము వ్రేలాడుతుండగా, తలను క్రిందుగా వంచి, స్వచ్ఛమైన స్ఫటికంలా నిర్మలంగా (తెల్లగా) ఉన్న ఆ గంగానది జలాన్ని త్రాగుటకై ఉపక్రమించగా ఆ దృశ్యం ఇలా మనోజ్ఞంగా ఉంటుంది - నీవు గంగానదివైపు వెళుతూంటే ముందుకు సాగే నీ నీలి ప్రతిబింబం ఆ స్ఫటిక వర్ణపు గంగాజలంలో ప్రతిఫలించగా అదిచోటుగానిచోట గంగానది యమునతో కలిసినట్లుగా (గంగా యమునల సంగమంలా) చూడముచ్చటగా, మనోజ్ఞంగా ఉంటుంది.

ఈ శ్లోకంలో 'లుప్తోపమ' 'ఉత్ప్రేక్ష' అలంకారాలున్నాయి. 'గంగానది' దాటగానే ఇక వచ్చేది హిమగిరి శిఖరమే. హిమగిరి ప్రాంతంలోనే కైలాసగిరి ఉంటుంది. అక్కడే 'అలక్‌నందా' - అలకాపురి. ముందు ముందు హిమగిరి వర్ణన వస్తుంది.

❋ ❋ ❋ ❋ ❋

మేఘుడు హిమాలయాల్ని చేరటం, హిమాద్రివర్ణనం, అటుపైన కైలాసగిరి, గౌరీ శంకరుల విహారవర్ణనం

గంగానదిని దాటి హిమాద్రిని చేరే మేఘుని వర్ణనం -

ఆసీనానాం సురభితశిలం నాభిగంధైర్మృగాణాం
తస్యా ఏవ ప్రభవమచలం ప్రాప్య గౌరం తుషారైః,
వక్ష్యస్యధ్వ శ్రమ వినయనే తస్య శృంగే నిషణ్ణః
శోభాం శుభ్రత్రినయన వృషోత్ఖాత పంకోపమేయామ్. 56

In Public domain. Digitization Muthulakshmi Research Academy

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ.– ఆసీనానాం = కూర్చొని ఉన్న, మృగాణాం = కస్తూరీ మృగముల యొక్క నాభిగంధైః = నాభినుండి వెలువడే సుగంధములచేత, సురభితశిలం = సువాసనభరితమైన శిలలు కలిగినది, తుషారైః = హిమకణములచేత, గౌరం = తెల్లగా ఉన్నది, తస్యాః ఏవ ప్రభవం = ఆ గంగానదికి జన్మస్థలమైనది, అచలం = పర్వతాన్ని, ప్రాప్య = చేరి, అధ్వశ్రమ = మార్గాయాసమును, వినయనే = పోగొట్టుకొనుటకై, తస్య శృంగే = ఆ గిరి శిఖరంపైన, నిషణ్ణః = ఉపవిష్టుడవై, శుభ్రత్రినయన వృష = త్రినేత్రుని యొక్క ధవళమైన వృషభంచేత, ఉత్ఖాత = పైకి ఎగజిమ్మబడిన, పంక ఉపమేయామ్ = పంకముతో పోల్చదగిన శోభను, వక్ష్యసి = వహించగలవు,

తా:– (ఇంతకుమునుపు నీవు చూచిన) ఆ గంగాదేవి జన్మస్థలమైన హిమగిరి అక్కడ శిలలపై కూర్చొని ఉండే కస్తూరీమృగముల యొక్క నాభినుండి వెలువడే సుగంధము చేత పరిమళభరితమైన శిలలు కలదీ, అంతటా అవరించిన హిమకణముల చేత ధవళవర్ణంతో కూడినదీ అయిఉన్నది. అలాంటి హిమగిరి శిఖరాన్ని చేరి, మార్గాయాసమును తొలగించుకొనుటకై నీవు అక్కడ విశ్రమించినపుడు, త్రినేత్రుడైన పరమశివుని వాహనమైన తెల్లని వృషభము (తన కొమ్ములతో) పైకి చిమ్మగా ఏర్పడిన పంకంతో పోల్చదగిన సొగసును పొందెదవు.

వి:– కాళిదాసుకు హిమాలయాలంటే చెప్పలేని ప్రీతి. కుమార సంభవంలో మొదటి సర్గలో సగభాగం హిమాలయవర్ణనమే. అక్కడ ఉండే కస్తూరీ మృగాలు, చమరీ మృగాలు, ఆ గిరి శృంగాల సొగసు అన్నీ సాక్షాత్కరింపచేస్తాడు. తెల్లని హిమాలయం పరమేశ్వరుని వృషభవాహనంలా ఉండగా, ఆ గిరి శిఖరంపై ఉన్న మేఘం నల్లగా ఉండటం చేత పైకెగజిమ్మబడిన బురదలా (పంకంలా) ఉంది. ఊహాజనితమైన ఈ దృశ్యం మనోజ్ఞంగా ఉంది. అంతేగాని పంకం మనోజ్ఞంగా ఉందని అర్థం కాదు. వృషభం యొక్క చేష్ట మనోజ్ఞంగా ఉందని అర్థం.

ఈ శ్లోకంలో 'ఉపమాలంకారం' ఉంది.

ప్రకృతి ఆరాధకుడైన కాళిదాస కవి మనసు అత్యంత సుకుమారమైనది. అతని రచనల్లో ఎక్కడా రౌద్ర, బీభత్సాలు చోటుచేసుకోవు. వనాల్ని దహించి, వన్యమృగాల్ని నిరాశ్రయుల్ని చేస్తుంది దవానలం. అలాంటి దవానలాన్ని (కార్చిచ్చును) ఉపశమింపజేసి పుణ్యం కట్టుకోమంటాడు మేఘుణ్ణి యక్షుడు. మేఘం గ్రీష్మతాపాన్నీ, విరహతాపాన్నేకాదు, కార్చిచ్చునూ ఉపశమింపజేస్తుందని దాని యొక్క మహత్త్వాన్ని తెలియచేస్తున్నాడు కవి.

తం చేద్వాయౌ సరతి సరలస్కంధ సంఘట్టజన్మా
In Public domain. Digitization Muthulakshmi Research Academy
బాధేతోల్కాక్షపిత చమరీవాల భారో దవాగ్నిః,
అర్హస్యేనం శమయితుమలం వారి ధారా సహస్రై-
రాపన్నార్తి ప్రశమన ఫలాః సంపదోహ్యుత్తమానాం. 57

ప్ర.అ.:- వాయౌ సరతి = వాయువు వీచునపుడు, సరలస్కంధ = సరళ వృక్షముల (దేవదారు వృక్షముల) కొమ్మల, సంఘట్ట జన్మా = రాపిడివలన జనించిన, ఉల్కాక్షపిత = నిప్పుకణములచేత దగ్ధమైన, చమరీవాలభారః = చమరీ మృగముల వాలములందలి (తోకయందలి) వెంట్రుకలు కలది, దవాగ్నిః = దవానలము, తం = ఆ హిమగిరిని, బాధేతచేత్ = పీడించినచో, ఏనం = ఈ దవాగ్నిని, వారిధారాసహస్రైః = వేలకొలది జలధారలచేత, శమయితుం అలం = శమింపజేయ మిక్కిలి సమర్థుడవు, అర్హసి = తగుదువు, ఉత్తమానాం = ఉత్తములకు, సంపదః = సంపదలు, ఆపన్న = ఆపన్నులైనవారి, ఆర్తి = బాధను, ప్రశమన ఫలాః = ఉపశమింపజేయుటయే ప్రయోజనంగా కలవి, హి = నిజముగా, నిక్కము,

తా:- ఒకవేళ వాయువు వీచినపుడు ఆ హిమగిరి వనాల్లో దేవదారు వృక్షముల యొక్క కొమ్మలు ఒకదానితో ఒకటి ఒరుసుకొని ఆ ఘర్షణ వలన దవాగ్ని ప్రజ్వరిల్లి, ఎగసిపడే తన నిప్పురవ్వల చేత చమరీమృగాల వెంట్రుకల్ని దహించి, ఆ హిమగిరికి బాధను కలిగించినట్లయితే ఆ బాధను ఉపశమింపచేయుటకు నీవు సర్వ సమర్థుడవు. నిరంతర జలధారా వర్షంతో నీవు ఆ దవాగ్నిన్ని ఉపశమింపజేయుము. ఆపదలో ఉన్నవారి ఆర్తిని తొలగించి, ఆదుకోవటమే కదా! ఉత్తములకు ఐశ్వర్యములు. (నీవును ఉత్తముడవు. ఇంతకన్నా నీకుకావలసింది ఏముంది?)

వి:- తన నాశ్రయించుకుని ఉండే చమరీ మృగాలకు బాధకలిగితే హిమవంతునకు కూడా బాధే. ఇచట అలంకారము 'అర్థాంతరన్యాసము'.

హిమాలయాల్లో అరుదైన జంతుజాతులెన్నో ఉంటాయి. చమరీమృగాలు, శరభ మృగాలు మొదలైనవి. చమరీమృగాల తోకలందుకల వెంట్రుకలతో చామరములు, దేవతలకు రాజులకూ వీచే వింజామరలు నిర్మించబడతాయి. శరభాలు ఎనిమిది కాళ్ళుగల వింత జంతువులు, క్రూరమృగాలు కూడా. వాటిని రాబోయే శ్లోకంలో వర్ణిస్తున్నాడు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

యే సంరంభోత్పతన రభసాః స్వాంగభంగాయ తస్మిన్
ముక్తాధ్వానం సపది శరభాలంఘయేయుర్భవంతం,
తాన్కుర్వీథాస్తుముల కరకావృష్టిపాతావకీర్ణాన్
కే వా న స్యుః పరిభవపదం నిష్ఫలారంభయత్నాః. 58

ప్ర.అ.:- తస్మిన్ = ఆ హిమగిరియందు, సంరంభ = హడావిడిగా, త్వరపాటుతో, ఉత్పతన రభసాః = పైకి దుముకటానికి తొందరపడే, యే శరభాః = శరభమృగము లేవైతే కలవో, ముక్తాధ్వానం = మార్గము వదిలిన, భవంతం = నిన్ను, స్వాంగభంగాయ = తమ అంగముల భంగపాటుకై, సపది = వెంటనే, లంఘయేయుః = లంఘించగలవు, తాన్ = అట్టి ఆ మృగాలను, తుముల = తీవ్రమైన, కరకావృష్టిపాత = వడగళ్ళవర్షాన్ని కురిపించి, అవకీర్ణాన్ = చెల్లాచెదరగునట్లుగా, కుర్వీథా = చేయుము, నిష్ఫల ఆరంభయత్నాః = ఫలించని ప్రయత్నాన్ని చేపట్టినవారు, కే వా = ఎవరైనా, పరిభవపదం = అవమానానికి ఆస్పదులు, న స్యుః = కాక ఉందురు, కారు?

తా:- ఆ హిమాద్రియందు శరభములనే అష్టపాద (ఎనిమిది కాళ్ళుగల) వింత క్రూర జంతువులుంటాయి. అవి ప్రత్యర్థి మృగాలను చూడగానే పైకి లంఘిస్తాయి. నిన్ను చూచి కూడా ఏ వనగజమో అనుకొని నీవు మార్గాన్ని వదలగానే నీ పైకి లంఘిస్తాయి. అయితే అది వాటి అంగాల భంగపాటుకే, నీవు ఆ మృగాలపైన భయంకరమైన వడగళ్ళవానను కురిపించి అవి అటూ ఇటూ పరిగెత్తేటట్లుగా జేయి. చేతగాని ప్రయత్నానికి (నిష్ఫల యత్నానికి) పూనుకొనే వారు ఎవరైనా అవమానాల పాలు కాకుండా ఉందురా? (అవమానాలకు గురికాక తప్పదు).

ఈ శ్లోకంలో 'అర్థాంతరన్యాసాలంకారం' ఉంది.

ఆ హిమాలయం పైన శంకరుని పాదముద్రగల శిల ఒకటి ఉందట. దానికి వందనమాచరించి వెళ్ళమంటాడు యక్షుడు మేఘునితో -

తత్ర వ్యక్తం దృషది చరణన్యాసమర్ధేందుమౌలేః
శశ్వత్సిద్ధైరుపచిత బలిం భక్తి నమ్రః పరీయాః,
యస్మిన్ దృష్టే కరణవిగమాదూర్ధ్వముద్ధూతపాపాః
కల్పిష్యంతే స్థిరగణపద ప్రాప్తయే శ్రద్ధధానాః. 59

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్ర.అ.- తత్ర = ఆ హిమాలయం నందు, దృషది = శిలపైన, వ్యక్తం = కనపడుచున్న, ప్రకటితమైన, శశ్వత్ = నిరంతరము, సిద్ధైః = సిద్ధులచేత, ఉపచిత బలిం = పూజాదులు సమర్పింపబడిన, అర్ధఇందుమౌళేః = అర్ధచంద్రుణ్ణి శిరసుపైన ధరించిన శివుని యొక్క, చరణన్యాసం = పాదన్యాసాన్ని, భక్తినమ్రః = భక్తి వినమ్రుడవై, పరీయాః = ప్రదక్షిణమొనర్చుము (చుట్టు తిరుగుము), యస్మిన్ = ఏపాదన్యాసమునైతే, దృష్టే = చూచిన యెడల, శ్రద్ధధానాః = శ్రద్ధావంతులైనవారు, ఉద్ధూతపాపాః = ఎగరగొట్టబడిన (తొలగింపబడిన) పాపములు గలవారు, కరణవిగమాత్ ఊర్ధ్వం = శరీరము నశించిన పిమ్మట, (శరీరము తొలగిపోయిన పిదప), స్థిరగణపదప్రాప్తయే = ప్రమథ గణంలో శాశ్వతస్థానం పొందుటకు, కల్పిష్యంతే = అర్హులగుదురు.

తా:- ఆ హిమాలయమునందు ఒక శిలపై పరమశివుని పాదముద్రిక ప్రకటితమై ఉన్నది. ఆ శిల నిరంతరము సిద్ధులొనర్చు పూజాదులతో శోభించుచుండును. నీవు భక్తి వినమ్రుడవై ఆ శిలకు ప్రదక్షిణ మొనరింపుము. శివ చరణాంకితమైన ఆ శిలను చూచినంతనే భక్తి, శ్రద్ధలు గలవారి పాపములు తొలగిపోవును. వారు శరీర త్యాగానంతరం (మరణానంతరం) శివుని ప్రమథగణాల్లో శాశ్వత స్థానం పొందటానికి అర్హులు కాగలరు.

ఇక పరమశివుని పూజలో కూడా భేరీనాదం వంటి తన గంభీర స్వరం ధ్వనించి సేవించమంటున్నాడు మేఘునితో యక్షుడు.

శబ్దాయంతే మధురమనిలైః కీచకాః పూర్యమాణాః
సంసక్తాభిస్త్రిపుర విజయో గీయతే కిన్నరీభిః,
నిర్హ్రాదస్తే మురజ ఇవ చేత్కందరేషు ధ్వనిః స్యాత్
సంగీతార్థో నను పశుపతే స్తత్ర భావీ సమగ్రః. **60**

ప్ర.అ:- తత్ర = ఆ హిమాలయములందు, అనిలైః = వాయువులచే, పూర్యమాణాః = పూరింపబడుచున్న, కీచకాః = రంధ్రములతోడి వెదుళ్ళు, మధురం = తీయగా, శబ్దాయంతే = ధ్వనులు చేయుచున్నవి, సంసక్తాభిః = వేణునాదానురక్తలైన, కిన్నరీభిః = కిన్నెరాంగనలచేత, త్రిపురవిజయః = త్రిపురాసుర సంహారకథ, (అక్కడి విజయము), గీయతే = పాడబడుచున్నది, కందరేషు = గుహలందు, తే = నీ యొక్క, నిర్హ్రాద = ధ్వని, మురజే = మృదంగమున వెలువడు, ధ్వనిః ఇవ = ధ్వనివలె, స్యాత్ చేత్ = అయినచో,

In Public domain. Digitization Muthulakshmi Research Academy

పశుపతేః = పరమశివుని యొక్క, సంగీతార్థః = సంగీతమునకు కావలసిన సామగ్రి, సమగ్రః = సంపూర్ణము, భావీ నను = అగును కదా!

తా:- హిమగిరిపై ఎన్నో వెదురువనములున్నవి. వెదుళ్లలోని రంధ్రములలో వాయువు ప్రవేశించినపుడు వేణునాదం వంటి నాదం వెలువడుతుంది. ఆ విధంగా గాలిచేత పూరించబడిన వెదుళ్ళు మధురమైన ధ్వనులు చేస్తాయి. అక్కడే ఉన్న కిన్నెరయువతులు ఆ నాదానికనుగుణంగా త్రిపుర విజయగీతాన్ని ఆలపిస్తారు (ఇక గానానికి కావలసినది మృదంగనాదమే). నీ మంద్రమైన గర్జన గుహలలో ప్రతిధ్వనించి మృదంగనాదంలా అక్కడ వ్యాపిస్తే ఇక పరమశివునికి కావలసిన సంగీతసామగ్రి సంపూర్ణంగా సమకూరినట్లే అవుతుంది కదా!

వి:- హిమగిరిపై వెదుళ్ళ నుండి వేణునాదమూ, కిన్నెరలగానమూ కుమార సంభవంలో కూడా వర్ణించబడినాయి. వెదురులో రంధ్రాలుంటే అది వేణువే కదా! సంగీతానికి అత్యంత ప్రధానమైనవి వేణువు మరియు మృదంగం. ఈ వర్ణనను బట్టి కాళిదాస కవికి గాంధర్వ విద్య (సంగీతం) తో కూడా మంచి పరిచయమున్నట్లు విదితమౌతుంది.

హిమాలయాల్లో ఉన్న 'క్రౌంచరధ్రం' మానససరోవరానికి ద్వారం. ఆ క్రౌంచపర్వత ప్రాశస్త్యం రాబోయే శ్లోకంలో వర్ణించబడుతుంది.

ప్రాలేయాద్రేరుపతటమతిక్రమ్య తాంస్తాన్విశేషాన్
హంసద్వారం భృగుపతి యశోవర్త్మ యత్క్రౌంచరంధ్రమ్,
తేనోదీచీం దిశమనుసరేస్తిర్యగాయామశోభీ
శ్యామః పాదో బలినియమనాభ్యుద్యతస్యేవ విష్ణోః. **61**

ప్ర.అ.- ప్రాలేయాద్రేః = మంచుకొండ యొక్క, ఉపతటం = చరియలందు, చరియల సమీపమున, తాన్‌తాన్ = ఆయా, విశేషాన్ = విశేషములను, అతిక్రమ్య = దాటుచు (చూచుచు), భృగుపతి = భార్గవరాముని, యశోవర్త్మ = కీర్తిమార్గము, హంసద్వారం = హంసలు వెళ్ళు ద్వారము, యత్ = ఏదైతే కలదో, క్రౌంచరంధ్రం = ఆ క్రౌంచరంధ్రము, తేన = దాని ద్వారా, బలినియమన = బలిని అణచుటకు, అభి ఉద్యతస్య = పైకి ఎత్తబడిన, విష్ణోః = విష్ణువు యొక్క, శ్యామః = శ్యామవర్ణమందున్న,

పాదః ఇవ = పాదమువలె, తిర్యక్ ఆయామశోభీ = క్రిందుగా తిరుగుటచే శోభాయమానంగా ఉన్నవాడవై, ఉదీచీం = ఉత్తరదిక్కును, అను సరేః = అనుసరింపుము.
In Public domain. Digitization Muthulakshmi Research Academy

తా:- హిమాలయములందలి ఆయా విశేషాలను చూస్తూ ఆ పర్వత సానువులవెంట అలా ముందుకు సాగిపో. అలా వెళ్తున్న నీకు క్రౌంచరంధ్రం కనుపిస్తుంది. ఒకానొకప్పుడు కార్తికేయునితో స్పర్ధకలిగినపుడు ఒకే వ్రేటుతో పర్వతాన్ని ఛేదించాడు భృగువంశీయుడు పరశురాముడు. ఆ విధంగా ఆ క్రౌంచరంధ్రం పరశురాముని కీర్తిని చాటి చెప్పే మార్గమయింది. ఆ క్రౌంచరంధ్రం ద్వారా నీవు ఉత్తరదిశగా పయనించాలి. మానస సరోవరాన్ని చేరే హంసలు ఆ రంధ్రం ద్వారానే వెళతాయి. ఆ రంధ్రాన్ని ప్రవేశించటానికై తదనుగుణంగా నీ శరీరాన్ని ఇంచుక తలక్రిందుగా నీవు త్రిప్ప గానే నీలనీలశరీరం, బలిని అణచటానికై పైకెత్తబడిన విష్ణువు యొక్క శ్యామవర్ణపాదంలా శోభాయమానంగా ఉంటుంది.

ఈ శ్లోకంలో ఉపమా రూపకాలంకారాలున్నాయి.

మేఘునికి గమ్యం సమీపిస్తుంది. ఉత్తరదిక్కుగా వెళ్ళి కైలాసపర్వతాన్ని చేరబోతున్న మేఘునకు కైలాసపర్వతం ఎలా కన్పడుతుందో వర్ణిస్తున్నాడు యక్షుడు.

గత్వాచోర్ధ్వం దశముఖభుజోచ్ఛ్వాసిత ప్రస్థసంధేః
కైలాసస్య త్రిదశవనితా దర్పణస్యాతిథిః స్యాః,
శృంగోచ్ఛ్రాయైః కుముదవిశదైర్యో వితత్యస్థితః ఖం
రాశీభూతః ప్రతిదినమివ త్ర్యంబకస్యాట్టహాసః. **62**

ప్ర.అ.- ఊర్ధ్వం చ గత్వా = మరియు పైకి ఉత్తరదిశగా వెళ్ళి, దశముఖ = దశకంఠుడైనరావణుని, భుజ ఉచ్ఛ్వాసిత = బాహువుల బలం చేత కదల్చబడిన, ప్రస్థసంధేః = సానువుల సంధులు (బీటలు) కలది, త్రిదశవనితా = దేవవనితల, దర్పణస్య కైలాసస్య = అద్దమువంటి హిమగిరికి, అతిథిః స్యాః = అతిథివి అగుము, యః = ఏ కైలాసగిరి ఐతే, కుముదవిశదైః = కలువల కాంతిని పోలిన, శృంగోచ్ఛ్రాయైః = ఎత్తయిన తెల్లని శిఖరాల చేత, ఖం = ఆకాశాన్ని, వితత్య = వ్యాపించి, ప్రతిదినం = ప్రతిరోజూ, రాశీభూతః = పోగుపడిన, ఒకచోట చేరిన, త్ర్యంబకస్య = మూడు నేత్రములు కలిగిన శివుని యొక్క, అట్టహాసః ఇవ = అతిహాసము వలె, స్థితః = ఉన్నదో!

In Public domain. Digitization Muthulakshmi Research Academy

తా:- అలా పైకి సాగి నీవు దశకంఠుని భుజాల చేత పెకలించబడి, సంధులు ఏర్పడిన సానువులుగల కైలాసశిఖరానికి అతిథిగా వెళ్ళుము. ఆ కైలాసగిరి దేవతావనితలకు దర్పణము (అంత స్వచ్ఛమైనది). కలువలకాంతిని కలిగిన ఆ కైలాసగిరి తెల్లని శిఖరములు ఆకాశమంతా వ్యాపించి ఉంటాయి. వాటిని చూస్తే ముక్కంటి పరమశివుని (అట్టహాసం) నవ్వులన్నీ ఒకచోట రాశిగా చేరినట్లు అనిపిస్తుంది.

వి.- రావణుడు ఇరవై భుజాలతో తన బలమంతా ఉపయోగించి, కైలాసాన్ని పెకిలించబోగా ఆ పర్వతం కదిలింది. దాని చరియలలో పగుళ్ళు ఏర్పడినాయి. అవి ఒక చోట చేరి సంధులుగా రూపొందినాయి. నవ్వు తెల్లన, కలువలు తెల్లన, మంచు తెల్లన. అందుచేత కవి 'పరమేశ్వరుని నవ్వు ఏకత్రితమై హిమగిరిశిఖరాలుగా రూపుదాల్చిందా అన్నట్లుంది' అని ఉత్ప్రేక్షించాడు.

ఈ శ్లోకమున 'ఉత్ప్రేక్షాలంకారము' ఉంది.

కైలాసాన్ని చేరాక మేఘుడు ఎలా ఉంటాడో ఊహించి చెప్తున్నాడు యక్షుడు.

ఉత్పశ్యామి త్వయి తటగతే స్నిగ్ధభిన్నాంజనాభే:
సద్యః కృత్తద్విరదరదనచ్ఛేద గౌరస్య తస్య,
శోభామద్రేః స్తిమితనయన ప్రేక్షణీయాం భవిత్రీ-
మంసన్యస్తేసతి హలభృతో మేచకే వాససీవ. 63

ప్ర.అ:- స్నిగ్ధ = నునుపైన, భిన్న అంజన ఆభే = నూరబడిన (మర్దనము చేయబడిన) కాటుకవంటి కాంతిగల, త్వయి = నీవు, తటగతేసతి = ఆ పర్వతతటమును చేరగా, సద్యః = అప్పుడే, కృత్త = ఖండించబడిన, ద్విరద = ఏనుగు యొక్క, రదనచ్ఛేద = దంతపుముక్కవంటి, గౌరస్య = తెల్లని వర్ణముగల అతనియొక్క, శోభాం = అందాన్ని, మేచకే = నీలపురంగుగల, వాససి = వస్త్రము, అంసన్యస్తేసతి = భుజముపై ఉంచబడగా, హలభృతః = బలరాముని యొక్క, శోభాం = శోభను, స్తిమితనయనప్రేక్షణీయాం = కనురెప్పపాటులేకుండా చూడదగిన, భవిత్రీం = కాగలదని, ఉత్పశ్యామి = ఊహిస్తున్నాను, తలచుచున్నాను.

తా:- మిత్రమా! చక్కగా నూరి (మథించి) తయారు చేసిన కాటుకవలె మృదువుగా, స్నిగ్ధంగా నల్లగా నిగనిగలాడుతూ మెరిసే నీవు, అప్పుడే ఖండించిన ఏనుగు దంత శకలాలవలె తెల్లగా ఉన్న కైలాసగిరిని చేరితే ఎలా ఉంటుందో ఊహించగలను. తెల్లనైన

ఆ గిరి, దానిపైన కాంతివంతుడవైన నీవు, [illegible] ని భుజాలపై
In Public domain. Digitization Muthulakshmi Research Academy
నీలాంబరమును అలంకరించితే (కప్పితే) ఎలా ఉంటుందో అలా చూడముచ్చటగా ఉంటుంది ఆ దృశ్యం. కనుమూసి తెరిచేంతలో ఆ అందాన్ని చూడటంలో అమూల్యక్షణాలు వ్యర్థమౌతాయేమోనని రెప్పపాటు లేకుండా అలా కళ్ళు విప్పార్చుకుని చూడాలనిపించే కమనీయమైన దృశ్యం అది.

వి:- సంస్కృతంలో నీల, కృష్ణవర్ణాలు సాధారణంగా ఒకే అర్థంలో ప్రయోగించ బడతాయి. ఈ వర్ణనలో కవి హృదయాన్నంతా నింపుకున్న భావాతిశయాన్ని కళ్ళను విప్పార్చుకుని వాటి ద్వారా ప్రకటిస్తున్నట్లుగా ఉంది. ఇచట 'ఉపమాలంకారం' కూర్చబడింది.

ఇక కైలాసగిరిపై గౌరీశంకరుల విహారవర్ణనం సాగుతుంది.

హిత్వా తస్మిన్ భుజగవలయం శంభునా దత్తహస్తా
క్రీడాశైలే యది చ విహరేత్పాదచారేణ గౌరీ,
భంగీభక్త్యా విరచితవపుః స్తంభితాంతర్జలౌఘః
సోపానత్వం కురు మణితటారోహణాయాగ్రయాయీ. 64

ప్ర.అ:- తస్మిన్ క్రీడాశైలే = అచటి క్రీడా పర్వతమున, భుజగవలయం = సర్పకంకణాన్ని (నాగాభరణాన్ని), హిత్వా = తీసివేసి, శంభునా = శివునిచేత, దత్తహస్తా = చేయి అందించబడినదై (చేయందుకుని), గౌరీ = గౌరీదేవి, పాదచారేణ = కాలినడకనే, యది చ విహరేత్ = ఒకవేళ విహరించినట్లైతే, త్వం = నీవు, భంగీభక్త్యా = మెట్లను ఏర్పరచటం చేత, విరచితవపుః = నీ శరీరాన్ని దిద్దుకున్నవాడవై (మెట్లుగా), స్తంభిత = ఆపబడిన, అంతః జలౌఘః = నీటి ప్రవాహము లోపల గలవాడవై, మణితట = మణితటాన్ని ఆరోహణాయ = అధిరోహించుటకు, అగ్రయాయీ = ముందునడుస్తూ, సోపానత్వం = సోపానములుగా, కురు = చేయుము.

తా.- అది గౌరీశంకరనిలయము. వారి విహార ప్రదేశము. అక్కడ వారి క్రీడాశైలమున్నది. ఆ ప్రేమ విహారవేళ తన చేతికున్న భుజగవలయాన్నితీసివేసి (పార్వతి భయపడుతుందని భావించి) పరమశివుడు, తన అర్ధాంగికి చేతినందిస్తాడు. ఆ చేయందుకుని గౌరీదేవి ఒకవేళ కాలినడకనే విహారార్థం బయలుదేరితే (ఆ సుకుమారి పాదాలు కందిపోకుండా) నీ శరీరాన్ని వివిధభాగాలుగా అంచెలంచెలుగా మలచుకో.

In Public domain. Digitization Muthulakshmi Research Academy
మణితటాన్ని అధిరోహించబోయే ఆ దంపతులకు ముందునడుస్తూ వారికి నీ శరీరమే సోపానపంక్తిగా అమర్చి ధన్యుడవు కమ్ము. నీలోని జలాన్ని నీలోపలే స్తంభింపజేయి. బయటకు కురవనీయకు.

వి.- మేఘమేమిటి? సోపానపంక్తి ఏమిటి? సుమసుకుమారమైన గిరితనయ పాదాలు కంది పోకుండా ఉండాలంటే దూదిపింజలా స్నిగ్ధసుకుమారంగా తేలిపోయే సోపానాలు కావాలా? పార్వతీపరమేశ్వరుల పట్ల కాళిదాసుకు గల భక్తి ప్రేమలకు ఇంతకన్నా గొప్ప నిదర్శనం కావాలా ? ఆ కవి హృదయాంగణంలో సుప్రతిష్ఠితులైన ఆదిదంపతులు వారు.

ఈ శ్లోకంలో 'భుజగవలయం' అన్నచోట 'రూపకాలంకారం' ఉంది. కాళిదాస కవి మనోవీధిలో తళుక్కుమన్న మరో మధురభావన రాబోయే శ్లోకం.

తత్రావశ్యం వలయకులిశోద్ఘట్టనోద్గీర్ణతోయం
నేష్యంతి త్వాం సురయువతయో యంత్రధారా గృహత్వం,
తాభ్యో మోక్షస్తవయది సఖే ఘర్మలబ్ధస్య న స్యాత్
క్రీడాలోలాః శ్రవణపరుషై ర్గర్జితైర్భాయయేస్తాః. **65**

ప్ర.అ:- తత్ర = ఆ కైలాసమందు, సురయువతయః = దేవకాంతలు, అవశ్యం = తప్పకుండా, వలయకులిశ = కంకణముల యొక్క అగ్రభాగముల, ఉద్ఘట్టన = తాకిడిచేత, పొడుచుటచేత, ఉద్గీర్ణతోయం = జలాన్ని వెలువరించేట్లుగా, త్వాం = నిన్ను, యంత్ర-ధారా గృహత్వం = నీటిని చిమ్మే జలయంత్రాలస్థానంగా, నేష్యంతి = చేస్తారు (ఆ దశకు తీసుకు వెళతారు), సఖే! = ఓ సఖా!, ఘర్మలబ్ధస్య = వేసవికాలమున లభించిన, తవ = నీకు, తాభ్యః = ఆ యువతులనుండి, మోక్ష = విడుదల, యది = ఒకవేళ, న స్యాత్ = కలుగనిచో, క్రీడాలోలాః = వినోదలీలలలో ఉన్న, తాః = వారిని, శ్రవణపరుషైః = కర్ణకఠోరములైన, గర్జితైః = గర్జనలతో, భాయయేః = భయపెట్టుము.

తా:- ఆ కైలాసగిరియందు దేవకాంతలు విహరింతురు. అది 'దేవతాత్మ' దేవ నివాసం కదా! ఆ యువతులు మేఘునిలా ఆకాశవీథిలో సంచరించగలరు. అందుచేత యక్షుడు మేఘుని ఇలా హెచ్చరిస్తున్నాడు - "సఖా! నీవా కైలాసగిరియందు పయనించే సమయంలో అక్కడ ఉన్న సురభామినులు గ్రీష్మతాపాన్ని హరించగల నీవు (గ్రీష్మ సమయంలో) కనిపించటంతో తప్పనిసరిగా వారి కంకణాల అగ్రభాగాలతో నిన్ను పొడిచి,

In Public domain. Digitization Muthulakshmi Research Academy

నీపై ప్రహారాలు చేసి నీవు నీలోని జలధారలు వెలువడేట్లుగా చేస్తారు. జలధారలు అంతటా చిమ్మే నీ దశ జలయంత్రాల గృహంలా మారుతుంది. ఈ విధంగా వారిచేత చిక్కిన నీకు ఎంతకూ మోక్షం(విడుదల) లభించకపోయినట్లైతే, ఆటపాటలలో మునిగి ఉన్న ఆ యువతులను, కర్ణకఠోరమైన నీ గర్జనలతో (ఉరుములతో) భయపెట్టి నిన్ను వదలునట్లు చేయుము.

వి:- గ్రీష్మతాపంతో తప్తులైనవారికి జలధారాయంత్రాల క్రింద ఆడుకోవటం ఎంతో హాయినిస్తుంది. కంకణాలతో ప్రహారం అంటే అందుకోవాలని చేతులు సాచి పైపైకి ఎగరటం. అలాంటప్పుడు ఆ కంకణాల అగ్రభాగాలు (డిజైన్ల భాగాలు) గ్రుచ్చుకొనక తప్పదు. అయితే ఎంత క్రీడాసక్తులైనా ఉరుములకు భయపడటం స్త్రీలకు సహజం. అందుచేత మరీ ఆటపట్టిస్తుంటే హుంకరించి వారిని భయపెట్టి తప్పించుకొమ్మని మేఘునకు యక్షుని సలహా.

ఇంతటి మనోహర ప్రదేశాన్ని చూడగలిగిన మేఘునకు ఆనందం కలుగకుండా ఉంటుందా? ఆ ఆనందాన్ని వర్ణిస్తున్నాడు యక్షుని మాటల్లో కవి.

హేమాంభోజ ప్రసవి సలిలం మానసస్యాదదానః
కుర్వన్కామం క్షణముఖపటప్రీతిమైరావతస్య,
ధున్వన్కల్పద్రుమ కిసల యాన్యంశుకాని స్వవాతై-
ర్నానా చేష్టైర్జలద లలితైర్నిర్విశేస్తం నగేంద్రమ్. **66**

ప్ర.అ:- జలద! = ఓ మేఘుడా! హేమ అంభోజప్రసవి = స్వర్ణకమలాల్ని ప్రసవించే, మానసస్య = మానససరోవరం యొక్క, సలిలం = జలాన్ని, ఆదదానః = గ్రహిస్తున్న నీవు, ఐరావతస్య = ఐరావతమునకు, క్షణముఖపటప్రీతిం = జలపానసమయమున ముఖముపై ఆచ్ఛాదించుకునే వస్త్రం పట్ల ప్రీతిని, కుర్వన్ = కలిగించుచూ, కల్పద్రుమ కిసలయాని = కల్పవృక్షం యొక్క లేత చిగుళ్ళను, అంశుకాని ఇవ = వస్త్రముల వలె, వాతైః = వాయువులచే, ధున్వన్ = కదిలించుచూ, విదిలించుచూ, లలితైః = సుకుమారములైన, నానాచేష్టైః = వివిధచేష్టల చేత, తం నగేంద్రం = ఆ పర్వతమును, ఆపర్వతముపైన, కామం =యథేచ్ఛగా, నిర్విశేః = అనుభవించుము, నివసించుము.

తా:- ఓ జలదా ! మనోహరమైనది మానససరోవరము. అది స్వర్ణకమలాలకు పుట్టినిల్లు. అలాంటి ఆ సరోవర దివ్యజలాన్ని గ్రహించేందుకు నీవు వెళ్లిన సమయంలో

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఐరావతం కూడా అక్కడికి రావచ్చును. అది సాక్షాత్తు ఇంద్రుని గజము. అది నీరు త్రాగే సమయంలో నీవు దానిముఖంపై వస్త్రంలా (జలతారుముసుగులా) అమరి దానికి ఆనందాన్ని కల్గించు. ఆ దివ్య ప్రదేశంలో నీవు స్వేచ్ఛగా విహరించు. కల్పవృక్షాల లేలేత చిగుళ్ళను మృదువైన వస్త్రాలను వలె నీ గాలులతో ఊగిసలాడించు. ఇంకా నీకిష్టమైన వివిధ చేష్టలతో ఆనందంగా ఆ పర్వతంపై విహరించు. హాయిగా నివసించు.

ఈ శ్లోకంలో 'ఉత్రేక్షాలంకారం' ఉంది.

మేఘుని ప్రయాణం ముగిసిపోతుంది. ఇక అలకాపురిని చేరనున్నాడు.

తస్యోత్సంగే ప్రణయిన ఇవ స్రస్తగంగాదుకూలాం
న త్వం దృష్ట్వా న పునరలకాం జ్ఞాస్యసే కామచారిన్,
యా వః కాలే వహతి సలిలోద్గారముచ్చైర్విమానా
ముక్తాజాల గ్రథితమలకం కామినీవాభ్ర బృందమ్. **67.**

ప్ర.అ:- కామచారిన్ = ఓ స్వేచ్ఛావిహారీ!, ప్రణయినః (ఉత్సంగే) ఇవ = ప్రియతముని ఒడిలో వలె, తస్య = ఆ కైలాన గిరి యొక్క ఉత్సంగే = ఉపరి భాగమున (సమీపమున), స్రస్తగంగా దుకూలాం = జారిపడిన గంగ అనే పట్టు వస్త్రముగల, అలకాం = అలకాపురిని, దృష్ట్వా = చూచి, త్వం = నీవు, పునః = మరల, న జ్ఞాన్యసే ఇతి న = గుర్తించకపోవటం అనేది లేదు (అలాంటి చిరస్మరణీయమైనది), ఉచ్చైః విమానా = ఎత్తుగా ఎన్నో అంతస్తులతో ఉన్న భవనముల కల (కామిని విషయంలో తొలగింపబడిన అధిక ప్రణయ కోపం కల), యా = ఏ అలకాపురి ఐతే, వః = మీ యొక్క, కాలే = వర్షకాలమున, సలిల ఉద్గారం = నీటిని వెలువరించు, అభ్ర బృందం = మేఘ సముదాయాన్ని, కామినీ = అందమైన యువతి, ముక్తా జాల గ్రథితం = ముత్యపు సరులతో కూర్చబడిన, అలకం ఇవ = ముంగురులను వలె, వహతి = వహించుచున్నదో.

తా:- ఓ స్వేచ్ఛా విహారీ! జలదా! ప్రియుని ఒడిలో జారిన దుకూలంతో విలసిల్లే ప్రియురాలిలా, ఆ కైలాసగిరి పైభాగంలో గంగానదియే జారిన వస్త్రంగా అలకాపురి విరాజిల్లుతుంది. అందమైన యువతిని వలె ఆ అలకాపురిని ఒకసారి చూస్తే తిరిగి గుర్తించకపోవటమంటూ ఉండదు (ఎన్నటికీ మరువలేని అందం). ఎన్నో అంతస్తులు గల ఎత్తైన భవనాలతో శోభిల్లే ఆ అలకాపురం ప్రణయకోపం తొలగిన మానినిలా మనోజ్ఞంగా ఉంటుంది. అందమైన ముత్యాల సరులతో తన నీలిముంగురులను

అలంకరించుకొనినట్లు, ఆ అలకాపురి, జలధారలతో కూడిన నీలిమేఘబృందాల్ని ధరిస్తుంది.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వి. – ప్రియుని ఒడిలో ప్రియురాలు ఆనందంగా ఉంటుంది. అలాంటి ఆనందమయ ప్రదేశం అలకాపురి. వర్షాకాల నీలిమేఘాలు ఆ నగరం యొక్క నీలికేశపాశం. అందులోనుంచి కురిసే జలధారలు, ఆ శిరోజాలపై జాలువారే ముత్యాలసరులు. ఇదీ కాళిదాస ఉపమా సౌందర్యం.

ఈ శ్లోకంలో 'ఉపమ' 'శ్లేష' అలంకారాలు ఉన్నాయి.

యక్షుడు మొదటే చెప్పాడు మేఘునితో ముందుగా మార్గాన్ని వివరిస్తాననీ, తరువాత సందేశాన్ని తెలియజేస్తాననీ. 'పూర్వమేఘం' అంతా ప్రకృతివర్ణనతో నిండి ఉంటుంది. 'ఉత్తరమేఘంలో' అలకాపురి, యక్షిణి వర్ణనలు ఉంటాయి. ఒక రకంగా చెప్పాలంటే పూర్వమేఘపు ప్రకృతివర్ణన అంతా సంభోగ శృంగారవిలసితం. ఉత్తరమేఘంలోనే విప్రలంభశృంగారం పోషించబడింది. ఈ 'పూర్వమేఘం' అపూర్వమేఘం అని చెప్పాలి. కేవలం ప్రతిపదార్థాల అధ్యయనం రసాస్వాదనకు సరిపోదు. ఇది దిక్ దర్శనం మాత్రమే. మేఘునికి యక్షుడు మార్గాన్ని వివరించినట్లు మార్గదర్శనం మాత్రమే యీ వివరణ. జిజ్ఞాసువులు ఇంకా విశేషాధ్యయనం చేయాలి.

కాళిదాస మానస సంచారం మేఘుడు మానససరోవరం చేరటంతో ముగుస్తుంది.
ఇది పూర్వ మేఘం. ఉత్తర మేఘం కొరకు కొంతకాలం వేచి ఉండాల్సిందే.

❋ ❋ ❋ ❋ ❋

In Public domain. Digitization Muthulakshmi Research Academy

In Public domain. Digitization Muthulakshmi Research Academy

In Public domain. Digitization Muthulakshmi Research Academy

రచయిత్రి ఇతర రచనలు

తెలుగు

1. వేదాంతసార
2. సాంఖ్యకారికలు
3. భారత సూక్తి సుధా బిందువులు
4. బాణవాణీరామణీయకం
5. అశ్వఘోషుని అద్భుత కావ్యద్వయీ

ENGLISH

1. Ancient Indian Administration, Cosmo publications, New Delhi
2. Kautilyan Penal Code (out of print)
3. Sarvajna Singa Bhupala - Monograph, Sahitya Akademi, New Delhi
4. Technical Words in the works on Ancient Indian Polity